తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 19.07.2026 | సంపుటి : 12 సంచిక : 360 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698





# జనహృదయ చైతన్యం అందెశ్రీ

## ఆయన రాసిన 'జయజయహే' గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తుంది:సీఎం రేవంత్

- దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి
- మహనీయుడిని గత ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసింది
- ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ఎండలో నిలబెట్టింది
- రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి
- ముఖ్యమంత్రి భూమి పూజ



**మేడ్చల్/ఘట్‌కేసర్(జనంసాక్షి):** దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయ కుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించి నవ్వుదే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు." నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు మిగతా 2లో..

## ఆహార కల్తీపై ఉక్కుపాదం

- ప్రజల ప్రాణాలతో చెలగామాడితే కఠిన చర్యలు
- ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం
- ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం
- సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు
- వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలన
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

2లో..

## అథ్లెట్ ప్రవల్లికకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు

## భారత అంతరిక్ష చరిత్రలో నూతన అధ్యాయం

### రోదసిలో ప్రముఖ స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ చరిత్ర

### పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1 విజయవంతం



**శ్రీహరికోట(జనంసాక్షి):** భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. ప్రముఖ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1 శనివారం నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్)లోని మొదటి మిగతా 2లో..

## ఇది మొదటి అడుగు మాత్రమే

స్కైరూట్ వ్యవస్థాపకులను అభినందించిన మోదీ

2లో..

## హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్

దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ

విక్రమ్-1' విజయవంతంపై సీఎం రేవంత్ హర్షం



## ఆసుపత్రికి వాంగ్‌చుక్ బలవంతంగా తరలింపు

- హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం
- తన అనుమతి లేకుండా ఎలాంటి చికిత్స చేయొద్దన్న భార్య
- సోనమ్ వాంగ్‌చుక్ చికిత్సకు నిరాకరిస్తున్నారు : వైద్యులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 21 రోజులుగా నిరాహారదీక్ష చేస్తోన్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శనివారం ఆసుపత్రికి తరలించారు. ఆయనకు తగిన వైద్యసహాయం అందించాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో నిరసన ప్రాంతం నుంచి పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. మిగతా 2లో..

## మా ఉద్యమం ఆగదు

- వాంగ్‌చుక్ తరలింపుతో నిరాహార దీక్షకు దిగిన అభిజీత్ దీప్కే
- 20న సంసద్ మార్చ్ కొనసాగుతుందని స్పష్టీకరణ

2లో..

## సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై సిరా దాడి

తన మద్దతుదారులతో సమావేశంలో ప్రసంగిస్తుండగా ఘటన

## చర్చలు జరపకుండా ఎలా తరలిస్తారు?

- మండిపడ్డ ప్రతిపక్ష పార్టీలు
- పోలీసుల చర్యను తప్పుబట్టిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- అసత్యం, హింసలే మోదీ ప్రభుత్వానికి మూల సిద్ధాంతాలని విమర్శ



వార్త 2లో

### 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపించండి

## రాజకీయాల నుంచి తప్పుకుంటా..



- రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- తెలంగాణలో సాగుతోంది లూటీ
- కేటీఆర్ బీఆర్ఎస్ యువ సంగ్రామ సభలో ఘాటు విమర్శలు

**హైదరాబాద్,జూలై18(జనంసాక్షి):** ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్ నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్యకాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, మిగతా 2లో..

### జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా

## 'కమిటీ కుర్రాళ్లు'





- ఉత్తమ నటుడిగా మమ్ముట్టి
- ఉత్తమ నటిగా యామి గౌతమ్
- జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలనుకేంద్రం ప్రకటించింది. 2024 సంవత్సరానికి గానూ మొత్తం 400లకు పైగా చిత్రాలు జ్యూరీ ముందుకు రాగా, వాటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాటిని ఎంపిక చేసినట్లు కమిటీ తెలిపింది. ఉత్తమ నటుడి అవార్డును ఇద్దరు పంచుకున్నారు. 'చందూ ఛాంపియన్', 'భ్రమయుగం'లో నటనకు గానూ కార్తిక్ ఆర్యన్, మమ్ముట్టిలను ఈ అవార్డు వరించింది. ఉత్తమ నటిగా యామి గౌతమ్ (ఆర్టికల్ 370) పురస్కారానికి ఎంపికయ్యారు. ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియాసామి (అమరన్) ఎంపికయ్యారు. ఉత్తమ తెలుగు చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' జాతీయ పురస్కా రానికి ఎంపికైంది. అలాగే ఉత్తమ తమిళ చి త్రంగా 'రాయన్' నిలిచింది.

**జాతీయ చలన చిత్ర అవార్డు విజేతలు వీళ్లే**

ఉత్తమ నటుడు: కార్తిక్ ఆర్యన్ (చందూ ఛాంపియన్),ఉత్తమ నటుడు: మమ్ముట్టి (భ్రమయుగం),ఉత్తమ నటి: యామి గౌతమ్ (ఆర్టికల్ 370),ఉత్తమ చిత్రం: ఆర్టికల్ 370 (ఆదిత్య సుహాస్ జంబాలే)

**ఉత్తమ దర్శకత్వం:** అమరన్ (రాజ్‌కుమార్ పెరియసామి)

ఉత్తమ సహాయ నటి: మిథ్య (రూపశ్రీ వర్కాడే)

ఉత్తమ సహాయ నటి: సచన నమిదాస్ (మహారాజ)

ఉత్తమ సహాయ నటుడు: సంజయ్ మిశ్రా

మిగతా 2లో..

## ఎల్‌నినో ప్రభావంపై సర్కారు అప్రమత్తం

- డాక్టర్ చిన్నారెడ్డి అధ్యక్షతన నిపుణుల కమిటీ
- రాష్ట్రం నుంచి గ్రామ స్థాయి వరకు కార్యాచరణ ప్రణాళికలు



**హైదరాబాద్, జూలై 18 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయం, అనుబంధ రంగాలకు ఎదురయ్యే ఇబ్బందులను ముందుగానే అంచనా వేసి రైతులను రక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి నిపుణుల కమి టీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ 427వ ప్రభుత్వ ఉత్తర్వులను శనివారం జారీ చేసింది. పరిశోధనా సంస్థలు, విశ్వవి ద్యాలయాలు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికా రులతో కూడిన ఈ కమిటీ ఎల్‌నినో ప్రభావాన్ని అధ్యయనం చేసి, రాష్ట్రం, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించనుంది. వ్యవ సాయం, ఉద్యానవ నం, పశుసంవర్ధక, అటవీ, నీటిపారుదల తదితర అనుబంధ రంగాల్లో తీసుకోవాల్సిన ఉపశమన, అనుసరణ చర్యలపై ప్రభు త్వానికి సిఫార్సులు చేయనుంది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి కమిటీకి అధ్య క్షుడిగా నియమితులయ్యారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, విద్య, అటవీ, పశుసంవర్ధక, నీటిపారుదల, ఇంధన శాఖల ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. అలాగే ఉద్యాన శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం, రాష్ట్ర సహకార మార్కెటింగ్ మిగతా 2లో..

### భూసేకరణలో ఉద్రిక్తత..

## అధికారులపై కారంపొడి దాడి


- బహదూర్‌గూడలో బుల్లెట్ రైలు భూసేకరణకు రైతుల ప్రతిఘటన
- అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం భూముల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరిక
- ఐదు రోజులుగా కొనసాగుతున్న ఆందోళన



**శంషాబాద్‌జూలై18(జనంసాక్షి):** శంషాబాద్ బహదూర్ గూడలో ఉద్రిక్తత నెలకొంది. బుల్లెట్ ట్రైన్ కోసం భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. బహదూర్ గూడా భూముల దగ్గరకు హైడ్రా అధికారులు భారీగా చేరుకున్నారు. భూముల వ్యవహారంలో ఐదు రోజు లుగా రైతుల ఆందోళన కొనసాగుతోంది. స్పష్టమైన హామీ ఇచ్చాకే భూములు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బహ దూర్‌గూడ భూముల జోలికొస్తే ఖబర్దార్ అంటూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ మిగతా 2లో..

## హర్మూజ్ జలసంధిలో చమురు ట్యాంకర్ల పేలుడు

### సీమైన్స్ ఢీకొనడంతో ప్రమాదం: ఐఆర్‌జీసీ




**టెహ్రాన్(జనంసాక్షి):** పశ్చిమాసియా కొన్నిరోజులుగా దద్దరిల్లుతూనే ఉంది. ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో అంతరాయాలు కొనసాగుతున్నాయి. తమ హెచ్చరికలు పట్టించుకోని నౌకలపై ఇప్పటికే అమెరికా-ఇరాన్ దాడులు చేస్తుంటే.. మందుపాతరలు మరో ముప్పుగా మారాయి. యుద్ధం ప్రారంభమైన సమయంలో ఇరాన్ వాటిని హర్మూజ్‌లో పరిచిన సంగతి తెలిసిందే. రెండు చమురు ట్యాంకర్లు వాటిని ఢీకొట్టడంతో పేలిపోయాయని శనివారం ఐఆర్‌జీసీ వెల్లడించింది."కొద్దిసేపటి క్రితం హర్మూజ్‌లో ముందుపాతరలు ఉన్న ప్రాంతం మీదుగా వెళ్లిన రెండు చమురు ట్యాంకర్లు పేలిపోయాయి. అమెరికా నిఘా సంస్థలు ఇచ్చిన సమాచారంతో ఈ నౌకలు సదరు మార్గం మీదుగా ప్రయాణించాయి" అని ఐఆర్‌జీసీ ప్రకటించింది. అలాగే ఈ జలమార్గం మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించిన నాలుగు నౌకలను అడ్డుకున్నామని వెల్లడించింది. మరోవైపు ఏడోరోజు ఇరాన్‌పై దాడులు కొనసాగాయి. దాంతో దక్షిణ ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇలాగే మరో రెండు, మూడు రోజులు దాడులు కొనసాగితే తాము పూర్తిస్థాయి ఘర్షణకు దిగుతామని ఇరాన్ హెచ్చరించింది. "మేము దీటుగా స్పందిస్తాం. అలాగే ఏ సరిహద్దు కూడా సురక్షితంగా ఉండదు" అని పేర్కొంది. యూఎస్ స్థావరాల లక్ష్యంగా ప్రతీకార దాడుల్ని కొనసాగించింది. కువైట్, జోర్డాన్‌పైకి క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. మిగతా 2లో..

## ఖండించిన అమెరికా

ఐఆర్‌జీసీ అసత్య ప్రచారమే

అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టీకరణ

**వాషింగ్టన్(జనంసాక్షి):** హర్మూజ్‌లో సీమైన్లను ఢీకొట్టి రెండు చమురు ట్యాంకర్లు పేలినట్లు ఇరాన్ చేసిన ప్రకటనను అమెరికా ఖండించింది ఎప్పటిలాగే ఐఆర్‌జీసీ అసత్య ప్రచారం మిగతా 2లో..





## బాణసంచా కర్మాగారంలో ఘోర పేలుడు

ఎనిమిది మంది దుర్మరణం • అహ్మదాబాద్‌లో విషాద ఘటన

**అహ్మదాబాద్(జనంసాక్షి):** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. నగర శివారులోని రామోల్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మందికిపైగా గాయపడ్డారు. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఫ్యాక్టరీ లైసెన్సు రద్దు చేసి నప్పటికీ.. అక్కడ అక్రమంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, ఈ క్రమంలోనే ఓ యూనిట్‌లో పేలుడు సంభవించినట్లు సమాచారం. ఘ ట నా స్థలికి చేరుకున్న రెస్క్యూ బృందాలు.. సహాయక చర్యలు చేపట్టా యి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు.

# ఆసుపత్రికి వాంగ్‌చుక్ బలవంతంగా తరలింపు

ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఆయన్ను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని సమాచారం."కోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను తరలిస్తోన్న సమయంలో నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరించాలని, వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని కోరుతున్నాం" అని దిల్లీ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.నా అనుమతి లేకుండా ఎలాంటి చికిత్సా వద్దు..

తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి చికిత్సా అందించొద్దని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె ఆంగ్మో డిమాండ్ చేశారు. "ఆయన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతిలేకుండా చికిత్స ప్రారంభించవద్దు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతిఒక్కరిని బాధ్యుల్ని చేస్తాను. ఆయన నిన్న బాగానే కనిపించారు. ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం లేదు. మా వైద్యుడి అనుమతి లేకుండా ఏ చికిత్సా అందించడానికి వీలు లేదు. అది మా హక్కు " అని మీడియాతో మాట్లాడారు.

సోనమ్ వాంగ్‌చుక్ చికిత్సకు నిరాకరిస్తున్నారు : వైద్యులు

సామాజిక ఉద్యమకారుడు, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ చికిత్స తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని వైద్యులు తెలిపారు. ఇరవై రోజులుగా నిరాహార దీక్ష చేయడంవల్ల ఆయన చాలా బలహీనంగా తయారయ్యారని వెల్లడించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ నిరాహార దీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు ఈరోజు ఉదయం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి ఉదయం 7.40 గంటలకు వాంగ్‌చుక్‌ను తీసుకొచ్చారని బులెటిన్‌లో తెలిపింది. ఇరవై రోజులుగా ఘనాహారం తీసుకోకపోవడం వల్ల ఆయన తీవ్ర నీరసంతో ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. ఆసుపత్రిలో చేర్చిన సమయంలో ఆయనకు స్పృహ ఉందని, పల్స్, రక్తపోటు, ఆక్సిజన్ స్థాయిలు నిలకడగా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే శరీరంలో నీటి శాతం తగ్గిన లక్షణాలు (డీహైడ్రేషన్) కనిపించాయని చెప్పారు.వైద్యులు ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్ (ఐవీ ద్రవాలు), ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్‌తోపాటు అవసరమైన మందులు తీసుకోవాలని సూచించారు. కానీ వాటన్నింటినీ వాంగ్‌చుక్ తిరస్కరించినట్టు ఆసుపత్రి తెలిపింది. ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చికిత్స తీసుకోవాలని వైద్యులు కౌన్సెలింగ్ చేస్తున్నట్టు వెల్లడించింది. ఆసుపత్రిలో చేర్చిన కొద్దిసేపటికే వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జే ఆంగ్మో స్పందించారు. తన అనుమతి లేకుండా ఎలాంటి చికిత్స చేయొద్దని అన్నారు.వైద్య చికిత్స విషయంలో పారదర్శకత లేదని ఆరోపిస్తూ ఆయనను డిశ్చార్జ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలోనూ ఆయన దీక్ష కొనసాగిస్తున్నారని తెలిపారు.

## చర్చలు జరపకుండా ఎలా తరలిస్తారు?

న్యూఢిల్లీ(జనంసాక్షి):లోకసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ- శనివారం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 20 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న విద్యా సంస్కరణల ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్ మంతర్ నిరసన స్థలం నుంచి దిల్లీ పోలీసులు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ మేరకు ఎక్స్‌లో (ట్విట్టర్) స్పందించిన రాహుల్ గాంధీ 'అసత్యం, హింసే మోదీ ప్రభుత్వ మూల సిద్ధాంతాలు. అహింసా మార్గంలో నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్ మంతర్ నుంచి తరలించడం తప్పు.' అని పోస్ట్ చేశారు. దేశ భవిష్యత్తుకు పేపర్ లీకులు, పెరుగుతున్న విద్యా ఖర్చులు, విద్యార్థుల ఆత్మహత్యలు అత్యంత కీలకమైన సమస్యలని రాహుల్ పేర్కొన్నారు. ప్రభుత్వం పోలీస్ బలగాల్ని ఎంతలా ఉపయోగించినప్పటికీ ఈ అంశాలపై స్వరం వినిపిస్తున్న విద్యార్థులను, వారికి మద్దతుగా నిలిచే తమ లాంటి వారిని అడ్డుకోలేరని అన్నారు.

## మా ఉద్యమం ఆగదు..

న్యూఢిల్లీ(జనంసాక్షి):పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో ఈ ఉద్యమం ఆగిపోదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఇక నుంచి తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు."ఈ రోజు నుంచి దీక్ష ప్రారంభిస్తున్నాను. వెనకడుగు వేయొద్దని మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రతి ఒక్కరు జంతర్‌మంతర్‌కు రావాలని కోరుతున్నాను. జులై 20న జరగాల్సిన పాదయాత్రను కొనసాగిస్తాం" అని వెల్లడించారు.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని వారాల క్రితం కాక్రోచ్ జనతా పార్టీ తొలుత దిల్లీలో నిరసనలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. జులై 20న శాంతియుత మార్చ్ 'చలో సంసద్'ను నిర్వహించనున్నట్లు పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఆ రోజునే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం వాంగ్‌చుక్‌ను ఉంచిన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రకటన విడుదల చేశారు. " నిరాహార దీక్ష కారణంగా ఆయన బలహీనపడ్డారు. డీహైడ్రేషన్‌కు గురయ్యారు. నిరంతర వైద్యపర్యవేక్షణ, చికిత్స అందిచాల్సిన అవసరం ఉంది" అని వెల్లడించారు. మరోవైపు ఆసుపత్రిలోకి ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించకపోవడంతో అక్కడి సిబ్బందిపై వాంగ్‌చుక్ భార్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య పరీక్షల వివరాల కాపీ ఇవ్వకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించారు.

## సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై సిరా దాడి

– తన మద్దతుదారులతో సమావేశంలో ప్రసంగిస్తుండగా ఘటన

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై సిరా లాంటి ద్రవంతో ఓ మహిళ దాడి చేసింది. జంతర్ మంతర్ వద్ద దీప్కే తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించి ప్రసంగిస్తుండగా ఈ ఘటన జరిగింది. గుర్తుతెలియని మహిళ వారి సమావేశంలోకి ప్రవేశించి అతనిపై దాడికి పాల్పడింది. దీంతో దీప్కే మద్దతుదారులు మహిళ వైపు ఒక్కసారిగా దూసుకెళ్లడంతో జంతర్ మంతర్ వద్ద కాసేపు గందరగోళం నెలకొంది. అయితే, మహిళ ఎవరు? దాడి వెనుక ఉన్న ఉద్దేశం ఏంటనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. సోనమ్ వాంగ్ చుక్ దీక్ష భగ్నం తర్వాత తాను కూడా నిరశనకు దిగుతానని దీప్కే ప్రకటించిన కాసేపటికే అతనిపై ఈ దాడి జరిగింది. ఘటన అనంతరం ఎక్స్ వేదికగా దీప్కే స్పందించారు. దాడికి సంబంధించిన వీడియోను పోస్టు చేస్తూ 'నీలం నా రంగు... జై భీమ్!' అని ఆయన పేర్కొన్నారు.

## భూసేకరణలో ఉద్రిక్తత.. అధికారులపై కారంపొడి దాడి

ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హెచ్చరించారు. భూములు సాగు చేసుకుంటున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆందోళనకారులు పోలీసులపైకి కారం చల్లి, కుర్చీలు విసిరేశారు. డీసీపీ యోగేశ్ గౌతమ్‌తో సహ పలువురు సీఐల కళ్లలో కారం పడింది. ఈ క్రమంలో రైతులకు మద్దతిస్తున్న నేతలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసరడం సరికాదని డీసీపీ యోగేశ్ గౌతమ్ అన్నారు. ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ మాత్రమే వేస్తున్నామని, సాగులో ఉన్న పంటను పాడు చేయడం లేదని అన్నారు. రైతులు శాంతియుతంగా నిరసన తెలపాలని కోరారు. ఉదయం కూడా రైతులు ఇక్కడ ఆందోళన చేపట్టారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సేకరించిన స్థలంలో కంచె వేసేందుకు వెళ్లిన రెవెన్యూ, హైడ్రా అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. 650 ఎకరాల భూమికి హైడ్రా సాయంతో కంచె వేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. కంచె వేయడాన్ని నిరసిస్తూ ఆర్డీవో శ్రీధర్‌తో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఉదయం నుంచి నిరసనలు కొనసాగుతుండగా.. తాజాగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.

# ఆహార కల్తీపై ఉక్కుపాదం

హైదరాబాద్,జూలై18 (జనంసాక్షి):

ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.

## ఎల్‌నినో ప్రభావంపై సర్కారు అప్రమత్తం

సమాఖ్య, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, రాష్ట్ర నూనెగింజల ఉత్పత్తిదారుల సమాఖ్య, నాబార్డు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రతినిధులు కూడా కమిటీలో చోటు దక్కించుకున్నారు.అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన సంస్థ, భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ, భారత నూనెగింజల పరిశోధన సంస్థ, కేంద్ర మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, భూగర్భ జలాల శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, జాతీయ విత్తన సంస్థ ప్రతినిధులు కూడా సభ్యులుగా వ్యవహరించనున్నారు. వ్యవసాయ శాఖ సంచాలకుడు కమిటీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు.ఈ కమిటీ అవసరమైనప్పుడు సమావేశాలు నిర్వహించి అన్ని వర్గాల అభిప్రాయాలు సేకరించి రాష్ట్రం నుంచి గ్రామ స్థాయి వరకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు, సిఫార్సులు సమర్పించనుంది.

## జనహృదయ చైతన్యం అందెశ్రీ

ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు.కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడు" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## అథ్లెట్ ప్రవల్లికకు సీఎం రేవంత్ అభినందనలు

హైదరాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): చైనాలోని ఒర్డోస్‌లో జరిగిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4-400 మీటర్ల రిలే పోటీలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆధ్వర్యంలోని గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని నరిమళ్ల ప్రవల్లికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి ప్రవల్లిక ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభినందించిన సిఎం క్రీడలకు తెలంగాణ కేంద్రంగా మారాలని అభినందించారు. ప్రవల్లికకకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

### 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపించండి

## రాజకీయాల నుంచి తప్పుకుంటా

ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు.

## 'తుంగభద్ర'పై హైపవర్ కమిటీ తొలి సమావేశం 27న

**అమరావతి(జనంసాక్షి):**తుంగభద్ర పరీవాహక ప్రాంతంలోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర అధ్యయనం కోసం కేంద్రం ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ తొలిసారిగా ఈనెల 27న ఢిల్లీలో కేంద్ర జలసంఘం కార్యాలయంలో సమావేశం కానుంది. సీడబ్ల్యూసీ సభ్యుడుయోగేష్ పైథంకర్ అధ్యక్షతన ఏపీ ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, కర్ణాటక జలవనరుల శాఖ కార్యదర్శి బీఎస్ శివశంకర్, తెలంగాణ ఈఎన్‌సీ ఓవీ రమేష్ బాబు, సీడబ్ల్యూసీ సీఈలు అభిషేక్ బెనర్జీ, సంజయ్ గంగ్వార్, శరబ్‌జీత్‌సింగ్ భక్షీ, ఓంప్రకాష్ గుప్తా సభ్యులుగా ఉన్న ఈ కమిటీకి తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఆస్మా ఖాతూన్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. గత నెల 25న తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్ల ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తోపాటు ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ హాజరై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుంగభద్ర జలాల వినియోగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు లోబడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇచ్చేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తామని సీఆర్ పాటిల్ ప్రకటించారు.

## హర్మూజ్ జలసంధిలో చమురు ట్యాంకర్ల పేలుడు

తమ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. ఎర్రసముద్రంలోని బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేసేందుకు సిద్ధంగా ఉండాలని ఇరాన్ హూతీ రెబెల్స్‌ను కోరింది. అయినా సరే అమెరికా ఆ మౌలిక సదుపాయాలను టార్గెట్ చేసింది. ఇరాన్-హూతీలు కలిసి ఆ జలసంధి మీదుగా జరిగే సముద్ర వాణిజ్యానికి అంతరాయం కలిగించాలని నిర్ణయించుకుంటే.. ఆ పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీయొచ్చని గతంలో యూఎస్ విదేశాంగశాఖలో పనిచేసిన కల్నల్ అబ్బాస్ దహౌక్ ఆందోళన వ్యక్తంచేశారు.

### ఖండించిన అమెరికా

చేస్తోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. హర్మూజ్‌లో రాకపోకలను అమెరికా, ఇరాన్ నియంత్రిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన నౌకలపై దాడులు చేస్తున్నాయి. ఈ క్రమంలో అమెరికా నిఘా సమాచారంపై ఆధారపడి వెళ్లిన రెండు నౌకలు సీమైన్స్‌ను ఢీకొట్టి పేలిపోయాయని ఐఆర్‌జీసీ వెల్లడించింది.తమ దేశంలోని యూఎస్ బేస్‌ల లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తుండటంతో కువైట్ విమాన కార్యకలాపాలను నిలిపివేసింది. అమెరికా సైనిక బలగాలకు ఆశ్రయం ఇస్తోన్న దేశాలపై తమ దాడులు కొనసాగుతూనే ఉంటాయని మరోవైపు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఆ దేశాలు తమ పౌరుల్ని రక్షించుకునే ప్రయత్నాలు చేసుకోవాలని సూచించింది.



# భారత అంతరిక్ష చరిత్రలో నూతన అధ్యాయం

ప్రయోగ వేదిక నుంచి మధ్యాహ్నం 12.05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. ఇందులోని ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా.. సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగాన్ని తాత్కాలికంగా నిలిపివేసి.. శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టారు. ఇంధన ప్రక్రియలో సమస్య ఉన్నట్లు గుర్తించి దాన్ని సరిచేశారు. 35 నిమిషాల తర్వాత రాకెట్‌ను ప్రయోగించారు. దాదాపు 20 నిమిషాల తర్వాత ఈ రాకెట్ నిర్ణీత కక్ష్యను చేరుకుంది. 'హలో స్పేస్.. విక్రమ్-1 వచ్చేసింది' అంటూ ప్రయోగం విజయంపై స్కైరూట్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.

ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్లతో పాటు ప్రధాని మోదీ తన చేతిరాతతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్ని కూడా నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాంల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేగాక, ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ స్కైరూట్ బృంద సభ్యులు, ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులను సైతం ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు.

'మిషన్ ఆగమన్'..

'మిషన్ ఆగమన్' పేరుతో స్కైరూట్ ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టారు. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను రోదసిలోకి పంపించారు. ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి కీలక సమాచారం సేకరించనున్నారు. ఈ సమాచారంతో భవిష్యత్తు వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.సుమారు ఏడు అంతస్తుల భవనం ఎత్తుతో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లో ఎర్త్ ఆర్బిట్(ఎల్ఈఓ)లో ప్రవేశపెట్టే సామర్థ్యం కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా భారత తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో దేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టడం విశేషం.

కుమారుడితో కలిసి వీక్షించిన లోకేశ్

ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాంశ్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్

హైదరాబాద్:భారత్ తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. 'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్' అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతమైన ప్రయోగమన్నారు. శ్రీహరికోట నుంచి విక్రమ్-1 నింగిలోకి దూసుకెళ్లిందని, హైదరాబాద్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ ఘన విజయం సాధించిందని తెలిపారు. భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుందన్నారు. దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ నిలిచిందని సీఎం అన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ శక్తికి ప్రపంచ వేదికపై గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా స్కైరూట్ బృందానికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1.. ప్రైవేట్ స్పేస్ రంగంలో భారత్ సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయాణాలకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడిందని ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## ఇది మొదటి అడుగు మాత్రమే

భారత అంతరిక్షరంగంలో ప్రైవేటు రంగానికి ఘనమైన బాటలు పడ్డాయి. ప్రముఖ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1 విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. దీంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. ఈ ప్రయోగం అనంతరం ప్రధాని నరేంద్రమోదీకి కాల్ చేసి స్కైరూట్ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ చందన, నాగ్ భరత్ మాట్లాడారు."అనుకున్న సమయానికంటే ముందుగానే మీ లక్ష్యాలను సాధించారు. ఈ ప్రయోగాన్ని నేను వీక్షించాను. ఇందులో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ మిషన్ మొదటి అడుగుమాత్రమే. దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలి" అని మోదీ వారిని ప్రశంసించారు. అంతరిక్ష రంగంలో స్వావలంబన సాధించగలమని ప్రపంచానికి చూపించారని కొనియాడారు. ఈ దేశ ఆకాంక్షలను మోసుకెళ్లడమే కాకుండా యువత కలలకు కొత్త ఆశలు తొడిగారని మెచ్చుకున్నారు. అలాగే తనను కలిసేందుకు స్కైరూట్ బృందాన్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రధానికి కృతజ్ఞతలు చెప్పిన పవన్ కుమార్ చందన.. ఈ రాకెట్‌ను పూర్తిగా దేశీయంగా డిజైన్ చేశామని వెల్లడించారు. తమ బృందంలో ఎక్కువమంది యువతే అని.. వారి సగటు వయసు 28 ఏళ్లని తెలియజేశారు.ఈ లాంచ్ లో భాగంగా మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసిన పోస్ట్ కార్డును అంతరిక్షంలోకి పంపించారు. దాని గురించి మోదీ వద్ద పవన్ కుమార్ ప్రస్తావించారు. "మీ కార్డు కక్ష్యలోకి విజయవంతంగా చేరింది. వందేమాతరం కక్ష్యలోకి వెళ్లింది" అని చెప్పారు.

## జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా 'కమిటీ కుర్రాళ్లు'

ఉత్తమ బాలల చిత్రం: చిన్న కథ కాదు (దర్శకుడు-నంద కిషోర్)
ఉత్తమ జాతీయ, విలువల చిత్రం: కెప్టెన్ మిల్లర్ (దర్శకుడు- అరుణ్ మాథేశ్వరన్)
ఉత్తమ ప్రజాదరణ చిత్రం: కల్కి 2898 ఏడీ (నాగ్ అశ్విన్)
ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు: రణ్‌దీప్ హుడా (స్వాతంత్ర్య వీర్ సావర్కర్)
ఉత్తమ యాక్షన్: మహారాజ (తమిళ్)
ఉత్తమ కొరియోగ్రఫీ: విజయ్ గంగూలీ (ఆజ్ కిరాత్ -స్త్రీ2)
ఉత్తమ గేయరచన: మనోజ్ ముంతాషిర్ (జానేదో-మైదాన్)
ఉత్తమ సంగీతం (నేపథ్యం): జీవీ ప్రకాశ్ కుమార్ (అమరన్)
ఉత్తమ సంగీతం (సాంగ్స్) : శశ్వాంత్ సచ్‌దేవ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ మేకప్: పి. రవికుమార్ (కమిటీ కుర్రోళ్ళు)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: దీపాలి నూర్, సీతల్ శర్మ (పుష్ప2)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్: నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 ఏడీ)
ఉత్తమ ఎడిటింగ్: ఆర్ కలైవానన్ (అమరన్)
ఉత్తమ సౌండ్ డిజైన్: మానస్ చౌదరి (భూల్ భూలయ్య 3-హిందీ)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (సంభాషణలు): వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత (అడాప్టెడ్): యోగేశ్ దేశ్‌పాండే (స్వరగంధర్వ సుదిర్ ఫాడ్కే)
ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత (ఒరిజినల్): సుకుమార్ (పుష్ప2)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: షెహనాద్ జలాల్ (భ్రమయుగం)
ఉత్తమ గాయని: వైకోమ్ విజయలక్ష్మి (ఏఆర్ఎం)
ఉత్తమ గాయకుడు: అభయ్ జోథ్ పూర్కర్
ఉత్తమ బాల నటులు: రిద్ధిమాన్ బెనర్జీ, తపోమయ్ దేవ్, గీతాశ్రీ చక్రవర్తి (ఆంకో కి కితిన్ -బెంగాలీ)
ఉత్తమ బాల నటుడు : అరుణ్‌దేవ్ పోతుల (35 - చిన్న కథ కాదు)
ఉత్తమ బాల నటుడు: అతిశ్ శెట్టి
స్పెషల్ మెన్షన్: మెయ్యజగన్-తమిళ్ (ఫిల్మ్ సౌండ్ మిక్స్ ఇంజినీర్: సురేన్ జి ) కెప్టెన్ మిల్లర్ (తమిళ్): ధనుష్
ఉత్తమ తుళు ఫిల్మ్: ఇంబు
ఉత్తమ గర్వాలీ ఫిల్మ్: ధోలి
ఉత్తమ తెలుగు ఫిల్మ్: కమిటీ కుర్రోళ్ళు
ఉత్తమ తమిళ్ ఫిల్మ్: రాయన్
ఉత్తమ ఒడియా ఫిల్మ్: లహరి: ది టైడ్ ఆఫ్ టైమ్
ఉత్తమ మరాఠీ ఫిల్మ్: ముక్కమ్ పోస్ట్ బొంబిల్ వాడి
ఉత్తమ మణిపురి ఫిల్మ్: సునిత
ఉత్తమ మలయాళం ఫిల్మ్: ఫెమినిచ్చి ఫాతిమా
ఉత్తమ కొంకణి ఫిల్మ్: మోగోసమ్
ఉత్తమ కన్నడ ఫిల్మ్: మిథ్య
ఉత్తమ హిందీ ఫిల్మ్: శ్రీకాంత్
ఉత్తమ గుజరాతీ ఫిల్మ్: మారన్
ఉత్తమ బెంగాలీ ఫిల్మ్: చలిచిత్ర ఎకోన్
ఉత్తమ అస్సామీ ఫిల్మ్: జుయ్‌ఫుల్ (ఆరెంజ్‌అండ్ పర్పుల్)

నాన్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీ

స్పెషల్ జ్యూరీ: చోలా డోరా ఔర్ సుయ్ (హిందీ); భద్రకాళి నాటకం (మలయాళం)
ఉత్తమ స్క్రిప్ట్: ఓబర్ (హిందీ కశ్మీరీ) ఫరాజ్ అలీ
ఉత్తమ వాయిస్ ఓవర్: లిటిల్ ప్లానెట్: ఏ టేల్ ఆఫ్ ఫ్రాగ్స్ (ఇంగ్లీష్) సుందరాయ జయచంద్రన్
ఉత్తమ మ్యూజిక్ డైరెక్షన్: పరాట్ 41డిగ్రీస్ ఛాయా మగవీర్: శివ్ పాల్‌సింగ్ కాంగ్
ఉత్తమ షార్ట్ ఫిల్మ్: హమ్‌సఫర్ (మరాఠీ)
ఉత్తమ యానిమేషన్ ఫిల్మ్: టచ్డ్ ఏజ్ వాటర్
ఉత్తమ సోషల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ వాల్యూస్ : పిప్లంత్రి: ఏ టేల్ ఆఫ్ ఎకో ఫెమినిజం
ఉత్తమ డాక్యుమెంటరీ: రామ్-నామి (హిందీ)
ఉత్తమ ఆర్ట్/కల్చర్: మెయిన్ నిదా (హిందీ)
ఉత్తమ హిస్టారికల్ రీకన్‌స్ట్రక్షన్ కాంపిలేషన్ మూవీ: కకోరి (హిందీ)

# వేటకు వెళ్ళి గోదావరిలో మునిగి ఐదుగురు మృతి

- మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు



**భద్రాచలం జూలై 18 (జనంసాక్షి) :** భద్రాచలం సరిహద్దున ఉన్న పోలవరం జిల్లా ఎటపాక మండలం టీపి వీడు పంచాయతీ పరిధి గొల్లగూడెం గ్రామం వద్ద శనివారం ఉదయం పెను విషాదం నెలకొంది. చేపల వేటకు వెళ్లిన ఐదుగురు వ్యక్తులు దుర్మరణం పాలవ్వగా మరో ఆరుగురు బ్రతికి బయట పడ్డారు. ఒకే గ్రామానికి చెందిన ప్రజల్లో తీవ్ర విషాదాన్ని నింపిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఎటపాక మండలం గొమ్ము కొత్తగూడెం గ్రామానికి చెందిన మొత్తం 11మంది ఆదివాసీ వ్యక్తులు టీపివీడు పంచాయతీ పరిధిలోకి వచ్చే గొల్లగూడెం గ్రామ సమీపంలో గోదావరి నది వద్దకు ఉదయం 9.30 కి చేపల వేటకు వెళ్లారు. అయితే నదిలోకి దిగిన వారందరూ నీటి లోతులో ప్రమాదానికి గురయ్యారు. వీరిలో ఆరుగురు ఎలాగోలా ప్రాణాలతో బయటపడగా ఊకె లక్ష్మి (37),ఊకె సుశీల (37), బాసిబోయిన బాలరాజు(40), తుర్రం భారతి (40), ఊకె రమేష్(37) లు గల్లంతయ్యారు. దీనితో ప్రమాద సమాచారం అందుకున్న చింతూరు డీఎస్పీ హేమంత్, ఎటపాక సీఐ క్రిష్ణ, ఎస్సై అప్పలరాజు లు పోలీస్ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తో కలిసి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపు చర్యల్లో పోలీస్ శాఖతో పాటు రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలో నదిలో వ్యక్తులు గల్లంత య్యారన్న సమాచారం తెలియడంతో అధికా రిక మీటింగ్ నిమిత్తం రంప చోడవరం బయలు దేరిన తహసీల్దార్ శ్రీనివాసరావు చింతూరు నుంచే వెనుదిరిగి ఘటనా స్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గాలింపు చర్యల్లో గల్లంతైన ఐదుగురి మృత దేహాలూ లభ్యమయ్యాయి. పంచనామా అనంతరం మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రాజెక్టును పట్టించుకోక రాజకీయాలు చేస్తున్నారు

- ప్రజాధనంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి




**మహదేవపూర్, జులై 18 (జనంసాక్షి) :** ప్రాజెక్టును పట్టించుకోక రాజకీయాలు చేస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కన్నెపెల్లి పంప్ హౌస్ అన్నారం సరస్వతి బ్యారేజ్ లను శనివారం సిపిఐ(ఎం) పార్టీ రాష్ట్ర బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌ని పర్యటించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ ప్రాజెక్టును పట్టించుకోక రాజకీయాలు చేస్తున్నారని ప్రజాధనంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, ప్రాజెక్టుపై పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని, వర్షం పడక రైతులు ఎదురుచూస్తున్నారని పంపుల ద్వారా సాగునీరు అందిస్తే పంటలు వేసుకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. వారం క్రితం మేడిగడ్డ బ్యారేజీ నుంచి సుమారు లక్ష క్యూసెక్కుల నీరు వృధాగా దిగువకు పోయాయని, ఒక పార్టీ బ్యారేజీలో నీటి నిల్వ చేసుకోవచ్చుని, మరొక పార్టీ బ్యారేజీలో నీటి నిల్వ ప్రమాదంలో ఉంచి ఉందని పార్టీలు చెబుతున్న నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి నిపుణులతో చర్చించి తమ పార్టీ ద్వారా ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపిస్తామని అన్నారు. అలాగే సెప్టెంబర్ వరకు కూడా వర్షాలు పడేటటువంటి అవకాశం లేదని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారన్నారు.

'ఇప్పటికే కరువు పరిస్థితి ఉంది.తెలంగాణ ప్రాంతాల్లో రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తూపంటలు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని రైతులు వర్షాలు పడక తీవ్రమైనటువంటి ఇబ్బందులు పడుతున్నారు. సాగునీరు సమస్యనే కాక త్రాగునీరు సమస్య కూడా మారుతుందని. నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని తెలంగాణ వ్యాప్తంగా మొత్తం దేశంలోనే తెలంగాణ ప్రాంతంలో కరువు పరిస్థితి బాగా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉన్నటువంటి నీటి వనరులను అటు సాగునీరుకు వాడుకోవడానికి కొన్ని అవకాశాలు ఏమిటి అని పరిశీలించేటటువంటి క్రమంలోనే ఈ ప్రాజెక్టును కూడా పరిశీలించడానికి వచ్చామని, ముఖ్యంగా ఈ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అనేది సరైన పద్ధతిలో జరిగిందా లేదా లేదా ఖర్చుపెట్టినటువంటి దాంట్లో న్యాయంగా జరిగిందా అవినీతికి పాల్పడ్డరా? లేకపోతే ఇక్కడ కట్టడం అనేటటువంటిది సరైనదా? కాదా? అనేటటువంటి విషయాలకు మిగతా దృష్టి పెట్టడం కాకుండా వాటి గురించి చాలా చర్చ జరుగుతున్న వాటి మీదచాలాఅంశాలు గతంలో చెప్పి ఉన్నాం. ఇప్పుడు ఆ అంశాన్ని పరిశీలించడం కాకుండా ఉన్నటువంటి దాంట్లో తాగునీటిని వాడుకోవడానికి అవకాశాలు ఏమున్నాయని పరిశీలించడానికి రాష్ట్ర సిపిఐఎం ఈ బృందం రావడం జరిగింది. అక్కడ ఉండేటటువంటి నీటి వనరులను ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంది. కన్నెపల్లిపంప్ హౌస్నుంచి అన్నారం బ్యారేజ్ కు లిఫ్ట్ చేయడానికి కూడా అవకాశాలు ఉన్నాయి. అనేటటువంటి విషయం మాకు అర్థమవుతుంది గన్నేపల్లి దగ్గర ఉండేటటువంటి నీటిని అన్నారం బ్యారేజ్ దగ్గర లిఫ్ట్ చేయగలిగితే ఇక్కడ మొత్తం దీనికి ఎంత ఉందో అన్నారం బ్యారేజీలో నీటిని నింపేయడం కాకుండా కనీసం రెండు నుంచి మూడు టీఎంసీల నీటిని అక్కడ నిల్వ ఉంచగలిగితే దాని ద్వారా మిగతా పైబ్యారేజీలకు కూడా ఉపయోగించుకోవడానికి అవకాశాలున్నాయి. ఇప్పటికి కూడా మొత్తం దీంట్లో దాదాపు టిఎంసి నీరు ఇప్పటికి ప్రవహిస్తుంది. అదేవిధంగా ముందే జాగ్రత్త పడి ప్రభుత్వం ఇలాంటి కరువు వస్తున్న నేపథ్యంలో బ్యారేజీ నీటినివాడుకోవడానికి ప్రయత్నం చేసి ఉంటే ఎక్కువ నీటిని నిల్వ ఉంచుకోవడానికి అట్లాగే కిందికి పంపియడానికి అవకాశం కూడా ఉంటుంది. ప్రతిరోజు ఒక టీఎంసీ కి పైగా నీరు గోదావరి నదిలోని నీళ్లు వృధాగా సముద్రంలోకి పోతున్నాయి. పరిస్థితి వాటిని వాటి ద్వారా ఇక్కడ కనీసం ఒక మూడు టీఎంసీలకు తగ్గకుండా ఇక్కడ లిఫ్ట్ చేయగలిగితే అన్నారం బ్యారేజీ ద్వారా కూడా సాగునీరు అందించే అవకాశం ఉందని అలాగే తాగునీటికి హైదరాబాద్ కూడా నీకు సమస్య తీవ్రంగా ఉంది. ఇలాంటి విషయాలు పరిశీలించడానికి కాళేశ్వరం కన్నెపల్లి పంప్ హౌస్ మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ అన్నారం సరస్వతి బ్యారేజ్‌కు వచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి. రాష్ట్ర కార్యదర్శి పోతినేని సుదర్శన్ రావు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బంద్ సాయి, సిపిఐఎం రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, బీఎస్పీకి షాక్

- టీఆర్ఎస్‌లోకి బోథ్ నియోజకవర్గ ఆదివాసీ నాయకులు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీఎస్పీ లకు షాక్ తగిలింది. ఆ పార్టీ లోని ఆదివాసీ సీనియర్ నాయకులు టీఆర్ఎస్ లో చేరారు. హైదరాబాద్ లోని బంజారాహిల్స్ టీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారంతా పార్టీలో చేరారు. బోథ్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ఆధ్వర్యంలో తలమడుగు మండలానికి చెందిన ఆదివాసీ నాయకులు హైదరాబాద్ చేరుకున్నారు. పార్టీ సీనియర్ నేత రూప్ సింగ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి రూప్ సింగ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత. నాయకత్వం మీద విశ్వాసంతో వారంతా టీఆర్ఎస్ లోకి వచ్చారన్నారు. ఆదివాసీల అభ్యున్నతి కోసం కవిత గారు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారని చెప్పారు. తెలంగాణ అస్తిత్వం, అభివృద్ధి లక్ష్యంగా టీఆర్ఎస్ పనిచేస్తుందన్నారు. టీఆర్ఎస్ సిద్ధాంతాలు, నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరిన వారందరికీ రూప్ సింగ్ కృతజ్ఞతలు చెప్పారు. రానున్న రోజుల్లో బోథ్ నియోజకవర్గంలో టీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గజన, దేవర్ల స్వామి,రమేష్, నాయిని శ్రీనివాస్, తీగల ప్రకాష్, శ్రీనివాస్ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'ఉప్పెనంటి తెలంగాణ' పాట ఆవిష్కరణ




**హైదరాబాద్, జూలై 18 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని, ప్రజల జీవన పోరాటాలను తన కెమెరా ద్వారా చిరస్థాయిగా ఆవిష్కరించిన తెలంగాణ ఉద్యమకారుడు అంకిరెడ్డి సంస్మరణ సభ శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఎస్వీకేలో ఐలమ్మ ఆర్య గ్యాలరీ నిర్వహించారు. సభ ప్రారంభంలో ముందుగా తెలంగాణ అమరవీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అంకిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి సభ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత మిత్ర అందించిన "ఉప్పెనంటి తెలంగాణ "పాటను విమలక్క ఆలపించారు. ఈ పాటను బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో అంకిరెడ్డి చేసిన విశిష్ట సేవలను, ఆయన సృజనాత్మక ప్రస్థానాన్ని, ప్రజా ఉద్యమాల పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ఈ సభలో పలువురు ప్రముఖులు స్మరించుకొన్నారు. ఈ కార్యక్రమానికి అంకిరెడ్డి అల్లుడు వినయ్ కుమార్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో ప్రముఖ అరుణోదయ విమలక్క, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పోతుల, తెలంగాణ లోక్‌సత్తా నాయకులు మందిరం నాగరాజు, తెలంగాణ ఉద్యమకా రుడు, జాగృతి ఉపాధ్యక్షులు నవీన్ ఆచారి, అంకిరెడ్డి గోపికృష్ణ సోదరి అంకిరెడ్డి జ్యోతి, తెలంగాణ ఉద్యమకారుడు, టీఏఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు బండారి శ్రీనివాస్, సామాజిక వేత్త, ఏపూరి మల్సూర్ అరుణోదయ తెలంగాణ ప్రెసిడెంట్, అరుణోదయ సిటీ అధ్యక్షులు రాకేష్ పాల్గొన్నారు.

# 21న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

**హైదరాబాద్, జూలై18 (జనంసాక్షి) :** ఈ నెల 21న నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, 22న జరగనున్న రథోత్సవం సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏర్పాట్లపై చర్చించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ప్రజలు సంతోషంగా జరుపుకునే వేడుకకు ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెట్టొద్దని అధికారులకు స్పష్టం చేశారు.

# కాక్రోజ్ జనతా పార్టీ ఉద్యమానికి టీఆర్పీ సంపూర్ణ మద్దతు

- జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మహిళా అధ్యక్షురాలు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- నీట్ బాధితులకు రూ.1 కోటి నష్టపరిహారం చెల్లించాలని టీఆర్పీ డిమాండ్
- కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి
- రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా




**కరీంనగర్, జూలై 18 (జనంసాక్షి) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారు, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఢిల్లీలో కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా కరీంనగర్ జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ, కాక్రోజ్ జనతా పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన ఘోర వైఫల్యాలు, అవకతవకలు, నిర్లక్ష్యం కారణంగా దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని, అనేక కుటుంబాలు నష్టపోయాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన కేంద్ర ప్రభుత్వం దీనికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ వ్యవహారంలో నష్టపోయిన ప్రతి బాధిత విద్యార్థి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున గట్టిగా డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తైన విద్యార్థుల జీవితాలతో రాజకీయాలు చేయడం, పరీక్షల నిర్వహణలో బాధ్యతారాహిత్యం ప్రదర్శించడం క్షమించరాని నేరమని అన్నారు. విద్యను కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టి సామాన్య, మధ్యతరగతి కుటుంబాల పిల్లల జీవితాలను ప్రమాదంలోకి నెట్టే విధానాలను టీఆర్పీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ప్రజల హక్కులు, విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక న్యాయం కోసం జరిగే ప్రతి ఉద్యమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా నిలుస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ దేవి, జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ వాజిద్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, మండలాల అధ్యక్షులు శు వరాత్రి మోహన్, ఓర్సు రాజు, ఓర్సు విమల పార్టీ నాయకులు మహబూబ్ అలీ, కోరే గంగ, గుండోజు పద్మ, నేదునూరి రాజు, నేదునూరి కుమారస్వామి, గుండోజు సదానందం, దారంగుల గణేష్, మోహన్, మధు, ధర్మారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన విద్యార్థి ఉద్యమకారులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి


- విద్యార్థి ఉద్యమ నాయకులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో నష్టపోయిన విద్యార్థి ఉద్యమకారులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఓయూ విద్యార్థి ఉద్యమ నాయకులు డిమాండ్ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల రాష్ట్రస్థాయి సమావేశంలో తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థి ఉద్యమ నాయకులు, జేఏసీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి ఉద్యమ నాయకులు మాట్లాడుతూ గత పాలకులు ఉద్యమకారుల సంక్షేమాన్ని విస్మరించ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ ముందుగా విద్యార్థి ఉద్యమకారులతో సమావేశమై వారి అభిప్రాయాలను స్వీకరించడం అభినందనీయమని, ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో వందలాది మంది విద్యార్థులు కేసులు ఎదుర్కొని, జైలు జీవితాలు గడిపి, విద్యాఉపాధి అవకాశాలను కోల్పోయారని గుర్తుచేశారు. రాష్ట్ర సాధన కోసం తమ భవిష్యత్తును త్యాగం చేసిన విద్యార్థి ఉద్యమకారులకు గుర్తింపు కల్పించే ప్రక్రియలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల కమిటీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల విద్యార్థి ఉద్యమకారులను సమన్వయం చేస్తూ యూనివర్సిటీ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో త్వరలోనే తెలంగాణ ఉద్యమకారుల కమిటీ (కేకే కమిటీ), రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రిని కలిసి విద్యార్థి ఉద్యమకారుల సమస్యలు, డిమాండ్లు ప్రతిపాదనలను వినిపించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పత్రికా సమావేశాలు, సదస్సులు నిర్వహిస్తామని, సెప్టెంబర్ 17న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వేదికగా భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, నవంబర్ 18న ఓయూ జేఏసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తామని, డిసెంబర్ 9న "తెలంగాణ విద్యార్థి విజయ దివస్"గా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ప్రభుత్వం డిసెంబర్ 9వ తేదీలోగా విద్యార్థి జేఏసీ సమర్పించిన ప్రతిపాదనలను ఆమోదించి అమలు చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో ఓయూ జేఏసీ, టీఎస్ జేఏసీ నాయకులు కోట శ్రీనివాస్ గౌడ్, మందాల భాస్కర్, ఆజాద్, కంచర్ల బద్రి, దుర్గం భాస్కర్, మోహన్ రాజ్, మున్నూరు రవి, దుర్గం సారయ్య, రవీందర్ నాయక్, బండారి వీరబాబు, దరువు ఎల్లన్న, డి. విజయ్, వెన్నెల, శ్వేత, కవిత, పార్వతి, జంజర్ల రమేష్, శ్రీధర్, జగన్, రంజిత్, హరీష్ గౌడ్ లతో పాటు రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల జేఏసీ ప్రతినిధులు, విద్యార్థి ఉద్యమకారులు పాల్గొన్నారు.

# బొగ్గు నాణ్యతపై రాజీ లేదు

- ఉత్పత్తి నుంచి డిస్పాచ్ వరకు ప్రత్యేక పర్యవేక్షణ
- ఏరియాల వారీగా స్పెషల్ అధికారుల నియామకం
- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తిని పెంచడంతో పాటు, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా నాణ్యమైన బొగ్గును నిరంతరాయంగా సరఫరా చేయడానికి సింగరేణి సంస్థ ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఈ మేరకు ఏరియాల వారీగా ప్రత్యేక అధికారులను (స్పెషల్ ఆఫీసర్లు) నియమిస్తూ సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాలు జారీ చేశారు. రానున్న మూడు నెలల పాటు ఈ ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, గ్రేడ్ పరిరక్షణ, డిస్పాచ్, ఉత్పాదకత, పనితీరు మెరుగుదల, ఏరియాలు-కార్పొరేట్ విభాగాల మధ్య సమర్థవంతమైన సమన్వయం, అలాగే కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల అమలును నిశితంగా పర్యవేక్షించనున్నారు.

డైరెక్టర్ (ఆపరేషన్స్)కు సత్తుపల్లి, ఇల్లందు ఏరియాలు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్)కు మణుగూరు, భూపాలపల్లి ఏరియాలు, డైరెక్టర్ (ఫైనాన్స్)కు బెల్లంపల్లి, మందమర్రి ఏరియాలు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం)కు ఆర్జీ-1, ఆర్జీ-3 ఏరియాలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్)కు ఆర్జీ-2, నైనీ ఏరియాలు, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్)కు శ్రీరాంపూర్, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలను ప్రత్యేక అధికారులుగా కేటాయించారు. శనివారం సాయంత్రం సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తి, బొగ్గు నాణ్యత, గ్రేడ్ పరిరక్షణ, డిస్పాచ్ అంశాలపై సీఎండీ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ సింగరేణి బొగ్గు నాణ్యతే సంస్థకు గుర్తింపని, దానిపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు. ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా వినియోగదారులకు బొగ్గు సరఫరా జరిగేలా అన్ని ఏరియాల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొన్ని ఏరియాల్లో అన్‌గ్రేడెడ్ బొగ్గు, షేల్ కలవడం వల్ల నాణ్యత పడిపోతుందని అధికారులు పేర్కొనగా.. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎండీ సూచించారు. వార్షిక కోల్ గ్రేడేషన్ ప్రణాళిక ప్రకారం సీమ్‌ల వారీగా బొగ్గు తవ్వకాలు తప్పనిసరిగా చేపట్టాలని, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగానే ఉత్పత్తి జరగాలని ఆదేశించారు. ఆఫ్‌లోడింగ్ ప్రాంతాల్లో బ్లాస్టింగ్‌కు ముందు బొగ్గు బెంచీలను పూర్తిగా శుభ్రం చేయాలని, బొగ్గు బెంచీలు, ఓవర్‌బర్డెన్ బెంచీల మధ్య తగినంత దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాయి, షేల్ పొరలను బొగ్గుతో కలపకుండా ప్రత్యేకంగా తవ్వి ఓవర్‌బర్డెన్‌లోనే డంప్ చేయాలని, బొగ్గు గ్యాలరీల శుభ్రత, ఫైరీ కోల్ నిర్వహణకు రూపొందించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్‌ను అన్ని ఏరియాల్లో కచ్చితంగా అమలు చేయాలన్నారు. అన్ని ఓపెన్‌కాస్ట్ గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లలో తగిన సంఖ్యలో క్రషర్లు ఏర్పాటు చేసి, అవి ఎప్పటికప్పుడు సక్రమంగా పనిచేసేలా నిర్వహించాలని సూచించారు. ప్రతి కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో రోజువారీ, గ్రేడ్‌వారీ బొగ్గు డిస్పాచ్ ప్రణాళికను ముందుగానే రూపొందించి, దానిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఉత్పత్తి నుంచి డిస్పాచ్ వరకు ప్రతి దశలో నాణ్యత నియంత్రణకు అధికారులు వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సింగరేణి బొగ్గు నాణ్యతపై వినియోగదారులకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం ప్రతి అధికారి బాధ్యత అని, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా నాణ్యమైన బొగ్గు సరఫరా చేయడం ద్వారా సంస్థ ప్రతిష్టను మరింత పెంచాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), ఎం.తిరుమలరావు (ఈ అండ్ ఎం), ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# ఇస్రో సంక్షోభం...

## ఇది కేవలం రాజీనామాల కథ కాదు!

**120 మందికి పైగా సీనియర్ శాస్త్రవేత్తలు, 'ఏ' గ్రూప్ నిపుణులు, ఒకేసారి పదవులు వదిలేస్తున్నారంటే అది సాధారణ విషయం కాదు. ఇది భారత అంతరిక్ష పరిశోధన సంస్థ గుండెల్లో పుట్టిన కుంపటి. దశాబ్దాల తపస్సుతో, ప్రజాధనంతో నిర్మించిన ఒక జాతీయ సంస్థ లోపల ఇంతటి అలజడి రేగుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం మామూలుగా మాట్లాడుతోంది – "ప్రతి సంస్థలోనూ ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి" అని తేలిగ్గా కొట్టిపారేస్తోంది. ఇది బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ.**

చంద్రయాన్–3, ఆదిత్య ఎల్–1 వంటి చరిత్రాత్మక విజయాలు సాధించిన ఇస్రోను ప్రపంచం మెచ్చుకుంటున్న వేళ, అదే సంస్థలో అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు మౌనంగా వెళ్ళిపోతున్నారంటే – లోపల ఏదో బలంగా నలుగుతోందని అర్థం. గగన్‌యాన్ లాంటి ప్రతిష్ఠాత్మక మిషన్ సీనియర్ డైరెక్టర్లు వరుసగా వైదొలగడం, వాహకనౌక ఎంకే–3 ప్రాజెక్టు డైరెక్టర్ వంటి కీలక వ్యక్తులు తప్పుకోవడం – ఇవి యాదృచ్ఛికం కావు. ఇది స్పష్టమైన హెచ్చరిక సంకేతం.


*కారణం అందరికీ తెలిసిందే - ప్రైవేటీకరణ. అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం పేరుతో, దశాబ్దాలుగా ఇస్రోను నిర్మించిన శాస్త్రవేత్తల అనుభవాన్ని, నైపుణ్యాన్ని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్న తీరు ప్రమాదకరం. మాజీ ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్ వంటి వ్యక్తి ప్రైవేటు అంకుర సంస్థలో చేరడం ఒక సంకేతమైతే, వందలాది మంది శాస్త్రవేత్తలు నిశ్శబ్దంగా వెళ్ళిపోవడం మరో పెద్ద ప్రశ్న. ప్రభుత్వ రంగ సంస్థను నిర్వీర్యం చేసి, ప్రైవేటు సంస్థలకు లాభాలు కట్టబెట్టే ఎజెండా వెనుక దాగుందా అనే అనుమానం ప్రజల్లో బలపడుతోంది.*

అంతరిక్ష శాఖ ఇప్పుడు హడావిడిగా "రాజీనామాలను వెంటనే ఆమోదించవద్దు" అంటూ అంతర్గత ఆదేశాలు జారీ చేయడం, నిబంధనలు కఠినతరం చేయడం అంటే – నీళ్లు నెత్తి మీదికి వచ్చాక కుండ కప్పినట్టే. ముందుగానే జాగ్రత్త పడాల్సిన ప్రభుత్వం, సంక్షోభం బహిర్గతమయ్యాక హడావిడి చర్యలు తీసుకోవడం సరిపోదు. కీలక ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలను నిలుపుకోవాలంటే వారికి తగిన ప్రోత్సాహకాలు, గౌరవం, భరోసా ఇవ్వాలి – అంతే తప్ప రాజీనామా పత్రాలపై సంతకాలు ఆపడం పరిష్కారం కాదు.

భారత అంతరిక్ష కార్యక్రమం అనేది కేవలం ఒక ప్రభుత్వ శాఖ కాదు – అది జాతి గర్వకారణం, స్వావలంబనకు ప్రతీక. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రైవేటీకరణ మాటున జాతీయ సంస్థల వెన్నెముకను విరగ్గొట్టే విధానాలు ఎంతమాత్రం సహించరానివి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరవాలి. శాస్త్రవేత్తల ఆందోళనలను వినాలి. లేకుంటే, రేపటి చంద్రయాన్–4, గగన్‌యాన్ లాంటి మిషన్లు అనుభవం లేని చేతుల్లో నలిగిపోయే ప్రమాదం ఉంది.

# ఏఐ ఆధారిత "డేటా సెంటర్ల"తో లాభ-నష్టాలు

కృత్రిమ మేధ (ఏఐ) విప్లవంతో ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్ల ప్రాముఖ్యత వేగంగా పెరుగుతోంది. క్లౌడ్ సేవలు, బ్యాంకింగ్, ఈ–కామర్స్, ప్రభుత్వ డిజిటల్ సేవలు, పరిశోధనలు ఇవన్నీ భారీ డేటా సెంటర్లపై ఆధారపడి ఉన్నాయి. అయితే అమెరికా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, సింగపూర్ వంటి దేశాలు డేటా సెంటర్ల విస్తరణపై పరిమితులు విధిస్తున్నాయి. కారణం వాటి వల్ల పెరుగుతున్న విద్యుత్ వినియోగం, నీటి వినియోగం, కార్బన్ ఉద్గారాలు, పర్యావరణంపై పడుతున్న భారం. కానీ భారత్‌లో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ రాయితీలు, భూములు, పన్ను మినహా యింపులతో డేటా సెంటర్లను పోటీపడి ఆహ్వానిస్తున్నాయి. నీరు, విద్యుత్తు కొరతతో పాటు పర్యావరణ ఒత్తిళ్లు అధికంగా ఉన్న దేశంలో ఈ విధానం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నకు శాస్త్రీయంగా సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.




ప్రస్తుతం ప్రపంచంలో సుమారు పదకొండు వేలకుపైగా డేటా సెంటర్లు ఉన్నాయి. అమెరికాలోనే ఐదు వేలకుపైగా ఉండగా, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్, చైనా, ఫ్రాన్స్, కెనడా, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో వందల సంఖ్యలో ఉన్నాయి. భారత్‌లో ప్రస్తుతం రెండు వందల యాభై నుంచి మూడు వందల మధ్య పెద్ద డేటా సెంటర్లు పనిచేస్తున్నాయి. వీటి కోసం ముంబై, చెన్నై, హైదరాబాద్, నోయిడా, బెంగళూరు ప్రధాన కేంద్రాలుగా పోటీపడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ రంగంలో పెట్టుబడులు మరింత పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ అంచనా వేస్తోంది.

డేటా సెంటర్లలో అత్యంత కీలక సమస్య విద్యుత్ వినియోగం. ఏఐ ఆధారిత డేటా సెంటర్లు వందల మెగావాట్ల విద్యుత్తును నిరంతరం వినియోగిస్తాయి. అంతర్జాతీయ శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఈ విద్యుత్ వినియోగం రాబోయే సంవత్సరాల్లో భారీగా పెరగనుంది. ఇప్పటికే భారత్‌లో వేసవికాలంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుతోంది. అలాంటి పరిస్థితిలో పెద్ద ఎత్తున డేటా సెంటర్లకు చౌక విద్యుత్తు అందించడం మిగిలిన రంగాలపై ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది.

రెండో ప్రధాన సమస్య నీటి వినియోగం. డేటా సెంటర్లలోని సర్వర్లను చల్లబరచడానికి భారీ మొత్తంలో నీరు అవసరమవుతుంది. పెద్ద డేటా సెంటర్లు రోజుకు లక్షల లీటర్ల నీటిని వినియోగించే అవకాశం ఉంది. ఇప్పటికే భారతదేశంలోని అనేక నగరాలు తాగునీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. తలసరి నీటి లభ్యత కూడా గత కొన్ని దశాబ్దాలుగా తగ్గుతోంది. ఇలాంటి సమయంలో పరిశ్రమల కోసం విలువైన నీటి వనరులను మళ్లించడం భవిష్యత్తులో సామాజిక, పర్యావరణ సమస్యలను మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

ఉద్యోగాల విషయంలో కూడా వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవాలి. డేటా సెంటర్ల నిర్మాణ దశలో తాత్కాలికంగా వేలాది ఉద్యోగాలు లభించినా, నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణకు సాధారణంగా కొన్ని వందల మంది నిపుణులు మాత్రమే అవసరమవుతారు. వాటిలో అధిక భాగం అధిక నైపుణ్యం కలిగిన ఇంజినీర్లు, నెట్‌వర్క్ నిపుణులు, విద్యుత్ మరియు శీతలీకరణ సాంకేతిక నిపుణులకే పరిమితం అవుతాయి. అందువల్ల లక్షలాది మంది యువతకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందనే ప్రచారం నిజం కాదు.

అయితే డేటా సెంటర్ల వల్ల ప్రయోజనాలు లేవా అంటే ఖచ్చితంగా కొన్ని ఉన్నాయి. దేశీయంగా డేటా నిల్వ చేయడం వల్ల డేటా భద్రత, డిజిటల్ సార్వభౌమత్వం బలోపేతమవుతాయి. క్లౌడ్ సేవలు, ఫిన్‌టెక్, ఈ–కామర్స్, ఆరోగ్యం, విద్య, కృత్రిమ మేధ పరిశోధన లకు అవసరమైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతాయి. విదేశీ పెట్టుబడులు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ఈ ప్రయోజనాలను ఖర్చులతో పోల్చి చూడడం అవసరం.

ఈ రంగంలో అత్యధిక లాభం పొందేది ప్రధానంగా ప్రపంచ క్లౌడ్ కంపెనీలు, పెద్ద సాంకేతిక సంస్థలు, పెట్టుబడిదారులు, డేటా సెంటర్ నిర్వహణ సంస్థలే. ప్రభుత్వాలు వారికి భూములు, పన్ను రాయితీలు, చౌక విద్యుత్తు వంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. మరోవైపు నీటి కొరత, విద్యుత్ ఒత్తిడి, పర్యావరణ నష్టం, ప్రభుత్వ రాయితీల ఆర్థిక భారం వంటి ప్రభావాలను సమాజమే భరించాల్సి వస్తుంది. అంటే లాభాలు కొద్దిమందికి కేంద్రీకృతమయ్యే అవకాశం ఉండగా, ఖర్చు మాత్రం సమాజమంతా పంచుకోవాల్సి వస్తుంది.

ఇదే కారణంగా అనేక దేశాలు నియంత్రణ విధానాలను అనుసరిస్తున్నాయి. ఐర్లాండ్‌లో విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడి కారణంగా కొత్త డేటా సెంటర్ల అనుమతులపై కఠిన నిబంధనలు అమలులోకి వచ్చాయి. సింగపూర్ కొంతకాలం కొత్త అనుమతులను నిలిపివేసి, తర్వాత అధిక శక్తి సామర్థ్య ప్రమాణాలతోనే అనుమతులు ఇచ్చింది. నెదర్లాండ్స్ కూడా కొన్ని ప్రాంతాల్లో పరిమితులు విధించింది. అభివృద్ధిని వ్యతిరేకించడం కాకుండా, పర్యావరణ సామర్థ్యానికి అనుగుణంగా నియంత్రించడం వారి విధానం. భారత్‌లో కూడా ప్రతి ప్రాజెక్టుకు నీటి లభ్యత, విద్యుత్ సామర్థ్యం, పునరుత్పాదక ఇంధన వినియోగం, మురుగునీటి పునర్వినియోగం, కార్బన్ ఉద్గారాల నియంత్రణ, స్థానిక యువతకు ఉపాధి కల్పన వంటి ప్రమాణాలను తప్పనిసరి చేయాలి. ముఖ్యంగా తాగునీటి కొరత ఉన్న ప్రాంతాల్లో డేటా సెంటర్ల అనుమతుల విషయంలో అత్యంత జాగ్రత్త అవసరం.

డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు డేటా సెంటర్లు అవసరమే. కానీ అభివృద్ధి పేరిట నీరు, విద్యుత్, భూమి వంటి పరిమిత వనరులను విచక్షణారహితంగా వినియోగించడం మన దేశ ప్రయోజనాలకు అనుకూలం కాదు. పర్యావరణ పరిరక్షణ, ప్రజా వనరుల సమర్థ వినియోగం, ఉపాధి ప్రయోజనాలు, ఆర్థిక అభివృద్ధి... ఈ నాలుగు అంశాల మధ్య సమతుల్యత సాధించినప్పుడే డేటా సెంటర్లు నిజమైన జాతీయ ఆస్తిగా మారతాయి. లేకపోతే కొద్దిమంది పెట్టుబడిదారులకోసం మన దేశ వనరులను త్యాగం చేయటం సముచితం కాదు.




డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

**ఇదీ రహస్యం!**

అడవికి రాజు
మృగరాజు!
దేశానికిరాజు
ఏమనిషైనా
కాగలడు!
మృగరాజు
ఆకలివేస్తేనే
వేటడతాడు!
మనిషిదిమాత్రం
నిరంతరవేట!
మృగరాజు
ఆకలితీరాగానే
వేట ఆపేస్తాడు!
వీడివేట డబ్బు!
ఆకలితీరదు!
తిన్నతర్వాత
మృగరాజు
గుహలో నిద్ర!
వీడు మాత్రం
దేశాల పర్యటన!
మృగరాజుకు
ఒక్క అడవే!
వీడిది మాత్రం
అన్ని దేశాలు
తిరగటమే !
మృగరాజుకు
ఆంతరంగికంలేదు!
వీడు మాత్రం
వీడిలాంటివాళ్ళతో
సమావేశాలు!
ఆకలి ప్రధానంగా
మృగరాజుపాలన!
దేశంలో 'పన్నులు'
విదేశీ 'సంపదలు '
వీడిఆంతరంగికం!
నిశిరాత్రిఅడవిలో
నిశ్శబ్దవాతావరణం!
రాజుగారి పాలనలో
రాత్రి పగలు
ప్రజల ఆహాకారం!
అడవిలో
ఆరోగ్యం ఆనందం
దేశంలో మాత్రం
రోగాలు, దరిద్రం
బాధలతో జనం!
మృగం –మనిషి
అడవి –దేశం
సమాజం ఉండి
సుఖంలేని మనిషి!
ఏంటంటారు?
మృగానిది
ఆహారంవరకే!
వీడిది మాత్రం
నిత్య దోపిడీ!
ఇదే రహస్యం!



-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్





# వికసిత్ భారత్‌కు విజ్ఞానమే విజయపథం

21వ శతాబ్దంలో ప్రపంచ దేశాల అభివృద్ధిని నిర్ణయించే ప్రధాన శక్తి సహజ వనరులు మాత్రమే కాదు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం. కృత్రిమ మేధస్సు, స్వయంచాలక యంత్ర వ్యవస్థలు, సూక్ష్మ విద్యుద్భాగాల తయారీ, జీవ విజ్ఞాన సాంకేతికత, అంతరిక్ష పరిశోధనలు, సైబర్ భద్రత, హరిత సాంకేతికత వంటి రంగాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2047 నాటికి భారతదేశాన్ని సంపూర్ణ అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే "వికసిత్ భారత్" లక్ష్యం కేవలం ఆర్థిక వృద్ధితో సాధ్యమయ్యేది కాదు. శాస్త్ర విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, నవకల్పనల సమన్వయంతో కూడిన సమగ్ర అభివృద్ధి ద్వారానే అది సాధ్యమవుతుంది. 1947లో స్వాతంత్ర్యం పొందిన భారతదేశం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత దేశం. ఆ సమయంలో అక్షరాస్యత సుమారు 18 శాతం మాత్రమే ఉండేది. శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక వసతులు, పారిశ్రామికీకరణ చాలా పరిమిత స్థాయిలో ఉండేవి. అయితే 1991లో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణల తరువాత దేశంలో విజ్ఞాన ఆధారిత అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకున్నాయి. 2000 తరువాత సమాచార, ప్రసార, సేవల రంగాల్లో సాంకేతిక వినియోగం వేగంగా పెరిగి భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక దేశంగా నిలిపింది.

ప్రస్తుతం భారతదేశ స్థూల దేశీయోత్పత్తి విలువ 4 లక్షల కోట్ల అమెరికా డాలర్లకు పైగా చేరుకుంది. 2028 నాటికి 5 లక్షల కోట్ల అమెరికా డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి ప్రపంచంలోని ప్రముఖ అభివృద్ధి చెందిన దేశాలలో ఒకటిగా నిలవాలనే లక్ష్యాన్ని దేశం నిర్దేశించుకుంది. ఈ లక్ష్య సాధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రధాన చోదక శక్తిగా మారింది.

2015 తరువాత దేశవ్యాప్తంగా ప్రభుత్వ సేవలను ప్రజలకు సాంకేతిక ఆధారంగా అందించే కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయి. ప్రజల గుర్తింపు, బ్యాంకు ఖాతాలు, దూరవాణి అనుసంధానం ద్వారా కోట్లాది మంది ప్రత్యక్షంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందుతున్నారు. ప్రస్తుతం దేశంలో 140 కోట్లకు పైగా గుర్తింపు నమోదు, 55 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలు, 100 కోట్లకు పైగా అంతర్జాల అనుసంధానాలు ఉండటం సాంకేతిక విస్తరణకు నిదర్శనం. దేశంలో నగదు రహిత లావాదేవీలు విపరీతంగా పెరిగాయి. ప్రతి నెలా వందల కోట్ల లావాదేవీలు సాంకేతిక వేదికల ద్వారా జరుగుతున్నాయి. ప్రపంచంలో తక్షణ నగదు బదిలీ వ్యవస్థల్లో భారతదేశం వాటా సుమారు 45 నుండి 50 శాతం వరకు ఉండటం దేశ సాంకేతిక సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది. చిన్న వ్యాపారులు, రైతులు, స్వయం ఉపాధి వృత్తిదారులు, విద్యార్థులు, మహిళలు కూడా ఈ సేవలను విస్తృతంగా వినియోగిస్తున్నారు.

ప్రపంచంలోని పలు అంతర్జాతీయ ఆర్థిక, అభివృద్ధి సంస్థలు భారతదేశం రూపొందించిన ప్రజా సాంకేతిక మౌలిక వసతులను ప్రశంసిస్తున్నాయి. ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా, అవినీతి రహితంగా ప్రజలకు చేరడంలో ఈ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే వికసిత్ భారత్ లక్ష్యం కేవలం మహా నగరాల అభివృద్ధితో నెరవేరదు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్య, శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక నైపుణ్యాలు, వేగవంతమైన సమాచార సదుపాయాలు, వ్యవసాయ యాంత్రీకరణ, గ్రామీణ పారిశ్రామికీకరణ, యువతలో నవకల్పనలకు ప్రోత్సాహం కల్పించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సాధనంగా మారినప్పుడే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం అవుతుంది. భారతదేశ అభివృద్ధిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అత్యంత కీలకమైన మార్పులకు కారణమవుతోంది. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్యం, పరిశ్రమలు, రవాణా, రక్షణ, అంతరిక్ష రంగాల్లో సాంకేతిక వినియోగం దేశ ప్రగతికి కొత్త మార్గాలను సృష్టిస్తోంది. సంప్రదాయ పద్ధతులను ఆధునిక విజ్ఞానంతో అనుసంధానం చేయడం ద్వారా ఉత్పాదకతను పెంచడం, వనరులను సమర్థవంతంగా వినియోగించడం, ప్రజల జీవన



ప్రమాణాలను మెరుగుపరచడం సాధ్యమవుతోంది.

భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం ఇప్పటికీ ప్రధాన రంగంగా కొనసాగుతోంది. దేశ జనాభాలో సుమారు 45 శాతం మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారు. ఈ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశించడం ద్వారా పంటల దిగుబడులు పెరుగుతున్నాయి. భూసార పరీక్షలు, ఉపగ్రహ చిత్రాల ఆధారిత వ్యవసాయ సమాచారం, వాతావరణ అంచనాలు, నీటి పొదుపు పద్ధతులు, ఆధునిక యంత్రాల వినియోగం రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు ఆధారిత సలహాలు, పంటల వ్యాధుల గుర్తింపు, మార్కెట్ ధరల సమాచారం వంటి సాంకేతిక సేవలు రైతులకు అందుబాటులోకి వస్తున్నాయి. 2020 తరువాత వ్యవసాయ సాంకేతిక రంగంలో అనేక కొత్త సంస్థలు ప్రారంభమై రైతులకు డిజిటల్ సేవలను అందిస్తున్నాయి. భవిష్యత్తులో సాంకేతిక ఆధారిత వ్యవసాయం ద్వారా తక్కువ వ్యయంతో అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉంది.

విద్యా రంగంలో కూడా సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చింది. 2020లో అమలులోకి వచ్చిన జాతీయ విద్యా విధానం విద్యలో సాంకేతిక వినియోగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. దూర విద్య, డిజిటల్ పాఠ్యాంశాలు, ఆన్‌లైన్ అభ్యసన వేదికలు, వర్చువల్ ప్రయోగశాలలు విద్యార్థులకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. భారతదేశంలో ఉన్నత విద్యా రంగం వేగంగా విస్తరిస్తోంది. 1950లో దేశంలో ఉన్నత విద్యా సంస్థల సంఖ్య చాలా తక్కువగా ఉండగా, ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు, కళాశాలలు వేల సంఖ్యలో ఉన్నాయి. సాంకేతిక ఆధారిత విద్యా విధానాల ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించే అవకాశం ఏర్పడింది.

వైద్య రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రజల ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది. దూర వైద్య సేవలు, వైద్య సమాచార వ్యవస్థలు, ఆధునిక నిర్ధారణ పరికరాలు, జీవ సాంకేతిక పరిశోధనలు ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా మారుస్తున్నాయి. 2020లో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన కరోనా మహమ్మారి సమయంలో భారతదేశం సాంకేతిక ఆధారిత ఆరోగ్య నిర్వహణ ద్వారా కోట్లాది ప్రజలకు సేవలు అందించింది.

అంతరిక్ష రంగంలో భారతదేశం సాధించిన విజయాలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాయి. 1969లో స్థాపించబడిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ అనేక దశాబ్దాల కృషితో ప్రపంచంలోని ప్రముఖ అంతరిక్ష సంస్థలలో ఒకటిగా ఎదిగింది. 2023లో చంద్రయాన్–3 విజయంతో భారతదేశం చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతానికి చేరుకున్న తొలి దేశంగా చరిత్ర సృష్టించింది. ఈ విజయాలు శాస్త్రీయ సామర్థ్యానికి, సాంకేతిక అభివృద్ధికి నిదర్శనాలు.

పరిశ్రమల రంగంలో కూడా ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. స్వయంచాలక యంత్రాలు, రోబోటిక్ వ్యవస్థలు, ఆధునిక తయారీ విధానాలు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. 2020లో ప్రారంభమైన స్వదేశీ తయారీ ప్రోత్సాహక కార్యక్రమాలు దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చే దిశగా ముందుకు సాగుతున్నాయి. అయితే సాంకేతిక అభివృద్ధితో పాటు కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డిజిటల్ అంతరం, సైబర్ నేరాలు, వ్యక్తిగత సమాచార భద్రత, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో అసమానతలు వంటి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. సాంకేతికత కొద్దిమంది చేతుల్లో మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి వర్గానికి చేరినప్పుడే నిజమైన వికసిత్ భారత్ నిర్మాణం సాధ్యమవుతుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం భారతదేశ అభివృద్ధికి ఒక సాధనం మాత్రమే కాదు, భవిష్యత్తు నిర్మాణానికి ఒక శక్తివంతమైన పునాది. విజ్ఞానం, మానవ విలువలు, సామాజిక సమానత్వంతో కూడిన సాంకేతిక అభివృద్ధి ద్వారానే 2047 నాటికి భారతదేశం ప్రపంచంలో అగ్రగామి దేశంగా ఎదగగలదు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపాధి అవకాశాలను, పారిశ్రామిక అభివృద్ధిని, ఆర్థిక స్వావలంబనను వేగవంతం చేసే శక్తిగా మారుతోంది. గతంలో పరిశ్రమల అభివృద్ధి ప్రధానంగా సహజ వనరులు, మానవ శ్రమపై ఆధారపడగా, ప్రస్తుతం విజ్ఞానం, పరిశోధనలు, సాంకేతిక నైపుణ్యాలు అభివృద్ధికి ప్రధాన ఆధారాలుగా మారాయి.

భారతదేశ యువ జనాభా దేశానికి అతిపెద్ద సంపదగా మారింది. దేశ జనాభాలో సుమారు 65 శాతం మంది 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారే. ఈ యువ శక్తికి ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించడం ద్వారా ప్రపంచానికి అవసరమైన మానవ వనరులను అందించే సామర్థ్యం భారతదేశానికి ఉంది. కృత్రిమ మేధస్సు, సమాచార సాంకేతికత, రోబోటిక్స్, జీవ సాంకేతికత, అంతరిక్ష విజ్ఞానం వంటి రంగాల్లో నైపుణ్యాభివృద్ధి యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తోంది.

భారతదేశంలో ప్రారంభమైన నూతన ఆవిష్కరణల సంస్కృతి గత దశాబ్దంలో వేగంగా పెరిగింది. 2016లో ప్రారంభమైన నూతన వ్యాపార ప్రోత్సాహక కార్యక్రమాల ద్వారా వేలాది కొత్త సంస్థలు ఏర్పడ్డాయి. 2025 నాటికి భారతదేశం ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో నూతన సంస్థలు కలిగిన దేశాలలో మూడవ స్థానంలో నిలిచింది. సాంకేతిక ఆధారిత వ్యాపారాలు ఉపాధి అవకాశాలను పెంచడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపిస్తున్నాయి. ఆర్థిక రంగంలో కూడా సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మక మార్పులను తీసుకువస్తోంది. బ్యాంకింగ్ సేవలు, బీమా, పెట్టుబడులు, వ్యాపార లావాదేవీలు వేగంగా డిజిటల్ విధానంలోకి మారుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మొబైల్ ఆధారిత ఆర్థిక సేవలు విస్తరించడం వల్ల సామాన్య ప్రజలు ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములవుతున్నారు. దీనివల్ల ఆర్థిక సమానత్వం పెరుగుతోంది. భారత రక్షణ రంగంలో సాంకేతిక ఆధునికీకరణ దేశ భద్రతను మరింత బలోపేతం చేస్తోంది. స్వదేశీ ఆయుధ తయారీ, ఉపగ్రహ ఆధారిత నిఘా వ్యవస్థలు, ఆధునిక రక్షణ పరికరాల అభివృద్ధి ద్వారా భారతదేశం వ్యూహాత్మకంగా బలమైన దేశంగా ఎదుగుతోంది. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించడం ద్వారా విదేశీ ఆధారపడుదలను తగ్గించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణలో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోంది. సౌర విద్యుత్, పవన విద్యుత్, విద్యుత్ వాహనాలు, వ్యర్థాల నిర్వహణ సాంకేతికతలు భవిష్యత్తులో సుస్థిర అభివృద్ధికి మార్గం చూపుతున్నాయి. భారతదేశం 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని గణనీయంగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కోవడంలో హరిత సాంకేతికత ఎంతో అవసరం.



డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్
కాకతీయ విశ్వవిద్యాలయం

# సనాతనం' అంటే 'పురాతనం' కాదు!




'తర్మాజ్' ని 'ట్రంపు' వదలనట్లు గానే తమిళనాడుని 'సనాతనం' అనే పదం కూడా ఇప్పట్లో వదిలేట్లు లేదు. రావణ్ జైల్లో, పవన్ హాస్పిటల్లో ఉన్నారు కాబట్టి , తెలుగునాట ఆ మాటకు కొద్దిగా విరామం దొరికింది గాని, తమిళనాట మాత్రం మళ్లీ మొదలయ్యింది. అదిప్పుడు రాజకీయాల్లో లేని రజనీకాంత్ ద్వారా మళ్లీ ముందుకొచ్చింది. రజనీకాంత్ సనాతనానికి ఇప్పుడు కొత్త అర్థాన్నిచ్చారు. అందరికీ తెలిసిన 'శాశ్వతమైనది, ఎల్లప్పుడూ వుండేది' అని కాకుండా 'పురాతనమైనది' అనే అర్థాన్నిచ్చి మాట్లాడారు. నిజానికి పోయెస్ గార్డెన్ లోని తన ఇంట్లో మీడియా సమావేశం లో తాను మాట్లాడాలను కున్నది– TVK నాయకుడు ఆధవ్ అర్జున్ గురించి మాత్రమే.

'DMK బెదిరింపుల వల్లే రజనీకాంత్ రాజకీయాల్లోకి రాలేదు" అని రజనీకాంత్ ని అవధ్ కొంత తక్కువ చేస్తూ మాట్లాడాడు. 'విజయ్ కి ఏ భయమూ లేదు. అందుకే ముఖ్యమంత్రి అయ్యాడు. రజనీ భయపడ్డాడు కాబట్టే వెనకబడ్డాడు' అని ఆ మాటల అర్థం. ఆ మాటలకి రజని నొచ్చుకున్నారు. నొచ్చుకుని, "కాలం మాట్లాడదు. కానీ సమాధానం చెప్పడానికి వేచి ఉంటుంది." అన్నాడు.

రజని కాంత్ అంత వరకే అని ఊరుకుంటే బాగుండేది. కానీ ఆయన సనాతనం గురించి కూడా మాట్లాడాడు. 'స్టాలిన్ ఓడిపోవడానికి సనాతన ధర్మాన్ని విమర్శించడమే కారణం' అనే అర్థం వచ్చేట్లుగా మాట్లాడారు. అది తప్పు.

"సనాతన ధర్మం'లో ధర్మం లేదు; వివక్ష మాత్రమే వుంది" అని అన్న వాళ్లు ఆరు దశాబ్దాలు గా తమిళనాడుని పరిపాలిస్తూనే ఉన్నారు. సనాతన ధర్మాన్ని విమర్శించడం వల్లే ప్రజలు ఒక పార్టీని తిరస్కరిస్తారనే వాదనకు చారిత్రక ఆధారాలు ఏమీ లేవు. తమిళనాడులో ద్రవిడ ఉద్యమ భావజాలంతో సనాతన ధర్మాన్ని విమర్శించిన పార్టీలే దాదాపు ఆరు దశాబ్దాలుగా పరిపాలన చేసాయి.

ఇంక 'తమిళగ వెట్రి కజగం' గానీ, దాని ప్రధాన నాయకుడైన విజయ్ గానీ సనాతన ధర్మం గురించి మాట్లాడింది లేదు. ఉదయనిధి స్టాలిన్ శాసనసభలో "ప్రజలను విభజించే సనాతనాన్ని నిర్మూలించాలి" అని వ్యాఖ్యానించినప్పుడు కూడా విజయ్ సభలోనే ఉన్నారు. కానీ ఆయన ఆ వ్యాఖ్యను సమర్థించనూ లేదు; ఖండించనూ లేదు. ఆధవ్ అర్జున్ మాత్రం "మేము హిందువులకు వ్యతిరేకం కాదు; హిందుత్వ రాజకీయాలకు వ్యతిరేకం" అని మాట్లాడాడు.

ఇప్పుడు ఈ వివాదాన్ని మళ్లీ ముందుకు తెచ్చిన రజనీ కాంత్ 'సనాతన అంటే పురాతన' అనే అర్థాన్ని ఇవ్వడమే కాకుండా, 'ఇస్లామ్, క్రిస్టియానిటీ, బౌద్ధం ఇంకా తదితర మతాలకు వ్యవస్థాపకులు ఉన్నారు గానీ హిందూ మతానికి ఎవరూ లేరు' అని అన్నారు. అంటే హిందూ మతం అనేది అత్యంత ప్రాచీనమైన మతం అని, అది పూర్తిగా దైవాంశం అని ఆయన అర్థం.

నిజానికి 18–19వ శతాబ్దాల్లో బ్రిటిష్ పాలకులు భారతదేశంలోని వేద, పురాణ, శైవ, వైష్ణవ, శాక్త, స్మార్త తదితర సంప్రదాయాలను పరిపాలనా, న్యాయ అవసరాల కోసం ఒకే వర్గంగా "ఎఱఅఅంఐఱఅంఎ" అని పిలవడం ప్రారంభించారే గానీ అంతకు మునుపు ఆ పేరుతో అలాంటి ఒక మతం లేదు. (కానీ ఆ పేరు ఉన్నా లేకున్నా వాటి తాలూకు సంప్రదాయాలు మాత్రం ఉన్నాయి.)

నాలుగు వేదాల్లో "హిందూ" అనే పదం కనిపించదు. వేదాల్లో "సింధు" అనే పదం అనేకసార్లు వస్తుంది. అది నదిని, ముఖ్యంగా సింధు నదిని సూచిస్తుంది. కానీ "హిందూ" అనే పదం కాదు. ఉపనిషత్తుల్లో, భగవద్గీతలో కూడా లేదు. బ్రహ్మసూత్రాల్లో కూడా లేదు.

రామాయణం, మహాభారతంలో కూడా లేదు. ఆఖరికి మనుస్మృతిలో కూడా లేదు. మనుస్మృతి వర్ణవ్యవస్థ, ధర్మం గురించి విస్తృతంగా చర్చిస్తుంది. కానీ "హిందూ" అనే పదాన్ని ఉపయోగించదు. ఋగ్వేదంలో సింధు అని ఉంది. అంటే నది అని అర్థం. పాత పర్షియన్ భాషలో 'స' అనేది 'హ' గా మారుతుంది. (దీన్ని ధ్వని పరిణామం అంటారు.) అందువల్ల సింధు హిందు అయింది. వారు సింధు నదికి ఆవల నివసించే ప్రజలను హిందూ అని పిలిచారు. ఇది అప్పట్లో మతపేరు కాదు, భౌగోళిక పేరు. ప్రాచీన భారతీయులు తమ మతాన్ని సాధారణంగా వైదిక ధర్మం, ధర్మం, లేదా తమ తమ సంప్రదాయాల పేర్లతో (శైవం, వైష్ణవం, శాక్తం మొదలైనవి) పేర్కొనేవారు. "హిందూ మతం" అనే పేరు ప్రాచీన గ్రంథాల్లో కూడా కనిపించదు. హిందూ మతానికి ఒకే వ్యవస్థాపకుడు లేడన్నది నిజమే. అంతమాత్రాన అది మానవ ప్రమేయం లేకుండా ఒకేసారి అవతరించిందని అర్థం కాదు. వైదిక సంప్రదాయం కూడా అనేక శతాబ్దాల పాటు అనేక మంది ద్వారా అనేక శాఖలుగా ఏర్పడింది. ఈ విషయాన్ని రజని కి రమణ మహర్షి ఆశ్రమంలో ఎవ్వరూ చెప్పక పోయినప్పటికీ, కనీసం ద్రవిడ రాజకీయల్నించి ఎవరైనా చెప్పివుంటే బాగుండేది!

నన్నూరి వేణుగోపాల్
98494 49012

# సమాజ హితాన్ని కోరేదే సాహిత్యం



**మల్కాజిగిరి, జూలై 18 (జనంసాక్షి) :** సమాజ శ్రేయస్సును, హితాన్ని ఎల్లవేళలా కాంక్షించేదే నిజమైన సాహిత్యమని ప్రముఖ గురు సహస్రవధాని డా. కడిమిళ్ళ వరప్రసాద్ అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో అక్షర కౌముది సంస్థ ఆధ్వర్యంలో కళాకౌముది నల్లాన్ చక్రవర్తుల సాహిత్ అవధాని స్వర్ణావధాన కార్యక్రమం శనివారం మల్కాజిగిరి పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు మాట్లాడుతూ, సాహిత్య సంస్థలకు అండగా నిలుస్తున్న సాహిత్య అకాడమీ సేవలను కొనియాడారు. అక్షర కౌముది సంస్థ అధ్యక్షులు తులసి విజయలక్ష్మీ వెంకటరమణాచార్యులు మాట్లాడుతూ, గత ఏడేళ్లుగా తమ సంస్థ సామాజిక, సాహిత్య రంగాల్లో వినూత్న కార్యక్రమాలతో ముందుంటోందని తెలిపారు. డా. కడిమిళ్ళ వరప్రసాద్ సంచాలకత్వంలో సాగిన ఈ అవధానం సాహితీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శతావధాని డా. జిఎం. రామశర్మ, మారుమాముల దత్తాత్రేయ శర్మ, మారుమాముల వెంకటరమణ శర్మ, దాసోజు పద్మావతి, డా. సూర్యవర్ధిని, గాంధీ, సూర్యకుమారి, కంది శంకరయ్య, వెలుదండ సత్యనారాయణ, పొత్తూరి సుబ్బారావు, బచ్చుల మాధవి, పోచం సుజాత తదితర సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# బహదూర్‌గూడలో భూముల స్వాధీనంపై ఉద్రిక్తత

- రైతులు, పోలీసుల తోపులాట
- నేతల అరెస్టులు
- సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు

**శంషాబాద్, జూలై 18 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో భూముల స్వాధీన వ్యవహారం శనివారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సేకరించినట్లు అధికారులు పేర్కొంటున్న 650 ఎకరాల భూమికి హైడ్రా, రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు భారీ పోలీసు బందోబస్తుతో గ్రామానికి చేరుకోగా రైతులు, స్థానికులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు వెయ్యికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. గత వారం రోజులుగా భూముల స్వాధీనాన్ని వ్యతిరేకిస్తూ రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్నారు. అయితే శనివారం హైడ్రా అధికారులు రంగంలోకి దిగి భారీ యంత్రాలతో ఫెన్సింగ్ పనులు ప్రారంభించడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. తమ వద్ద భూములకు సంబంధించిన పట్టాలు ఉన్నాయని, తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని రైతులు పేర్కొంటూ కంచె వేయడాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీధర్‌తో రైతులు, స్థానికులు వాగ్వాదానికి దిగగా, అనంతరం పోలీసులతో తోపులాట చోటుచేసుకుంది. ఉద్రిక్త పరిస్థితుల మధ్య రైతులు "సీఎం డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేశారు. ఈ ఘటనలో



రైతు నరసింహ అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోగా, ఆయనను ఆసుపత్రికి తరలించే ప్రయత్నాన్ని తోటి రైతులు అడ్డుకున్నారు. ముందుగా తమకు న్యాయం చేసి, సరైన పరిహారం, పునరావాసంపై హామీ ఇచ్చిన తర్వాతే భూములను స్వాధీనం చేసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. మరోవైపు అధికారులు మాత్రం సర్వే నంబర్లు 28, 62తో పాటు మొత్తం 650 ఎకరాల ప్రభుత్వ భూమిని నిబంధనల ప్రకారమే స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, పోలీసులు కలిసి ఫెన్సింగ్ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, బయటి వ్యక్తుల రాకపోకలను కూడా నియంత్రించారు. రైతుల ఆందోళనకు రాజకీయ పార్టీల మద్దతు లభించింది. సంఘీభావం తెలిపేందుకు గ్రామానికి వెళ్తున్న బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతరం విడుదల చేశారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసం వద్దే అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, అనంతరం విడుదల చేశారు. పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ, న్యాయస్థానం స్టేటస్‌కోలో ఉన్న వందల ఎకరాల భూములను పేదలు, రైతుల నుంచి బలవంతంగా స్వాధీనం చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో రైతుల భూములను స్వాధీనం చేసుకోవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా మారిందని ఆరోపించారు. భూముల స్వాధీనానికి ప్రభుత్వం చట్టబద్ధమైన విధానాన్ని అనుసరిస్తోందా అని ప్రశ్నిస్తూ, హైడ్రా, రెవెన్యూ, పోలీసు శాఖలను ఉపయోగించి పేదలు, రైతుల భూములపై దోపిడీ జరుగుతోందని విమర్శించారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానంలో చట్టపరంగా పోరాడుతామని స్పష్టం చేశారు. అభివృద్ధి ప్రాజెక్టులకు తాము వ్యతిరేకం కాదని, అయితే రైతుల హక్కులు, జీవనాధారానికి రక్షణ కల్పించి, న్యాయమైన పరిహారం ప్రకటించిన తర్వాతే భూములను స్వాధీనం చేసుకోవాలని రైతులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం బహదూర్‌గూడలో భారీ పోలీసు బందోబస్తు మధ్య భూముల స్వాధీన ప్రక్రియ కొనసాగుతుండగా, అధికారులు, రైతులు, పోలీసుల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**సికింద్రాబాద్, జూలై 18 (జనంసాక్షి) :** ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 66 హామీలను అమలు చేయడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర మంత్రి, జి. కిషన్ రెడ్డి విమర్శించారు. శనివారం మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల కారణంగా విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీజేపీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణలపై అప్రమత్తంగా



ఉండాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కొందరు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటూ బూత్ లెవల్ అధికారులను బెదిరించడం ప్రజాస్వామ్యానికి విఘాతమని మండిపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ధరలు పెరుగుతున్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. కేంద్రం అందిస్తున్న ఉచిత రేషన్ ద్వారా 80 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని, ఆయుష్మాన్ భారత్ పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

### మేయర్ పీఠమే లక్ష్యంగా పనిచేయాలి

రానున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మేయర్ పీఠమే లక్ష్యంగా పనిచేస్తూ, బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సమిష్టి కృషితో గ్రేటర్ హైదరాబాద్‌పై బీజేపీ జెండా ఎగురవేసి మేయర్ పదవిని కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని, రమేష్, నెమలి ఆనంద్, నందకం దివాకర్, వెంకటేష్ గౌడ్, గణేష్ ముదిరాజ్, మండల అధ్యక్షులు, మోర్చాల ప్రతినిధులు, బూత్ స్థాయి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహన దొంగల ముఠా అరెస్ట్

- వివరాలు వెల్లడించిన జవహర్ నగర్ డివిజన్ ఏసిపి ఎస్.చక్రపాణి




**శామీర్‌పేట, జూలై 18 (జనం సాక్షి) :** ద్విచక్ర వాహన దొంగతన గ్యాంగును పోలీసులు అరెస్టు చేశారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి.సుమతి ఐపీఎస్, మల్కాజ్‌గిరి జోన్ డిసిపి సిహెచ్. శ్రీధర్ ఐపీఎస్ పర్యవేక్షణలో జవహర్ నగర్ డివిజన్ ఏసిపి ఎస్.చక్రపాణి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శుక్రవారం అర్ధరాత్రి శామీర్‌పేట పోలీసులు తూంకుంట గ్రామంలోని దొంగల మైసమ్మ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు, నేర నివారణ గస్తీ నిర్వహిస్తుండగా నలుగురు సభ్యుల అంతర్–జిల్లా వాహన దొంగతనాల గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్యాంగ్ శామీర్‌పేట పోలీస్ స్టేషన్, కీసర పోలీస్ స్టేషన్, కుషాయిగూడ పోలీస్ స్టేషన్, మునుగూరు పోలీస్ స్టేషన్ (ఖమ్మం), పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ (సైబరాబాద్) పరిధుల్లో వరుసగా బైక్ దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా శామీర్‌పేట పోలీసులు ఏ1 తో పాటు ముగ్గురు సీసీఎల్ ల వద్ద నుండి తొమ్మిది దొంగిలించబడిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన వాహనా లను మేడ్చల్, కండ్లకోయలోని సీఎంఆర్ హాస్పిటల్ వద్ద దాచిపెట్టారు. పైన పేర్కొన్న వ్యక్తులు 20--30 వాహనాలను సేకరించిన తర్వాత అన్నింటినీ కలిపి అమ్మాలనే ఉద్దేశ్యంతో పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలను దొంగిలించడానికి ప్లాన్ చేశారు. శామీర్‌పేట పోలీసులు 9 దొంగిలించబడిన ద్విచక్ర వాహనాలను రికవరీ చేశారు. వరుసగా బైక్ దొంగతనాలకు పాల్పడిన నలుగురు సభ్యుల వాహన దొంగతన గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

### వాహనాలను సురక్షితమైన ప్రదేశాలలో పార్క్ చేయ్యాలి

వాహనాలను సురక్షితమైన ప్రదేశాలలో మాత్రమే పార్క్ చేయాలని వాహన యజమానులకు మల్కాజ్‌గిరి పోలీసులు సూచించారు. హ్యాండిల్ లాక్‌లు, అదనపు దొంగతన నిరోధక పరికరాలను ఉపయోగించాలని, వాహనానికి కీలను వదిలి వేయవద్దని పేర్కొన్నారు. పార్క్ చేసిన వాహనా లతో అనుమానాస్పద వ్యక్తులు తారుమారు చేయడాన్ని గమనిస్తే, వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని లేదా 100 నెంబర్‌కు డయల్ చేయ్యాలని ప్రజలను కోరారు. వాహన దొంగతనాలను నివారించడంలో, ప్రజా భద్రతను కాపాడడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. విలేకరుల సమావేశంలో జవహార్ నగర్ డివిజన్ ఏసిపి ఎస్.చక్రపాణి, శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్‌ఓ కె.నరసింహారెడ్డి, ఎస్ఐ శశివర్ధన్ రెడ్డి, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# జూలై 20న మత్స్యకారుల ధర్నాను విజయవంతం




**హయత్ నగర్, జూలై 18 (జనం సాక్షి) :** వనస్థలిపురం రైతు బజార్ వద్ద 1,000 గజాల స్థలం కేటాయించి రూ.50 లక్షల వ్యయంతో నూతన చేపల మార్కెట్ నిర్మించాలని, ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగిస్తూ సంబంధిత నగదును మత్స్య సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ మత్స్యకారులు – మత్స్య కార్మిక సంఘం (టిఎంకె ఎంకెఎస్) రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 20న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిర్వహించనున్న మత్స్యకారుల ధర్నా పోస్టర్‌ను వనస్థలిపురంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోరెంకల నర్సింహ మాట్లాడుతూ 986 మంది మృతిచెందిన మత్స్యకారుల కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న బీమా, ఎక్స్‌గ్రేషియా సాయాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. మత్స్య మిత్ర మహిళా గ్రూపులను పునరుద్ధరించాలని, రాష్ట్రంలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను అభివృద్ధి చేయాలని, కొత్తగా నిర్మించే చేపల మార్కెట్లలో స్థానిక మత్స్యకారులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం జూలై 20న జిల్లా కలెక్టరేట్ల ఎదుట చేపట్టనున్న ధర్నాల్లో మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అలేటి ఎల్లయ్య, టీఎంకేఎంకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి తడబోయన కృష్ణమూర్తి, మార్కెట్ కమిటీ కోశాధికారి మెంగ సైదులు, నాని, ఉపాధ్యక్షురాలు సునీత, చెక్క కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# క్వ్యార్ బిల్లులో సవరణలు చేయాలి

- ది సిటిజన్స్ కౌన్సిల్

**రాజేంద్రనగర్, జూలై 18 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన క్యూర్ బిల్లుపై సీతారాం దూళిపాల ఆధ్వర్యంలో నిర్వహించిన ది సిటిజన్స్ కౌన్సిల్ ముఖ్య సమావేశంలో సభ్యులు విస్తృతంగా చర్చించి పలు అభ్యంతరాలు, సూచనలను ఏకగ్రీవంగా ఆమోదించారు. బిల్లులో అధికారాలను రాష్ట్ర స్థాయిలో కేంద్రీకరించడం వల్ల పట్టణ స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందని, ఇది 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కార్పొరేషన్, మేయర్, స్టాండింగ్ కమిటీ, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ల ఆర్థిక అధికారాలపై స్పష్టత తీసుకురావాలని, ఎన్నికైన ప్రజాప్రతినిధులకు విధాన రూపకల్పన, అమలు, పర్యవేక్షణలో తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. వార్డు కమిటీలను బలోపేతం చేయడంతో పాటు పౌరసమాజ సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు కూడా ప్రాతినిధ్యం ఇవ్వాలని సూచించారు. ఆస్తి పన్ను అసమానతలు, క్యాపిటల్ వ్యాల్యూ ఆధారిత పన్ను విధానం, నీటి సరఫరా, మురుగునీటి ఛార్జీల వార్షిక పెంపు వంటి అంశాలపై పునఃసమీక్ష అవసరమని అభిప్రాయపడ్డారు. అన్ని పట్టణ సేవల సంస్థలు కార్పొరేషన్‌కు జవాబుదారీగా ఉండేలా, ఎన్నికైన ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో పనిచేసే విధంగా చట్టంలో నిబంధనలు చేర్చాలని కోరారు. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ, పారదర్శకత, జవాబుదారీతనం, స్థానిక స్వపరిపాలన బలోపేతానికి అనుగుణంగా క్యూర్ బిల్లులో సవరణలు చేయాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. ఈ సమావేశంలో ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్ మహమ్మద్, రామసుబ్బారెడ్డి, విద్యాసాగర్, దిలీప్ కక్కడ, బదరీనాథ్, గోపాలకృష్ణ, రామచంద్రరావు, అను కపూర్, శ్రీధర్ రెడ్డి, నరేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



# గురునానక్ విద్యాసంస్థల్లో ఘనంగా స్నాతకోత్సవం




**ఇబ్రహీంపట్నం, జూలై 18 (జనం సాక్షి) :** ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ విద్యాసంస్థల్లో 22వ స్నాతకోత్సవం, ఉద్యోగ నియామక దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో వివిధ కోర్సులు పూర్తి చేసిన 1,004 మంది విద్యార్థులు పట్టభద్రులుగా తమ డిగ్రీ పత్రాలను అందుకున్నారు. విద్యా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన 22 మంది ప్రతిభావంతులకు సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ దివంగత సర్దార్ తవిందర్ సింగ్ కోహ్లీ స్మారకార్థం స్వర్ణ, రజత పతకాలను అందజేశారు. మరోవైపు ఈ ఏడాది వివిధ ఎంపిక ప్రక్రియల ద్వారా 205కు పైగా ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన 1,049 మంది విద్యార్థులకు యాజమాన్యం నియామక పత్రాలను అందజేసింది. రాంచ్ పాలిమర్స్ (180 మంది), హక్లటెక్ (102), కాగ్నిజెంట్ (96), టీసీఎస్ (90), లటైమింద్రీ (81) తదితర ప్రముఖ సంస్థలు విద్యార్థులను ఎంపిక చేసుకున్నాయి. ఇందులో ఎంయూ సిగ్మా సంస్థ అత్యధికంగా రూ. 40 లక్షల వార్షిక వేతనాన్ని అందించగా, ప్రొవిడెన్స్ గ్లోబల్ సెంటర్ రూ. 14 లక్షలు, రియల్ పేజ్ సంస్థ రూ. 10 లక్షల వార్షిక వేతనాన్ని అందించాయి. పారిశ్రామిక నైపుణ్యాల పెంపు కోసం కాలేజీ యాజమాన్యం హనీవెల్ , సాప్ , విప్రో వంటి పలు అగ్రశ్రేణి సంస్థలతో నూతన అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మిథాని సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎస్.వి.ఎస్. నారాయణ మూర్తి మాట్లాడుతూ.. వేగంగా మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నిరంతర నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకతలతో విద్యార్థులు దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సంస్థ వైస్ ఛైర్మన్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, మేనేజింగ్ డైరెక్టర్ డా. హెచ్.ఎస్. సైనీ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పారిశ్రామిక శిక్షణ ఇవ్వడమే తమ లక్ష్యం అని , అందుకే తమ సంస్థకు నాక్ 'ఏ ం' గ్రేడ్, ఎన్ బిఏ గుర్తింపు లభించాయని పేర్కొన్నారు. ఈ వేడుకలో కాలేజీ డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథ రెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పీఆర్‌సీ ప్రకటించి, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

- తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ

**ఇబ్రహీంపట్నం, జూలై 18 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ లో ఉన్న పిఆర్సి రిపోర్టును తెప్పించుకుని 51% ఫిట్మెంట్ ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'తపస్ సభ్యత్వ అభియాన్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల ప్రకారం సమస్యల న్యాయపరమైన పరిష్కారం కోసం ఉద్యమించడం మినహా మరో మార్గం లేదన్నారు. 'ఈ–కుబేర్' లో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బిల్లులన్నింటినీ పూర్తిగా చెల్లించాలని, భవిష్యత్తులో ఏ బిల్లు పెండింగ్‌లో లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న




6 డిఏలను వెంటనే ప్రకటించకపోవడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నారన్నారు. మే నెల జీతం నుండి హెల్త్ కార్డుల కోసం వాటా కోత విధించినప్పటికీ, ట్రస్ట్ ఏర్పాటు అసంబద్ధంగా ఉందని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని అన్ని సంఘాలకు ఇందులో భాగస్వామ్యం కల్పించి, మార్గదర్శకాలు పూర్తి అయ్యాకే కటింగ్స్ చేయాలని స్పష్టం చేశారు. కేజీబీవీ, ూూూ మహిళా ఉపాధ్యాయులు మరియు సిబ్బందికి సమ్మె కాలపు జీతాన్ని చెల్లిస్తూ, మీూ అమలు చేయాలని, మోడల్ స్కూల్ 010 పద్దుపై సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ (ూూూ) విధానాన్ని అమలు చేయాలని, ఇందుకోసం సుప్రీంకోర్టులో ప్రభుత్వం వేసిన ూూ ని వెనక్కి తీసుకోవాలని, మేనిఫెస్టోలో పెట్టిన విధంగానే సిపిఎస్ ను పూర్తిగా రద్దు చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం జూలై 14న జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహించి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి మెమోరాండం సమర్పించామని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 1వ తేదీన రాష్ట్ర రాజధానిలో మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తపస్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు వడ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాపోల్ ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి పట్నం కృష్ణ, మండల బాధ్యులు శ్రీనివాస్, ఉదయ్ కుమార్, పొట్టి మహేష్, లలిత, కృష్ణవేణి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
19 జూలై 2026

# ఆడపిల్లల విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్ రూరల్, జూలై 18 (జనం సాక్షి) :** ఆడపిల్లల విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగరంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో రూ.25 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత తరగతి గదులు సరిపోకపోవడంతో కొత్త గదుల నిర్మాణం చేపట్టుతున్నామని తెలిపారు. ఈ నిర్మాణం పూర్తయిన తర్వాత విద్యార్థులకు విశాలమైన, సౌకర్యవంతమైన తరగతి గదులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ స్థాపనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బీఎస్సీ కంప్యూటర్స్‌తో పాటు ఇతర కోర్సుల విద్యార్థులు కూడా కంప్యూటర్ పరిజ్ఞానం పొందేందుకు సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. అదనంగా టాస్క్ సెంటర్ ద్వారా విద్యార్థులు వివిధ భాషలు నేర్చుకునే అవకాశాలు కల్పిస్తున్నామని, స్వల్పకాలిక శిక్షణా కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినులు వీటిని ఎక్కువగా వినియోగించుకుంటున్నారని అన్నారు. రాబోయే పోలీస్ నియామకాల నేపథ్యంలో కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు సిద్ధం కావాలని విద్యార్థులను ప్రోత్సహించిన ఎమ్మెల్యే, ఎన్‌సీసీ విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి రోజువారీ సాధన చేయాలని సూచించారు. రాబోయే నెలల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉండనున్న నేపథ్యంలో, ఫైనల్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులు ఇప్పటి నుంచే జనరల్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, మెంటల్ అబిలిటీ, రీజనింగ్ వంటి అంశాలలో ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. మహిళా విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఎంతోమంది అమ్మాయిలు విద్యను కొనసాగించగలుగుతున్నారని ఆయన తెలిపారు. అమ్మాయిలను చదివించడంలో వెనుకంజ వేయకుండా సమాన అవకాశాలు కల్పిస్తే వారు కుటుంబానికి, సమాజానికి ఆదారంగా నిలుస్తారని పేర్కొన్నారు. ఉచిత బస్సు పథకం విజయవంతమై అనేక మంది విద్యార్థినుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి గారు కళాశాల గ్రంథాలయ అభివృద్ధికి తన సొంత నిధుల నుండి రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో అందజేశారు. ప్రతి సంవత్సరం రూ.50 వేల సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి,ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకులు రమేష్ ముకుందం , మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజులు రెడ్డి,ఇంచార్ ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాయసముద్రం చెరువు అభివృద్ధి పనులు ప్రారంభించాలి



**రామచంద్రాపురం, జూలై 18 (జనం సాక్షి) :** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని 127 ఎకరాల రాయసముద్రం చెరువు అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించాలని రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. హైదరాబాద్ బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుష్పనగేష్ మాట్లాడుతూ, ఓల్డ్ రామచంద్రాపురం--రామచంద్రారెడ్డి నగర్ కాలనీల మధ్య ఉన్న రాయసముద్రం చెరువు అభివృద్ధికి గతంలోనే నిధులు మంజూరైనప్పటికీ, అనివార్య కారణాలతో ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. చెరువు అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే హైడ్రా, జీహెచ్ఎంసీ సమన్వయంతో చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినా అమలు జరగలేదని వివరించారు. చెరువు అభివృద్ధికి అవసరమైన డీపీఆర్‌ను త్వరితగతిన సిద్ధం చేసి పనులను వెంటనే ప్రారంభించాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. రాయసముద్రం చెరువు అభివృద్ధి చెందితే రెండు డివిజన్ల ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

## ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు కల్పించాలి
- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్ రూరల్, జూలై 18 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లిలో ఉన్న ఎస్.సి. బాలుర వసతి గృహాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహ ప్రాంగణం, వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వసతి, భోజనం, పారిశుధ్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు నాణ్యంగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహాల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.



# రైతులు మెట్ట పంటల వైపు దృష్టి సారించాలి

- శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు విధానాలు మార్చుకోవాలి
- జిల్లాలో ఎల్ నినో వ్యవసాయ శాఖ అవగాహన సదస్సుల ద్వారా విస్తృత ప్రచారం
- మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి



**మెదక్ బ్యూరో, జూలై 18 (జనం సాక్షి) :** ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న మేరకు ఈ పరిస్థితుల్లో రైతాంగం సాంప్రదాయ సాగు చేయకుండా, మారుతున్న ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలి. అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు, కార్మిక, ఉపాధి ,గనుల, పారిశ్రామిక, భూగర్భ వనరుల శాఖ మరియు మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం మెదక్ జిల్లాలోని చేగుంట మండలంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు వేదికలో ఎల్ నినో వ్యవసాయ శాఖ అవగాహన సదస్సులో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి అని, ఇప్పటికే 'రైతు భరోసా' అందించి అన్నదాతలకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో అనుకున్నంత వర్షపాత నమోదు కాలేదని భూగర్భ జలాలు వరి పంటకు అనుకూలంగా లేకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి ఎల్ నినో ప్రభావం ఉంటుందని రైతులకు విస్తృత ప్రచారం కల్పించిందన్నారు. అవగాహన లేమితో వరి పంటను పండిస్తున్నారని ఇప్పటికైనా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలపై మొగ్గు చూపాలన్నారు. అంతకుముందు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలంటే వారికున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కోతులు బెడద ఎక్కువగా ఉందని, ఆరుతడి పంటలపై సబ్సిడీ విషయంలో సానుకూల దృష్టితో వ్యవహరించాలని మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా రైతులు సమావేశ వేదికగా తమ వాదనలను మంత్రివర్యులకు విన్నవించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. వరి వద్దు ప్రత్యామ్నాయ పంటలే ముద్దు అని నినాదంతో జిల్లాలో రైతులకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని ఇప్పటికే అనేక సదస్సులలో రైతులకు చెప్పడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఆదేశించిన మేరకు జిల్లాలోని అన్ని రైతు కేస్ వేదికలలో ఎల్ నేను అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతులందరూ వ్యవసాయ శాఖ సలహాలు సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య, డి డబ్ల్యు ఓ హేమ భార్గవి, జిల్లా వ్యవసాయ అధికారి, ప్రజా ప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయ పంటలు వేయాలి



**తూప్రాన్, జూలై 18 (జనం సాక్షి) :** దేశవ్యాప్తంగా ఎల్‌నీనో ప్రభావం ఉండడంవల్ల వర్షాలు అతి తక్కువ అవకాశం ఉందని దీని ప్రభావాన్ని ఎదుర్కోవడానికి రైతులు ఇతర పంటల వైపు దృష్టి సాధించాలని జెడ్పి సీఈవో ఎల్లయ్య తెలిపారు. మండలంలోని గుండేడిపల్లి రైతువేదికలో ప్రత్యామ్నాయ పంటల పై అవగాహన సదస్సు లో మాట్లాడారు. వర్షాలు కురవడం మన చేతుల్లో లేదని ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడానికి అందుకు అనుకున్నాంగా రైతులు ఇతర పంటల వైపు దృష్టి సాధించాలన్నారు ఇప్పటికే నారు వేసిన రైతులు వర్షాలు పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారని వరి నారు వేస్తే పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంటుందని వరి పంట వేసి నష్టపోవద్దని అతి తక్కువ అతి తక్కువ నీటితో పండే పంటలను వేయాలని సూచించారు కందులు మినుములు పల్లి శెనగలు పెసలు ఆముదం పుంట్లు వంటి పంటలను వేయాలని కోరారు ఏ పంట వెయ్యాలో రైతులు సమిష్టిగా చర్చించుకొని అనుకూలమైన పంటను వేయాలని కోరారు ఎల్ నీ నో ను ఎదుర్కోవడానికి రైతుల సన్నద్ధం కావాలని దాని ప్రభావానికి రైతులు నష్టపోకూడదని ఉద్దేశంతో ప్రత్యామ్నాయ పంటలను పండించాలని కరువును ఎదుర్కోవడానికి నష్టం జరగకుండా పంటలు వేయాలని ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని అన్నారు మండల వ్యవసాయ అధికారి గంగమలు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన వరి విత్తనాలను మాత్రమే వేయాలని తొక్క కాలంలో దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు పామాయిల్ సాగు డ్రిప్పు స్ప్రింక్లర్ పథకాలను ఉపయోగించుకోవాలని కోరారు మండలంలోని మల్కాపూర్ మరికొన్ని గ్రామాలలో ఇప్పటికే కూరగాయల పంటలు వైపు దృష్టి సాధించారని లాభాలు వచ్చే పంటలను మాత్రం వేయాలని రైతులు నష్టపోవద్దని కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచులు యాదమ్మ కృష్ణ స్వామి ఆంజనేయులు గౌడ్ సంతోష్ రెడ్డి నవీన్ బిక్షపతి ఎంపీడీవో శాలిక ఎంపీ ఓ సతీష్ జింక మల్లేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 18 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లాకు నూతనంగా మంజూరైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శనివారం అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఆర్డీవో అర్చన, రెవెన్యూ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లా పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ భూమిని సందర్శించిన కలెక్టర్, భవన నిర్మాణానికి ఆ స్థలం అన్ని విధాలా అనుకూలంగా ఉందా అనే అంశాలను సంబంధిత అధికారులతో కలెక్టర్ కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల విస్తీర్ణం, ప్రభుత్వ భూమి సరిహద్దులు, అనుసంధానం, ప్రజలకు రాకపోకల సౌలభ్యం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరణ అవకాశాలు, సదుపాయాల లభ్యతపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని కలెక్టర్ నాగర్కర్నూల్ తహసిల్దార్ ను ఆదేశించారు. నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం ఆధునిక సౌకర్యాలతో నిర్మించబడేలా అనువైన స్థలాన్ని మంజూరుకు కావలసిన ప్రతిపాదనలను చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు, సాంకేతిక అనుమతులు, స్థలానికి సంబంధించిన రికార్డులు, ఇతర పరిపాలనా ప్రక్రియలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రత్యేక భవనం నిర్మించడం ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందుబాటులోకి వస్తాయని, భవనం పూర్తయిన తర్వాత ప్రజలు ఒకే చోట అన్ని రిజిస్ట్రేషన్ సేవలను సౌకర్యవంతంగా పొందగలరని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, నాగర్ కర్నూల్ తాహసిల్దార్ తబితా రాణి, సబ్ రిజిస్టార్ ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

## చారిత్రాత్మక కట్టడాల పరిశీలన



**వెల్దుర్తి, జూలై 18 (జనం సాక్షి) :** మండల కేంద్రమైన వెల్దుర్తిలో కాకతీయ చారిత్రాత్మక కట్టడాలు, ఆలయాలను శనివారం సీనియర్ టూరిజం, కన్సల్టెంట్ అధికారులు శవంతి, భువన్, జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా వెల్దుర్తి లోని శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన విఠలేశ్వర స్వామి ఆలయం, అనంతపద్మనాభ స్వామి ఆలయంను, కాకతీయులు నిర్మించిన శిలాతోరణం, విజయ స్తూపం ను పరిశీలించి వాటి పరిస్థితులను స్థానికులను అడిగి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్దుర్తిలోని ఆధ్యాత్మిక చారిత్రాత్మక కట్టడాలను పరిశీలించడం జరిగిందని వాటికి సంబంధించిన వివరాలను నివేదికలను తయారుచేసి జిల్లా కలెక్టర్కు అందించడం జరుగుతుందని వారు సూచించారు. వారి వెంట వెల్దుర్తి మండల విద్యాధికారి బుచ్చయ్య నాయక్ హెచ్ఎం సాంబయ్య ఉన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఇటిక్యాల, జూలై 18 (జనం సాక్షి) :** ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి సంధ్య కిరణ్మయి డాక్టర్లకు సూచించారు. శనివారం ఇటిక్యాల పీహెచ్ సీ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె ఓపి రిజిస్టర్, సిబ్బంది రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవాలన్నారు. బాలికలకు భవిష్యత్తులో గర్భాశయ వ్యాధులు రాకుండా ముందస్తుగా హెచ్ పివి వ్యాక్సిన్ వేయించుకునేలా గ్రామాలలో వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు నెలవారి పరీక్షలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు జయశ్రీ మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు మంద శ్రీనాథ్ ఆటో క్లేవ్ మిషన్ ను డిఎం హెచ్ఓ సంధ్య కిరణ్మయికు అందజేశారు. ఆస్పత్రి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తూ ఉండాలని సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, పిహెచ్ సి డాక్టర్ రాధిక, వైద్య సిబ్బంది ఉన్నారు.



## ఆకునూరులో ఎస్‌బీఐ బ్యాంకు ఏర్పాటు చేయాలి



**చేర్యాల, జూలై 18 (జనంసాక్షి) :** చేర్యాల మండలం మేజర్ గ్రామపంచాయతీ ఆకునూరు గ్రామంలో ప్రజల సౌకర్యార్థం ఎస్‌బీఐ బ్యాంకు మంజూరు చేసి, ఏటీఎం ఏర్పాటు చేయాలని, యువత, విద్యార్థుల కోసం మినీ స్టేడియం ఏర్పాటుచేసి క్రీడా రంగాన్ని ప్రోత్సహించాలని, ఎంతో చరిత్ర కలిగిన ఆకునూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పూర్వం నుంచి ఉన్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని పున: ప్రారంభించాలని కోరుతూ పలు సమస్యలపై సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ ఆధ్వర్యంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి గ్రామస్థులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ కి కృతజ్ఞతలు తెలిపారు.

# అధిక ధరలు నియంత్రించకపోతే ఆందోళన తప్పదు

- బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకట్రాములు ముదిరాజ్

**మక్తల్, జూలై 18 (జనంసాక్షి) :** అధికారుల నిర్లక్ష్యం వల్ల మక్తల్‌లో ఫర్టిలైజర్ వ్యాపారులు అధిక ధరలకు డిఏపి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని బిజెపి కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకట్రాములు ముదిరాజ్ డిమాండ్ చేశారు. మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మక్తల్ మండలంలో డిఏపి ధరలు ఆకాశాన్ని అంటుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నియంత్రణ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫర్టిలైజర్ వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలను పెంచి అమ్ముతున్నారని అన్నారు. దీనితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎమ్మార్పీ 1350 ఉంటే రూపాయలు ఉంటే 19 వందలు నుండి రూ.2500 వరకు విక్రయిస్తున్నారని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. రైతులు వర్షాలు రాక ఎన్నో ఇబ్బందులకు గురై విత్తనాలు వేసిన వర్షాలు రాకపోవడంతో అప్పుల పాలై మదన పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దాంతోపాటు అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసి పంటలు వేయడంతో రైతులు నష్టపోయి అప్పుల పాలు అవుతున్నారని అన్నారు. వ్యాపారులు ఇస్తానుసారంగా ధరలు పెంచి రైతులను నట్టేట ముంచుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. స్థానిక అధికారులతో పాటు జిల్లా అధికారులు స్పందించి అధిక ధరలకు డీఏపీ విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వర్షాభావ పరిస్థితుల వల్ల పంట నష్టం జరిగిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం స్పందించి ఎరువుల అధిక ధరలను నియంత్రించ కుంటే నారాయణపేట జిల్లా కిషన్ మోర్చా తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జిల్లా అధ్యక్షులు వెంకట్రాములు ముదిరాజ్ హెచ్చరించారు. ఈ విలేఖరుల సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి .బలరాం రెడ్డి, మక్తల్ మండల అధ్యక్షుడు ఎం. ప్రతాపరెడ్డి, మాధ్వార్ సర్పంచ్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ మహదేవమ్మ, ఖానాపురం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి వర్షపు నీటిబొట్టును కాపాడుకోవాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 18 (జనంసాక్షి) :** ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలోకి ఇంకించి కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి కార్యాలయ ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని పలు రాష్ట్రాలు ఎల్ నినో ప్రభావం వల్ల సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో నోటు వర్షపాతం నమోదు కారణంగా భూమిలోని నీటిమట్టం మరింత క్రిందికి పోవడంతో భవిష్యత్తు తరాల వారు ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి వర్షపు నీటి బొట్టును ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకించి భూగర్భ జల మట్టాన్ని పెంపొందించాలని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురవాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. వర్షపు నీటిని వృధాగా పోనివ్వకుండా భూమిలోకి ఇంకించడంతో పాటు నీటిని పొదుపుగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రియాజ్ అలీ, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారితకు ప్రభుత్వం కృషి

- మహిళల హక్కుల పరిరక్షణలో అండగా మహిళా కమీషన్
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**పాలకుర్తి, జూలై 18(జనంసాక్షి) :** మహిళా సాధికారితకు కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల నూతనంగా మహిళా కమీషన్ సభ్యులుగా నియమితులైన చిట్యాల శ్వేత. కాసోజు శంకరమ్మ, సునావత్ రాధా, యాదాద్రి దేవస్థానం బోర్డు సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణకు శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కమీషన్ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు మహిళా సంఘాల ప్రతినిధులకు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు, అద్దె బస్సులు అప్పగించి వారి ఆర్థిక వృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఆడబిడ్డలకు ఖర్చు తగ్గించే ఉద్దేశ్యంతో రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తుందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేసి ఆడబిడ్డల సొంతింటి కల నెరవేర్చమన్నారు. మహిళా కమీషన్ సభ్యులు మహిళల హక్కుల పరిరక్షణకు పాటుపడుతారని, అందరికి న్యాయం చేసే విధంగా కమీషన్ ప్రతి నిధులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహిళా కమీషన్ సభ్యులు కాసోజు చిట్యాల శ్వేత. కాసోజు శంకరమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఏ ఇబ్బంది. కలిగినా, ఎక్కడైనా అన్యాయం జరుగుతుందనుకున్నా నేరుగా వచ్చి వారి హక్కులను కాపాడేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. మహిళలకు అండగా నిలబడుతామనే ఉద్దేశ్యం తో ప్రభుత్వం తమకు బాధ్యతలను అప్పగించిందని, దాన్ని నిలబెట్టుకుంటామని మహిళా కమీషన్ సభ్యురాలు సునావత్ రాధ అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### క్రమశిక్షణతో కూడిన విద్యే ఉన్నత స్థాయికి చేర్చుతుంది

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారనే విద్యార్థులు ఉన్న స్థాయికి చేరుకుంటారని. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ లావుడ్యా మంజుల, భాస్కర్, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, ఆత్మ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మాజీ సర్పంచు యాకాంతరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోగు శ్రీనివాస్, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, ఎం డి. మదార్, చిలువేరు కృష్ణమూర్తి. వర్రె వెంకన్న. మేడారపు సుధాకర్. పాఠశాల అధ్యాపక బృందం. తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు సాగాలి

- సివిల్ జడ్జి పర్వతపు రవికుమార్




**చెన్నూర్, జూలై 18 (జనంసాక్షి) :** ప్రతి విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని, దానిని సాధించేందుకు కృషి చేస్తేనే జీవితంలో విజయాలు సాధించగలరని చెన్నూర్ మున్సిఫ్ కోర్టు సివిల్ జడ్జి పర్వతపు రవికుమార్ అన్నారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో కొందరు వ్యక్తులు ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రకటనలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు ఇటువంటి మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండటంతో పాటు తమ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు కూడా మోసపోకుండా చైతన్యం కల్పించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికోసం కష్టపడాలని, చట్టాలపై అవగాహన పెంపొందించుకుని అవసరమైనప్పుడు ఉచిత న్యాయ సేవలు, న్యాయ సలహాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, ఎస్సై శ్యామ్, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాసర జడ్పీహెచ్ఎస్ భవనం శిథిలం

- పైనుంచి ఊడిపడుతున్న సిమెంట్ ముక్కలు, భయంతో చదువుతున్న బాలికలు





**బాసర, జూలై 17(జనం సాక్షి) :** బాసర మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు నుంచి పెచ్చులూడి కాంక్రీట్ ముక్కలు రాలుతుండడంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పై అంతస్తులో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలికలకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో రోజూ భయం భయంగా క్లాస్ కు వెళ్తున్నామని విద్యార్థినులు చెబుతున్నారు. శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఈ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. ప్రధానోపాధ్యాయుడిని కలిసి సమస్యను వివరించిన తల్లిదండ్రులు, ఇప్పటివరకు శాశ్వత చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "చిన్న ప్రమాదం జరిగినా పెద్ద నష్టం జరిగే అవకాశం ఉంది. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందే చర్యలు తీసుకోవాలి" అని వారు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్, ఎమ్మెల్యే వెంటనే స్పందించి భవనాన్ని సాంకేతికంగా పరిశీలించాలని, ప్రమాదకర గదులను మూసివేసి ప్రత్యామ్నాయ తరగతులు ఏర్పాటు చేయాలని కోరారు. లేదంటే వెంటనే నూతన భవనం నిర్మాణం లేదా అత్యవసర మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని గ్రామస్తులు కోరుతున్నారు.

# 20న ప్రజావాణి రద్దు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, జూలై 18 (జనంసాక్షి) :** ఉట్నూర్ లోని పి.ఎం.ఆర్.సి. సమావేశ మందిరంలో ఈ నెల 20వ తేదీన జిల్లా స్థాయి అధికారులతో ఉమ్మడి జిల్లా మంత్రి, రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించనున్నందున 20వ తేదీ సోమవారం రోజున జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.

# ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళతాం

- పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ



**మంచిర్యాల ప్రతినిధి, జూలై 18 (జనంసాక్షి) :** ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళ్తామని, ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలం గూడెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విశాఖ చారిటబుల్ ట్రస్ట్ తరఫున మంజూరు చేసిన స్కూల్ బ్యాగులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి. చంద్రయ్య లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ... పాఠశాలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న 150 మంది విద్యార్థులకు విశాఖ చారిటబుల్ ట్రస్ట్ తరఫున స్కూల్ బ్యాగులను అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో 110 మంది విద్యార్థులకు అందించడం జరిగిందని, మిగిలిన వారికి పంపిణీ చేస్తామని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు క్రింద కూర్చోకుండా విద్యార్థులకు సరిపడా బెంచీలు అందించేందుకు ట్రస్ట్ తరఫున చర్యలు తీసుకుంటామని తెలిపారు. విశాఖ చారిటబుల్ ట్రస్ట్ తరఫున నీటి సౌకర్యం కల్పించేందుకు బోర్ వెల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు.

# గంటల వ్యవధిలోనే హత్య కేసు చేధన

- నిందితున్ని రిమాండుకు తరలించిన రెబ్బెన పోలీస్




**రెబ్బెన, జూలై 18 (జనంసాక్షి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలో అసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన మసాడే సోమయ్య హత్య కేసును పోలీసులు చాకచక్యంగా గంటల వ్యవధిలోనే ఛేదించి నిందితున్ని అరెస్ట్ చేసి, రిమాండ్ కు పంపించనున్నారు. రెబ్బెన మండలం తుంగేడ గ్రామానికి చెందిన బోగరపు నగేష్ పట్టుబడ్డారు. రెబ్బెన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.సంజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2026, జులై 17న సుమారు 12.30 గంటల ప్రాంతంలో ఆసిఫాబాద్ జిల్లా పర్సనంబాల గ్రామానికి చెందిన మసాడే సోమయ్య(65) తన పెద్ద కూతురును హైదరాబాద్ వెళ్ళడానికి ట్రైన్ ఎక్కివడానికి మృతుడు, తన భార్య మరియు, తన చిన్న కూతురుతో కలసి అసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్కు వచ్చినారు. ట్రైన్ కోసం వేచే సమయంలో, మృతుడు టీ కోసం స్టేషన్ నుండి బయటకు రాగ, అతనివద్ద ఉన్న డబ్బులను చుసిన, అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి, మృతునివద్దకు వచ్చి, డబ్బులు అడగగా, అందుకు నిరాకరించినందుకు, అట్టి గుర్తుతెలియని వ్యక్తి గొడ్డలితో మృతుని మెడపై నరికి, దేహంనుండి తలను వేరుచేసి అతికిరాతకంగా చంపి, భయంతో అక్కడినుండి పారిపోయినాడు. సమాచారం తెలుసుకున్న వెంటనే రెబ్బెన పోలీసువారు అట్టి సంఘటన స్థలంకు చేరుకొని, విచారణ చేపట్టి, నిందితుడు ఆనవాళ్లు తెలుసుకొని, రైల్వే మార్గంగుండా తప్పించుకున్నాడని గుర్తించి, తర్వాత జిల్లా ఉన్నత పోలీస్ శాఖ అధికారిని, నితిక పంత్ ఐపీస్ ఆదేశాలమేరకు, అసిఫాబాద్ సబ్ డివిసన్ బి. అశోక్ డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ రెబ్బెన, ఎం.సంజయ్, ఎస్సై రెబ్బెన, ఏ వెంకటకృష్ణ, ఎస్సై తిర్యాణి, పి సుబ్బారావు మరియు ఇతర పోలీస్ వారు 5 బృందాలుగా ఏర్పడి, నిందితున్ని సీసీటీవీ కెమెరాల సహాయంతో సిర్పూర్-టీ రైల్వే స్టేషనులో గుర్తించి పట్టుకున్నారు. నిందితుడు బోగరపు నగేష్ తండ్రి చంటయ్య, నివాసం తుంగేడ గ్రామం, రెబ్బెన మండలం, నిందితుడు తాగుడుకు అలవాటు పడి, డబ్బులకోసం అందరిదగ్గర అడిగేవాడు, ఇదే క్రమంలో, మృతుడి వద్ద డబ్బులు చూసి, అట్టి డబ్బులు కోసం అడగగా, మృతుడు నిరాకరించడంతో, కోపానికి గురై మృతున్ని ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో, మొదటగా తన వెంటే ఉన్న గొడ్డలితో, మృతుడి మెడపై నరికి, తలను మొండం నుండి వేరుచేసినాడు. సంఘటన జరిగిన వెంటనే పోలీస్ వారు స్పందించి, చాకచక్యంగా నిందితున్ని కొన్ని గంటల వ్యవధిలోనే పట్టుకోవడంలో ఉన్నతమైన ప్రతిభ కనబరిచిన, పోలీస్ అధికారులను మరియు ఇతర సిబ్బందిని వారిని జిల్లా ఉన్నత పోలీస్ శాఖ అధికారిని, ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ అబినందించినారు.

# ఎస్సీ కమిటీ భవనం కోసం కృషి చేస్తా

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్, జూలై 18 (జనంసాక్షి) :** శివుని పెల్లి ఎస్సీ కమ్యూనిటీ భవనం కోసం కృషి చేస్తానని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎస్సీలకు హామీ ఇచ్చారు. శనివా రం స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలో గల శివునిపల్లి ఎస్సీ కమిటీ భవనంకోసం హనుమకొం డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్టేషన్ గన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ని 2 వ వార్డు కౌన్సిలర్ గుర్రం హరినాథ్,3వ వార్డు కౌన్సిలర్ గుర్రం హైమా రమేష్ ఆధ్వర్యంలో ఎస్సి సామాజికవర్గం పెద్దలు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. కమ్యూనిటీ విషయంలో ఎమ్మెల్యే కడి యం శ్రీహరి సానుకూలంగా స్పందించి త్వరలోనే భవన నిర్మాణానికి హామీ ఇవ్వడం జరిగింది. మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేయడం తన లక్షణం అని కడియం అన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2 వ వార్డు కౌన్సిలర్ గుర్రం హరినాథ్, 3వ వార్డు కౌన్సిలర్ గుర్రం హైమా రమేష్, ఎస్సీ సామాజిక వర్గం పెద్దలు తదితరులు పాల్గొ న్నారు.

# ప్రభుత్వ నిషేధానికి తూట్లు

- పలిమెల మండలంలో యథేచ్ఛగా 'గ్లైసిల్' విక్రయాలు!
- ఇళ్లలోనే నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు
- పంట దిగుబడి, భూసారం దెబ్బతింటుందని రైతుల ఆవేదన
- అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్




**పలిమెల, జూలై 18 (జనంసాక్షి) :** భూసారానికి, పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూర్చే 'గ్లైసిల్', 'ఎమర్జెన్సీ' వంటి ప్రమాదకరమైన గడ్డి మందులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. కానీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో మాత్రం ఈ నిషేధాజ్ఞలు కాగితాలకే పరిమితమయ్యాయి. నిబంధనలను బేఖాతరు చేస్తూ కొందరు వ్యాపారులు ఈ నిషేధిత గడ్డి మందులను యథేచ్ఛగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

మండలంలోని కొన్ని ఫెర్టిలైజర్ షాపుల నిర్వాహకులు అధికారుల తనిఖీలకు దొరకకుండా సరికొత్త ఎత్తుగడలు వేశారు. నిషేధిత గడ్డి మందులను దుకాణాలలో ఉంచకుండా, తమ నివాస గృహాలలో సీక్రెట్‌గా నిల్వ ఉంచుతున్నారు. ఎవరికైనా కావాలి అంటే నమ్మకస్థుల ద్వారా సమాచారం తెలుసుకుని, ఇళ్ల నుంచే నేరుగా తెచ్చి ఇస్తూ బ్లాక్ మార్కెట్ దందాను జోరుగా సాగిస్తున్నారు.

'ప్రభుత్వమేమో భూమి పాడైపోతుందని ఈ మందులను బ్యాన్ చేసింది. కానీ ఇక్కడ కొందరు స్వార్థపరులు ఎక్కువ లాభాల కోసం వీటిని తెచ్చి అమ్ముతున్నారు. తెలియక కొనే రైతులు దీనివల్ల భవిష్యత్తులో పంట దిగుబడి తగ్గిపోయి ఎంతో నష్టపోవాల్సి వస్తుంది. ఇంత పెద్ద మోసం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం బాధాకరం." అని మండలంలోని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిషేధించిన రసాయనాలు మండలంలో విచ్చలవిడిగా దొరుకుతుండటంపై స్థానిక ప్రజలు, మేధావులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిఘా లోపం వల్లే ఈ అక్రమ విక్రయాలు సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్పందించి, పలిమెల మండలంలో ఇళ్లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, నిషేధిత గడ్డి మందులను విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# రుణాలు త్వరితగతిన అందించేందుకు కృషి



- బిఓఐ హెడ్ ఆఫీస్ జనరల్ మేనేజర్ ముఖేష్ శర్మ
- ఘనంగా కిసాన్ దివస్ అభినందన కార్యక్రమం

**వరంగల్ బ్యూరో, జూలై 18 (జనం సాక్షి) :** బ్యాంక్ ఆఫ్ ఇండియా (బి వో ఐ) ఆధ్వర్యంలో శనివారం కిసాన్ దివస్ అభినందన కార్యక్రమాన్ని ఖిలా వరంగల్ లోని దీపు ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఓఐ హెడ్ ఆఫీసు జనరల్ మేనేజర్ ముఖేష్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ వ్యాపార, వ్యవసాయ, గృహ నిర్మాణ, వాహనాలు, విద్య తదితర రుణాలు త్వరితగతిన అందించేందుకు బిఓఐ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా రైతుల సంక్షేమం, అభివృద్ధి, సుస్థిర వ్యవసాయం దిశగా బ్యాంక్ ఆఫ్ ఇండియా చేస్తున్న కృషి తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదన్నారు. రైతుల అభివృద్ధే దేశ అభివృద్ధిగా బావించడం జరుగుతుందని తెలిపారు. బ్యాంకు పేరు చెప్పి సైబర్ నేరగాళ్లు మీకు పోన్ చేసినా, మెసేజ్ పంపినా ఓటిపి చెప్ప రాదని సూచించారు. ఎలాంటి రుణాలకైనా తమ ఖాతాదారులకు, వినియోగదారులకు అందుబాటులో ఉండి సత్వర సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో బ్యాంక్ ఆఫ్ ఇండియా కి 120 సంవత్సరాల ఘన చరిత్ర ఉందని, ఖాతాదారుల సహకారంతో బ్యాంకు మరింత వృద్ధి చెందుతూ దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలంగాణ జోనల్ మేనేజర్ ముఖేష్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ తుషార్ కాంత్ ఝా, డిప్యూటీ జోనల్ మేనేజర్ కళ్యాణ్ చక్రవర్తి, ఎఫ్బీఓఐఓఏ ప్రెసిడెంట్ గాలేటి నాగేశ్వర్, అల్ ఇండియా ఎస్సి ఎస్టి ఒబీసి అసోసియేషన్ నాయకులు లావుడ్య రాజేందర్, ఉదయ్ దారావత్, శశి కాంత్, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బి. రాజేష్, బ్యాంకు మేనేజర్ లు గోపీక్రిష్ణ, భూక్యా తారాచంద్, రాజేష్, ఫీల్డ్ ఆఫీసర్లు, సిబ్బంది, కస్టమర్‌లు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన గురుకుల విద్యార్థినులు

- కదిలించిన జనంసాక్షి కథనం
- ప్రిన్సిపాల్ సస్పెన్షన్!


వివాదాలకు కేరాఫ్ ట్రైబల్ వేల్ఫేర్ గురుకులం

**కొత్తగూడ, జూలై 18 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గాంధీ నగర్ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల దుస్థితిపై 'జనం సాక్షి' ప్రచురించిన కథనం సంచలనం సృష్టించింది. పీఎం-శ్రీ నిధులు వస్తున్నా, బాత్రూంలలో చుక్క నీరు లేక విద్యార్థినులు కన్నీళ్లతో ధర్నాకు దిగిన వైనాన్ని, మోటార్ రిపేర్ కోసం విద్యార్థుల నుంచే రూ. 10 వసూలు చేస్తున్న దారుణాన్ని 'జనం సాక్షి' ఎండగట్టింది.

### మంత్రి సీతక్క తక్షణ స్పందన

ఈ కథనంపై రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెంటనే స్పందించారు. బాధిత విద్యార్థినులతో ఫోన్లో మాట్లాడి, "మీకు నేను అండగా ఉంటాను, భయపడకండి" అని భరోసా ఇచ్చారు. 12 గంటల్లోగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

### అధికారుల కొరడా.. ప్రిన్సిపాల్ సస్పెండ్...!

'జనం సాక్షి' వార్తతో గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థల కార్యదర్శి సీతాలక్ష్మి తీవ్రంగా స్పందించారు. ఏప్రిల్ 2026 లోనే బాత్రూంల రిపేరింగ్ కోసం రూ. 7 లక్షల నిధులు విడుదల చేసినప్పటికీ నిధులు, విధులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు బాధ్యురాలిగా చేస్తూ గురుకుల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ తక్షణ ఉత్తర్వులు జారీ చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
19 జూలై 2026

# 40 చోరీ కేసుల్లోని నిందితులు అరెస్ట్

## 24 గంటల్లో ఇద్దరు మృతి





- ప్రేమ వివాదమా ? హత్యా ? ఆత్మహత్యా ? దర్యాప్తులో పోలీసులు

**కట్టంగూరు, జూలై 18 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం మునుకుంట్ల గ్రామంలో 24 గంటల వ్యవధిలో యువతి, యువకుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం జిల్లాలో సంచలనంగా మారింది. డాక్టర్ కావాలనే లక్ష్యంతో చదువుతున్న యువతి జీవితం అర్థాంతరంగా ముగియగా, మరుసటి రోజే యువకుడు కూడా మృతిచెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.గ్రామానికి చెందిన లక్ష్మీ ప్రసన్న (21), సూర్యాపేట మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతోంది. శుక్రవారం ఆమె ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతుండగానే, శనివారం ఉదయం అదే గ్రామానికి చెందిన చరణ్ (23) తాటి చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందిన ఘటన వెలుగులోకి వచ్చింది.లక్ష్మీ ప్రసన్నను చరణ్ ప్రేమ పేరుతో కొంతకాలంగా వేధిస్తున్నాడని, ఆ వేధింపుల కారణంగానే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా, యువతి మృతి చెందిన సమయంలో చరణ్ తమ ఇంటి ఎదుటే ఉన్నాడని,ఆమె మరణంపై తమకు తీవ్ర అనుమానాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. అతడే హత్య చేసి ఉరివేసి ఉండొచ్చు అనే ఆరోపణలు కూడా చేస్తున్నారు.మరోవైపు, లక్ష్మీ ప్రసన్న మృతికి తానే కారణమన్న భయంతోనే చరణ్ ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చనే ప్రచారం గ్రామంలో సాగుతోంది. అయితే ఈ ప్రచారాలను పోలీసులు ఇప్పటివరకు ధృవీకరించలేదు.ఒక కుటుంబంలో డాక్టర్ కావాలనే కలలు కన్న యువతి ప్రాణాలు కోల్పోవడం, వెంటనే మరో యువకుడు మృతి చెందడం గ్రామాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కన్నబిడ్డను కోల్పోయిన లక్ష్మీ ప్రసన్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అలాగే చరణ్ కుటుంబ సభ్యులు కూడా కన్నీరుమున్నీరు అవుతున్నారు.ఈ ఘటనలో హత్య జరిగిందా? లేక వరుస ఆత్మహత్యలా? అన్న అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదికలు, ఫోరెన్సిక్ ఆధారాలు, కాల్ డేటా తదితర అంశాలను పరిశీలిస్తూ ఘటన వెనుక అసలు నిజాన్ని వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు.మొత్తానికి మునుకుంట్ల గ్రామం మొత్తము వీరి మరణ వార్త తో మాత్రం విషాద ఛాయలు అలుముకున్నాయు అలాగే పెద్ద ఎత్తున పోలీసులు కూడా అక్కడికి చేరుకున్నారు.లక్ష్మీ ప్రసన్న మృతదేహాన్ని నల్లగొండ కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.చరణ్ మృత దేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన




**భద్రాచలం, జూలై 18 (జనంసాక్షి) :** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం భద్రాచలంలోని విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్పీడీసీఎల్ డీఈ, జేఏసీ జిల్లా కన్వీనరు జీవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. కార్మికులు ఉద్యోగులు ఉద్యోగుల సంఘాలన్నీ ఏకమైనప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరిస్తే ఉద్యోగులు మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, అంతా ఒక తాటి పైకి వచ్చి ఉద్యమించి న్యాయమైన హక్కులను పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ నరసింహారావు, ఏఏవో లక్ష్మి, ఏఈలు రోహిణి, జ్యోతి, ఉపేందర్, వెంకటేశ్వర్లు, విద్యుత్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

- కేకే కమిటీకి వినతిపత్రం



**బూర్గంపహాడ్, జూలై 18 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పొడియం నరేందర్ కుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన కే కే కమిటీ సమావేశంలో కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, రాములు నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమకారులందరికీ 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పెన్షన్, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రాజేందర్ నాయక్, కళాకారుల వేదిక రాష్ట్ర కార్యదర్శి నల్లమోతు సురేష్, ఉద్యమకారులు బొర్రా రాఘవులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రం

- రెడ్‌క్రాస్ ప్రతిపాదనకు అంగీకారం తెలిపిన కలెక్టర్




**భద్రాచలం, జూలై 18 (జనంసాక్షి) :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నందున, పాల్వంచలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ విషయమై శనివారం రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటరు అంకిత్‌ను రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటరు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు కలిసారు. పాల్వంచలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ భవన నిర్మాణానికి 10 సెంట్ల స్థలాన్ని కేటాయించడంతోపాటు, ఈ స్థలంలో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రంతో పాటు ఉచిత డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన ప్రాంతంలో వైద్య సదుపాయాలు విస్తృత పరిచేందుకు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పర్యవేక్షణలో పని చేస్తున్న రెడ్‌క్రాస్ ప్రజలకు మరింతగా సేవలందించేందుకు ముందుకు వెళ్తామని డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు తెలిపారు. జిల్లా కలెక్టరును కలిసిన వారిలో డాక్టర్ ఎస్.ఎల్ కాంతారావుతో పాటు వై. సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, వి.కామేశ్వర రావు, చావా లక్ష్మినారాయణ, చారుగుళ్ళ శ్రీనివాస్, డాక్టర్ భానుప్రసాద్ పాల్గొన్నారు.

## 40 చోరీ కేసుల్లోని నిందితులు అరెస్ట్

- తాళం వేసి ఉన్న ఇండ్లు టార్గెట్
- ఎస్పీ.శరత్ చంద్ర పవార్

**నల్లగొండ ప్రతినిధి, జూలై 18 (జనం సాక్షి) :** రెండు తెలుగు రాష్ట్రాల్లో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ అంతర్‌రాష్ట్ర నేరస్థుడు భూష్మి శ్రీకాంత్ అలియాస్ అమ్మిరాజు ఏర్పాటు చేసిన చోరీ ముఠాను నల్గొండ జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ ముఠాలోని ఆరుగురు సభ్యులను అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ వెల్లడించారు.పోలీసులు నిందితుల వద్ద నుంచి రూ.53 లక్షల విలువైన 260 గ్రాముల బంగారు ఆభరణాలు, 5 కిలోల వెండి ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు, రెండు టీవీలు, రెండు సౌండ్ బార్లు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.ఎస్పీ.శరత్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం, ఇటీవల అరెస్టైన భూష్మి శ్రీకాంత్‌ను విచారించగా అతని నేర సామ్రాజ్యానికి సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతడు ఇచ్చిన సమాచారంతో తెలంగాణలో 28, ఆంధ్రప్రదేశ్‌లో 12 కేసులు కలిపి మొత్తం 40 చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టి పిడుగురాళ్ల, అంజనీపురం, మండేపూడి ప్రాంతాల్లో నిందితులను అదుపులోకి తీసుకున్నారు.




### యువకులను మభ్యపెట్టి నేరాల వైపు మళ్లించిన శ్రీకాంత్

విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విజయవాడ, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నల్గొండ తదితర ప్రాంతాల్లో వైన్ షాపుల వద్ద పరిచయమైన యువకులను మద్యం, డబ్బుతో ఆకర్షించి, వారి వ్యక్తిగత సమస్యలను ఆసరాగా తీసుకుని నమ్మకం సంపాదించిన అనంతరం తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించే మార్గం చోరీలే అంటూ నేరాల వైపు మళ్లించినట్లు పోలీసులు తెలిపారు.అంతేకాకుండా తాళాలు పగులగొట్టడం, లక్ష్యంగా ఎంచుకోవాల్సిన ఇళ్లు, సీసీటీవీ కెమెరాలను తప్పించుకోవడం, పోలీసుల కదలికలను గమనించడం, చోరీ సొత్తును విక్రయించే విధానాలపై కూడా తన అనుచరులకు శిక్షణ ఇచ్చినట్లు విచారణలో తేలింది.

### 40 కేసుల్లో గ్యాంగ్ ప్రమేయం

ఈ ముఠా ప్రధానంగా రాత్రి వేళల్లో తాళాలు వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడేదని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు పోలీస్ స్టేషన్ పరిధుల్లో మొత్తం 40 ఆస్తి నేరాల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా 12 ఘటనల ప్రదేశాల్లో లభించిన వేలిముద్రలు నిందితుల వేలిముద్రలతో సరిపోలగా, సీసీటీవీ దృశ్యాల ఆధారంగా కూడా నిందితులను గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, ఎంత తెలివిగా నేరాలకు పాల్పడినా చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమర్థమైన దర్యాప్తు, ప్రజల సహకారంతో ప్రతి నేరస్థుడిని చట్టం ముందు నిలబెడతామని అన్నారు. యువత తప్పుడు ప్రలోభాలకు లోనై నేరాల వైపు వెళ్లకుండా జాగ్రత్తపడాలని సూచించారు.ఈ కేసును విజయవంతంగా ఛేదించిన సీసీఎస్, మిర్యాలగూడ రూరల్, నిడుమనూర్ పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రకటించారు.

## 2008 డీఎస్సీ టీచర్లను రెగ్యులర్ టీచర్లుగా గుర్తించాలి

- పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి




**నారాయణపేట, జూలై 18 (జనం సాక్షి) :** డీఎస్సీ 2008లో ఎంపికైన ఉపాధ్యాయులను రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తించాలని పై ఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నారాయణపేట మండలంలో పనిచేయుచున్న 2008 కాంట్రాక్టు ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముక్కుమ్మ డిగా పిఆర్టియుటీఎస్ లో సభ్యత్వం తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా వారికి సభ్యత్వాన్ని అందజేస్తూ 2008 డిఎస్ నియామకాల సమయంలో రాష్ట్ర ప్రభుత్వము హడావుడిగా 30శాతం ఎస్జీటీ పోస్టులను డీఎడ్ చేసిన వారికి ఇవ్వడం కారణంగా మెరిట్ లిస్టులో ఉండి అన్యాయంగా వారు ఉద్యోగాలను కోల్పోగా కోర్టు ద్వారా వారు తిరిగి విధులలోకి తీసుకున్నప్ప టికీ కొంతమంది అధికారు ల అత్యుత్సవం వల్ల వారిని కాంట్రాక్టు ఉపాధ్యాయు లుగా తీసుకొని కోర్టుకు ఉద్యోగాలు ఇచ్చామని చెప్పి వారికి తీవ్రమైన అన్యాయం చేయడం జరిగిందని జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టు ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వము వెంటనే వారిని రెగ్యులర్ ఉపాధ్యాయు లుగా గుర్తించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సంఘము ద్వారా వీరి సమస్యల పరిష్కారానికి తమ వంతుగా ప్రయత్నం చేస్తామని ఉపాధ్యాయుల కు వారు భరోసా ఇచ్చారు .2008 డీఎస్సీ ద్వారా ఉద్యోగంలో చేరినప్పటి నుండి నారాయణపేటలో పి ఆర్టియు సంఘం తమకు అండగా ఉండటం వల్ల వారందరూ పి ఆర్టియు సంఘంలోచేరుతున్నామని ఉపాధ్యాయులు పేర్కొన్నా రు ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏం రఘువీర్ ఎం జనార్ధన్ రాష్ట్ర స్టేట్ అధ్యక్షులు కే శ్రీనివాస్ మండల గౌరవ అధ్యక్షులు మహేష్ కుమార్ కళ్యాణి ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు శ్రీనివాస్, రఘునాథ్, రవికుమార్, రజిని బాలస్వామి, లక్పతి చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణలో భూములను కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించాలి



**హుజూర్‌నగర్, జూలై 18 (జనంసాక్షి) :** రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పట్టా భూములు కోల్పోతున్న రైతులకు తగిన పరిహారం చెల్లించాలని కోరుతూ శనివారం ఆర్ అండ్ బి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ హుజూర్ నగర్ పడిగ రాయి గుట్ట ఆర్చ్ వద్ద నుండి రామలక్ష్మి పురం గ్రామం వరకు ఆర్ అండ్ బి అధికారులు రైతులకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, పట్టా భూములను సేకరించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. తమ పూర్వీకుల నుండి వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నామని, హుజూర్ నగర్, రామలక్ష్మీ పురం గ్రామంలోని రెవెన్యూ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలో చట్టబద్ధమైన పట్టా భూములున్నాయని పేర్కొన్నారు. ఈ భూములే తమ కుటుంబాలకు ఏకైక జీవనాధారమని అన్నారు. తామంతా చిన్న, సన్నకారు రైతులమని, ఒక ఎకరం నుండి 5 ఎకరాల వరకు రోడ్ ను అనుకోని ఉన్న రైతులమన్నారు. ప్రస్తుతం హుజుర్ నగర్ పగిడి రాయి గుట్ట ఆర్చ్ దగ్గర నుంచి రామలక్ష్మీపురం గ్రామం వరకు జరుగుతున్న ప్రధాన రహదారి రోడ్డు వెడల్పు పనులు తమ పట్టా భూములలోకి వస్తున్నాయనీ, ఈ రోడ్డు విస్తరణ పనుల వల్ల గ్రామానికి చెందిన సుమారు 25 మందికి పైగా రైతులు తమ సొంత భూములను, జీవనోపాధిని కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు డబల్ రోడ్ పేరుతో తమ పట్టా భూములలోకి రోడ్ విస్తరణ చేస్తూ, ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన భూసేకరణ చట్టం ప్రకారం తమకు చట్టబద్ధమైన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మర్రి జితేందర్ రెడ్డి, జెట్టి తేజస్, దొంతి రెడ్డి శంబిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బండారు రవి, రాములు, భాగ్యమ్మ, కొప్పుల వెంకటరెడ్డి, చైతన్య పాల్గొన్నారు.

## తండాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి

- ఎమ్మెల్యే కుంభం
- 3 కోట్లతో యాపగాని తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కుంభం



**బీబీనగర్, జూలై 18 (జనంసాక్షి) :** భువనగిరి నియోజకవర్గంలోని గిరిజన తండాలకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామం నుండి యాపగాని తండా వరకు రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలతో పాటు తండాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. తండాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో నాణ్యమైన రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో ప్రజల మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం మరియు అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఉద్యోగాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు ప్రజలు సమాధానం చెబుతారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, మహిళా సంక్షేమ పథకాలు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి తండా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీబీనగర్ పీఏసీఎస్ చైర్మన్ పొట్టోళ్ల శ్యామ్ గౌడ్ , సర్పంచ్ చందు నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, మండల అధ్యక్షులు సురకంటి సత్తి రెడ్డి, నాయకులు గోలి నరేందర్ రెడ్డి, గడ్డం బాలకృష్ణ గౌడ్, సంధిగారి బసవయ్య, గడ్డం బాల్ రెడ్డి, గూడూరు మహిపాల్ రెడ్డి, గూడూరు నిఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మదార్‌గూడెం గ్రామంలో గ్రామకంఠం భూమి కబ్జా

- కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓకు వినతిపత్రం

**పి.ఏ.పల్లి, జూలై 18 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండలం మాదార్ గూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రాథమిక పాఠశాల దారి మరియు రామాలయం భూమిని కబ్జా చేసినటువంటి ఎనిమిదోవ వార్డు సభ్యుడు రాయనబోయిన లింగయ్య మరియు జానపాటి మల్లయ్య లపైన గ్రామస్తులు ఫిర్యాదు చేస్తూ,కబ్జా చేసిన వారిపైన తగు చర్యలు తీసుకోవాలని పి.ఏ. పల్లి మండల ఎంపిడిఓ కు వినతి పత్రం అందజేశారు.పిర్యాదు చేసిన వారిలో మాజీ వార్డు సభ్యుడు గుడిగుంట్ల శీను,గోనె విటల్ రావు,మెండే ఎల్లయ్య,జానపాటి లింగయ్య, రాయనబోయిన రవి,బుడిగపాక వెంకన్న,రాగం సైదయ్య మరియు తదితరులు పాల్గొని గ్రామకంఠానికి సంబంధించిన భూమిని కబ్జా చేసిన వారిపైన తగు చర్యలు తీసుకొని భూమిని కబ్జా నుండి విడిపించాలని వినతిపత్రం అందజేశారు.

## ఉప ముఖ్యమంత్రి భట్టితో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కలకు కోర్టు సమన్లు

**భద్రాచలం, జూలై 18 (జనంసాక్షి) :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు సందర్శన సందర్భంగా 2022లో కాంగ్రెస్ నాయకులపై నమోదైన కేసు విచారణ శనివారం భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయస్థానంలో జరిగింది. ఈ కేసును న్యాయమూర్తి శివ నాయక్ విచారించారు. కేసులో ముద్దాయిలుగా ఉన్న 22 మంది కాంగ్రెస్ నాయకుల్లో 12 మంది మాత్రమే కోర్టుకు హాజరయ్యారు. హాజరు కాని మిగిలిన వారికి ఈ నెల 24న జరిగే తదుపరి విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు వారికి సమన్లు కూడా జారీ చేసినట్లు సమాచారం. ఈ కేసులో ముద్దాయిలుగా ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దనసరి అనసూయ (సీతక్క) తదుపరి విచారణకు హాజరవుతారా లేదా అన్న అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ సీఎల్పీ ఆదేశాల మేరకు సీతారామ ప్రాజెక్టును సందర్శించేందుకు కాంగ్రెస్ నాయకులు బయలుదేరగా, మణుగూరు క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణ నేపథ్యంలో మొత్తం 22 మంది కాంగ్రెస్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో కాంగ్రెస్ నాయకుల తరఫున భద్రాచలం సీనియర్ న్యాయవాది కోట దేవదానం, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ అడ్వకేట్ కొడాలి శ్రీనివాస్ కోర్టులో వాదనలు వినిపిస్తున్నారు.

## ఓఆర్ఆర్ పై ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు



**అమీన్పూర్, జూలై 18 (జనం సాక్షి) :** ఔటర్ రింగ్ రోడ్డుపై శనివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడ అభివృద్ధి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుల్తాన్పూర్ ఔటర్ రింగ్ రోడ్డుపై చోటు చేసుకుంది. అమీన్పూర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం హెచ్ ఆర్ 70 హెచ్ 4568 గల ఫార్చునర్ వాహనంలో రాజస్థాన్ కు చెందిన కైలాష్ రామ్ (27) బొల్లారం వైపు నుంచి పటాన్చెరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి డివైడర్ను ఢీ కొట్టి బోల్తా పడింది. అదే సమయంలో పటాన్చెరు వైపు నుంచి టీజీ 08జి 9450 వాహనంలో నలుగురు వ్యక్తులు పటాన్చెరు వైపు నుంచి బొల్లారం వైపు వెళ్తున్నారు. ఈ వాహనాన్ని బోల్తా పడిన ఫార్చునర్ వాహనం ఢీ కొట్టింది. మరోవైపు నుంచి టీజీ 08జె ఆర్ 5762 టాటా నెక్సన్ వాహనం ఇద్దరు ప్రాణికులతో వేగంగా వచ్చి బోల్తా పడిన ఫార్చునర్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఫార్చునర్ వాహనాన్ని నడిపిస్తున్న రాజస్థాన్ కు చెందిన కైలాష్ రామ్ (27), టాటా నెక్సన్ వాహనంలో ఉన్న నాగోల్ కు చెందిన శివ నాగరాజు (43) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద విషయాలు తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు అమీన్పూర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




## పీఎన్‌బీ ట్రిపుల్ ధమాకా.. అదరగొట్టిన యాక్సిస్, కోటక్

**న్యూఢిల్లీ:**ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకులు యాక్సిస్, కోటక్ మహీంద్రా, ప్రభుత్వ రంగ బ్యాంక్ పంజాబ్ నేషనల్ బ్యాంకు ఈ ఏడాది తొలి త్రైమాసిక ఫలితాను ప్రకటించాయి. పీఎన్‌బీ మూడింతల నికర లాభాన్ని నమోదు చేయడం విశేషం. యాక్సిస్, కోటక్ బ్యాంక్‌ల ఫలితాలు కూడా సానుకూలంగా వచ్చాయి.ప్రభుత్వ రంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ తొలి త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది. ఏప్రిల్‌- జూన్ త్రైమాసికంలో నికర లాభం రూ.5,253 కోట్లుగా నమోదు చేసింది. గతేడాది నమోదైన రూ.1,675 కోట్లతో పోలిస్తే మూడింతలు పెరగడం గమనార్హం. మొత్తం ఆదాయం రూ.37,231 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం రూ.31,964 కోట్ల నుంచి రూ.32,897 కోట్లుగా నమోదైంది.ప్రముఖ ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ ఈ ఏడాది తొలి త్రైమాసికంలో (ఏప్రిల్‌-జూన్) రూ. 7,632.31 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. గతేడాది నమోదైన రూ. 6,243.72 కోట్లతో పోలిస్తే 22.23 శాతం అధికం. స్టాండలోన్ ప్రాతిపదికన చూస్తే 23 శాతం వృద్ధి చెంది రూ.7,114 కోట్లు నికర లాభాన్ని నమోదు చేసింది. నికర వడ్డీ ఆదాయం 8 శాతం పెరిగి రూ.14,646 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 3.80 నుంచి 3.46 శాతానికి పడిపోయింది. కార్పొరేట్ రుణాలు 38 శాతం, రిటైల్ లోన్స్ 8 శాతం మేర వృద్ధి చెందాయి. భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా గత త్రైమాసికంలో ఏర్పాటు చేసిన రూ. 2,001 కోట్ల అదనపు ఏకకాల నిధులను జూన్ త్రైమాసికంలో నిధుల ఉపసంహరణ లేకుండా కొనసాగిస్తున్నట్లు బ్యాంక్ తెలిపింది.

**కోటక్ మహీంద్రా..**

ప్రైవేట్ రంగ బ్యాంక్ కోటక్ మహీంద్రా తొలి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. జూన్ త్రైమాసికంలో రూ.5,480.46 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదేకాలంలో నమోదైన 4,472.18 కోట్లతో పోలిస్తే 22.55 శాతం అధికం. స్టాండలోన్ ప్రాతిపదికన చూస్తే నికర లాభం రూ.3,281.68 కోట్ల నుంచి రూ.4,122.96 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 9 శాతం పెరిగి రూ.7,928 కోట్లుగా నమోదు చేసింది. నికర వడ్డీ మార్జిన్ 4.65 నుంచి 4.53 శాతానికి పెరిగింది. బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 14 శాతం పెరిగి రూ. 5.59 లక్షల కోట్లు కాగా, ప్రస్తుత కరెంట్ డిపాజిట్లు 15 శాతం వృద్ధి చెంది రూ.78,107 కోట్లకు పెరిగాయి.




# సూచీల్లో జోష్

- బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లు
- ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.376.41 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు.. రూ.1017.89 కోట్లు

ఐటీ, బ్యాంకింగ్ దిగ్గజ కంపెనీలతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో శుక్రవారం సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు పెరిగి 96.30 వద్ద ముగియడమూ సానుకూల ప్రభావం చూపింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 3.84% పెరిగి 88 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ నష్టాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.38,000 కోట్లు పెరిగి రూ.480.92 లక్షల కోట్ల (4.99 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,370.77 పాయింట్ల వద్ద లాభాల్లో (క్రితం ముగింపు 77,186.87) ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ 78,282.55 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 964.58 పాయింట్ల లాభంతో 78,151.45 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 261.55 పాయింట్లు పెరిగి 24,334.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,099.05 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 24,367.30 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 582 పాయింట్లు, నిఫ్టీ 127 పాయింట్లు పెరిగాయి.సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 6 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. టెక్ మహీంద్రా 3.91%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 3.37%, టీసీఎస్ 3.02%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.59%, హిందుస్థాన్ యునిలీవర్ 2.17%, మహీంద్రా అండ్ మహీంద్రా 1.87%, యాక్సిస్ బ్యాంక్ 1.86% పెరిగాయి. సన్‌ఫార్మా 0.87%, భారతీ ఎయిర్‌టెల్ 0.68%,



ట్రెంట్ 0.62%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.46%, ఇండిగో 0.35% నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో బ్యాంకెక్స్, ఐటీ, ఆర్థిక సేవలు రాణించగా.. కమొడిటీస్, ఇండస్ట్రియల్స్, టెలికాం, లోహ సూచీలు డీలాపడ్డాయి.బీఎస్ఎన్ఎల్ 40 మీటర్ల టవర్లు, ఇతర పరికరాల సరఫరా కోసం వెరెమాక్స్ టెక్నాలజీ సర్వీసెస్ నుంచి రూ.10.44 కోట్ల విలువైన ఆర్డర్లు లభించినట్లు బొండాడ ఇంజినీరింగ్ తెలిపింది. ఈ ప్రాజెక్టును బొండాడ ఇంజినీరింగ్ అనుబంధ సంస్థ బొండాడ గ్రీన్ ఇంజినీరింగ్ 3 నెలల వ్యవధిలో పూర్తి చేయనుంది.

**ఆర్థిక ఫలితాల జోష్**

ఏప్రిల్‌- జూన్ త్రైమాసికంలో నికర లాభం రెట్టింపునకు పైగా పెరగడంతో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు బీఎస్ఈలో 3.12% పెరిగి రూ.243 వద్ద ముగిసింది.ఏప్రిల్‌- జూన్‌లో నికర లాభం 28.4% పెరగడమే కాకుండా... గిరాకీ పరిస్థితులపై సానుకూల అంచనా వ్యక్తం చేయడంతో టెక్ మహీంద్రా షేరు బీఎస్ఈలో 3.91% పెరిగి రూ.1,570.50 వద్ద స్థిరపడింది.రిలయన్స్‌లో వాటా పెంచుకున్న ప్రమోటర్లు ఏప్రిల్‌- జూన్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో ప్రమోటర్లు తమ వాటాను 0.5% పెంచుకున్నారు. దేశంలో అత్యంత విలువైన ఈ కంపెనీపై ప్రమోటర్లకు ఉన్న దీర్ఘకాల నమ్మకాన్ని, నిబద్ధతను ఇది సూచిస్తోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో ప్రమోటర్లు, ప్రమోటర్ల గ్రూపు వాటా మార్చి త్రైమాసికంలో సుమారు 50 శాతంగా ఉండగా.. జూన్ చివరకు 50.48 శాతానికి పెరిగింది. అదనంగా కొనుగోలు చేసిన 0.5% వాటా కోసం ప్రమోటర్లు రూ.8,500- 9000 కోట్లు వెచ్చించినట్లు మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు..

- నిపుణులు ఏమన్నారంటే?

**న్యూఢిల్లీ:**డిజిటల్ చెల్లింపులు మన దైనందిన ఆర్థిక జీవితంలో అంతర్భాగంగా మారిపోయా యి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) మంచి ఆదరణ పొందింది. డిజిటల్ రంగంలో భారత్‌ను అగ్రగామిగా నిలిపింది. అయితే, ప్రస్తుతం యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్‌విధిస్తే ఆ ప్రభావం ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. యూపీఐ లావాదేవీలు చేసే వ్యాపారులపై మర్చంట్ డిస్కౌంట్ రేటును ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొనడమే ఇందుకు నేపథ్యం. ఎండీఆర్ ఛార్జీలు 0.5 శాతం కంటే తక్కువగా ఉంటాయని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎండీఆర్ ఛార్జీలపై పరిశ్రమల నిపుణుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదనపు భారంతో పాటు కస్టమర్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా దీర్ఘకాలంలో యూపీఐ వినియోగం తగ్గే ప్రమాదముందని అంచనా వేస్తున్నారు. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు విధిస్తే వ్యాపార కార్యకలాపాల నిర్వహణకు వ్యాపారులు అదనపు భారం మోయాల్సి వస్తుందని నిపుణులు అంటున్నారు. దీంతో వారి లాభాలు దెబ్బతిని




పెట్టుబడులు తగ్గుతాయన్నారు. ఆ ప్రభావంతో వినియోగదారులకు అందే ఆఫర్లు తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండీఆర్ ఛార్జీల కారణంగా ప్రమోషన్ ఆఫర్లు తగ్గుతాయని, ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రభావం చిన్న వ్యాపారులపై కూడా పడుతుందన్నారు. ప్రస్తుతం టీ కొట్టు నుంచి కిరణా దుకాణం వరకు ఇప్పుడిప్పుడే డిజిటల్ లావాదేవీల వైపు మళ్లుతున్నారు. ఎండీఆర్ ఛార్జీల ప్రభావం చిన్న మొత్తంలో జరిపే లావాదేవీలపై కూడా పడుతుందన్నారు. దీంతో డిజిటల్ ట్రాన్సాక్షన్స్ తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఎక్కువగా డిజిటల్ లావాదేవీలే.. పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిపే కంపెనీలు అందించే బీమా, ఆరోగ్యం, ఇతర ఆర్థిక సేవలు యూపీఐపైనే ఎక్కువగా ఆధారపడ్డాయని గుర్తుచేశారు. వ్యాపార నిర్వహణ వ్యయాన్ని పెంచకుండా, కస్టమర్ల డిమాండ్‌ను బలహీనపరచకుండా, డిజిటల్ లావాదేవీలు దెబ్బతినకుండా, పేమెంట్ ఎకోసిస్టమ్‌లో పెట్టుబడులు కొనసాగించేలా ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచించారు.

## లోకేశ్ మెషీన్స్‌కు రూ.58 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్: చిన్న ఆయుధాలు, సీఎన్‌సీ మెషీన్ల తయారీ సంస్థ లోకేశ్ మెషీన్స్‌కు భారత సైన్యం నుంచి రూ.58.2 కోట్ల విలువైన ఆర్డరు లభించింది. సైన్యంలో వాడుకలో ఉన్న 7.6251 మిల్లీమీటర్ల మీడియం మెషీన్ గన్ల (ఎంఎంజీ) ఆధునికీకరణకు అవసరమైన అప్‌గ్రేడ్ కిట్ల సరఫరా కోసం ఈ కాంట్రాక్టు లభించింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) పరిధిలోని పుణె ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏఆర్‌డీఈ) భాగస్వామ్యంతో రూపొందించిన ఈ కిట్లు అమర్చడం వల్ల ఈ ఆయుధాల బరువు 25% తగ్గుతుంది. సింగిల్‌-షాట్, ఆటోమేటిక్ విధానంతో పాటు దేశీయ, నాటో ప్రమాణాల తూటాలకు అనుకూలంగా ఉండే ఈ ఎంఎంజీలు నిమిషానికి 800 రౌండ్ల చొప్పున 1,800 మీటర్ల పరిధిలోని శత్రు లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించగలవు. గతంలో దేశీయ సాంకేతికతతో విజయవంతమైన అస్మి సబ్‌మెషిన్ గన్ తరహాలోనే దీనినీ సంస్థ సొంతంగా అభివృద్ధి చేసింది. గతేడాది ఆగస్టులో రూ.18 కోట్ల తొలి ఆర్డర్ పొందిన సంస్థకు ప్రస్తుతం రెండో ఆర్డరు లభించింది. ఇప్పటికే అస్సాం రైఫిల్స్, సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ), సీఐఎస్ఎఫ్, ఏడబ్ల్యూఈఐఎల్ నుంచి మరో రూ.50 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయని తెలిపింది.

LOKESH MACHINES LIMITED

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,53,140 | ₹ 1,67,064 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,60,000

# అంచనాలను మించిన రిలయన్స్

- రికార్డు స్థాయి నికర లాభం
- ఆదాయంలో 25.4% వృద్ధి
- రాణించిన చమురు, టెలికాం వ్యాపారాలు




**న్యూఢిల్లీ:**"అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ 2026-27 ఆర్థిక సంవత్సరాన్ని స్థిరంగా మొదలుపెట్టాం. మా అన్ని వ్యాపారాలు బలమైన నిర్వహణ పనితీరును కనబరచాయి. జియో ఐపీఓ కంపెనీ ప్రయాణంలో ముఖ్యమైన మైలురాయి కానుంది. భారత డిజిటల్ వృద్ధిలో పాల్గొనేందుకు ఇది మదుపర్లకు ఒక అవకాశాన్నిస్తుంది. హరిత ఇంధన ప్రాజెక్టుల కార్యకలాపాలను కంపెనీ ప్రారంభించనుంది.దేశంలోనే అత్యంత విలువైన కంపెనీ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్), మార్కెట్ అంచనాలను మించి జూన్ త్రైమాసిక గణాంకాలను ప్రకటించింది. రికార్డు స్థాయి లాభం, ఎబిటా నమోదు చేసింది. చమురు నుంచి రసాయనాల వరకు (ఓ2సీ) ఉండే వ్యాపారాలు, టెలికాం విభాగం బలమైన పనితీరు కనబరచడం ఇందుకు నేపథ్యం. కంపెనీ ఏకీకృత ఆదాయం 25.4% వృద్ధితో రూ.3.12 లక్షల కోట్లకు చేరుకుంది. 2025-26 జూన్ త్రైమాసికంలో లిస్టెడ్ పెట్టుబడుల (ఏషియన్‌పెయింట్స్‌లో వాటా) విక్రయం వల్ల వచ్చిన రూ.8,924 కోట్ల వన్‌-టైం ప్రయోజనాల వల్ల లాభాన్ని మినహాయిస్తే.. ఎబిటా (వడ్డీ, పన్నులు, తరుగుదల, అమార్టైజేషన్‌కు ముందు ఆర్జన) 10.1% వృద్ధితో రూ.54,067 కోట్లకు చేరుతుంది. నికర లాభం 6.1% పెరిగి రూ.23,196 కోట్లకు చేరినట్లు అవుతుంది. ఆ ప్రయోజనాన్నీ లెక్కలోకి తీసుకుంటే ఎబిటా 6.8% తగ్గుతుంది. లాభం కూడా 22% క్షీణించి రూ.20,946 కోట్లకు పరిమితమవుతుంది. అమెరికా-ఇరాన్ యుద్ధం వల్ల ముడి చమురు ధరలు పెరగడంలో, కంపెనీకి చెందిన ఓ2సీ వ్యాపార ఎబిటా 17.2% పెరిగి రూ.17,010 కోట్లకు చేరుకుంది.

సమీక్షిస్తున్న త్రైమాసికంలో మూలధన వ్యయాలు రూ.38,682 కోట్లుగా ఉన్నాయి. నికర అప్పులు రూ.1,22,914 కోట్లుగా నమోదయ్యాయి. జియో ప్లాట్‌ఫామ్స్ తన వినియోగదార్ల సంఖ్యను పెంచుకుంటూనే ఉంది. ఫలితంగా నికరలాభం 9.2% వృద్ధితో రూ.7,764 కోట్లకు చేరింది. డిజిటల్, టెలికాం వ్యాపారాలున్న ఈ సంస్థ 2025-26 ఇదే కాలంలో రూ.7,110 కోట్ల లాభం పొందింది. ఎబిటా 15.1% వృద్ధితో రూ.20,865 కోట్లకు చేరుకుంది. కార్యకలాపాల ఆదాయం 11.8% పెరిగి రూ.39,173 కోట్లకు చేరుకుంది. ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయం (ఆర్పు) 3.3% వృద్ధితో రూ.215.6కు చేరుకుంది. జూన్ త్రైమాసికంలో మొత్తం డేటా రద్దీ 27% వృద్ధితో 69 ఎగ్జాబైట్లుగా నమోదైంది. వినియోగదార్ల సంఖ్య 49.8 కోట్ల నుంచి 7.1% పెరిగి 53.3 కోట్లకు చేరింది. మొబిలిటీ, హోమ్ బ్రాడ్‌బ్యాండ్, ఎంటర్‌ప్రైజ్ సేవలు బలంగా ఉండడంతో 15% ఆరోగ్యకర వృద్ధి నమోదైందని ఆర్‌ఐఎల్ సీఎండీ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. జియోహాట్‌స్టార్‌కు 53 కోట్ల నెలవారీ వినియోగదార్లున్నారు. ఇప్పటివరకు ఇదే అత్యధికం. ఇందులో 5జీ వినియోగదార్లు 28.5 కోట్లుగా ఉన్నారు.

జియోఎయిర్‌ఫైబర్ 1.4 కోట్ల వినియోగదార్లతో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది.ఐపీఎల్ 2026ను 120 కోట్ల మంది వీక్షించడంతో, అతిపెద్ద టీ20 ఈవెంట్‌గా మారింది.మైక్రోకంటెంట్ హబ్ తడ్కాను ఆవిష్కరించిన 2 నెలల్లోనే 10 కోట్ల మంది చందాదార్లు నమోదయ్యాయి.రిలయన్స్ రిటెయిల్ ఆదాయం రూ.90,408 కోట్లకుజూన్ త్రైమాసికంలో రిలయన్స్ రిటెయిల్ ఆదాయం 7.4% వృద్ధితో రూ.90,408 కోట్లకు చేరుకుంది. ఎబిటా 1.1% తగ్గి రూ.6309 కోట్లకు; లాభం 14.2% తగ్గి రూ.2806 కోట్లకు పరిమితమైంది. క్విక్‌కామర్స్ విభాగంపై వ్యయాలు చేయడంతో లాభంపై ప్రభావం కనిపించింది. రిలయన్స్‌కు చెందిన వినియోగదారు ప్యాకేజ్డ్ వస్తువుల విభాగం ఆర్‌సీపీఎల్ ఆదాయం రెట్టింపైంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కొత్తగా 252 స్టోర్లను జత చేసుకోవడంతో మొత్తం నెట్‌వర్క్ 20,169 అవుట్‌లెట్లకు చేరుకుంది. నమోదిత వినియోగదార్ల సంఖ్య 10.6% పెరిగి 39.6 కోట్లకు,. త్రైమాసిక లావాదేవీల సంఖ్య 46% వృద్ధితో 56.8 కోట్లకు చేరుకున్నాయి.జియోమార్ట్ సగటు రోజువారీ ఆర్డర్లు ఏడాది కిందటితో పోలిస్తే రెట్టింపయ్యాయి. (వెంకటేశ్వర్లు, శుక్ర 17.07.26)అల్యూమినియం క్యాన్‌లో కంపా: కోకకోలా, పెప్సికోతో పోటీ పడుతున్న కంపా అమ్మకాలు తొలి త్రైమాసికంలో రూ.2900 కోట్లకు చేరుకున్నాయి. ఆర్‌సీపీఎల్ విక్రయాల్లో ఇవి మూడో వంతు కావడం విశేషం. కంపాను ఈ నెలాఖరుకు అల్యూమినియం క్యాన్‌లో కంపెనీ తీసుకురానుంది. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ నికర లాభం 6.8% వృద్ధితో రూ.7167 కోట్లకు చేరుకుంది. కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 10.7% పెరిగి రూ.34,212 కోట్లుగా నమోదైంది.

## ఈ ఏడాదికి హెచ్‌-1బీ వీసా రెండో లాటరీ లేనట్లే!

**న్యూయార్క్(జనంసాక్షి):**హెచ్‌-1బీ వీసాలకు సంబంధించి అమెరికా పౌరసత్వం, వలస సేవల విభాగం కీలక అప్‌డేట్ ఇచ్చింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన 85వేల వీసా స్లాట్లకు తగినన్ని పిటిషన్లు వచ్చాయని ప్రకటించింది. లాటరీలో ఎంపికైన వారి పూర్తి స్థాయి పిటిషన్‌లను సమర్పించేందుకు ఆయా సంస్థలకు ఇచ్చిన (జూన్ 30, 2026 నాటికే) గడువు ముగిసిందని తెలిపింది. దీంతో ఈ ఏడాది రెండోసారి లాటరీ నిర్వహించే అవకాశం లేదని తెలుస్తోంది.అమెరికా కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను నియమించుకునేందుకు ఏటా 85 వేల హెచ్‌-1బీ వీసాలు జారీ చేస్తుంది. ఇందులో 65 వేల వీసాలు రెగ్యులర్, మాస్టర్ క్యాప్ కింద 20 వేల వీసాలను ఇస్తుంది. హెచ్‌-1బీ వీసాలకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ 2.11లక్షల రిజిస్ట్రేషన్లు వచ్చినట్లు యూఎస్‌సీఐఎస్ ఇటీవల వెల్లడించింది. గత ఏడాది 3.43లక్షల రిజిస్ట్రేషన్లు రాగా.. ఈసారి వాటి సంఖ్య 38.5శాతం తగ్గినట్లు పేర్కొంది. ఇక వీసాకు ఎంపికైన ఉద్యోగుల కాలపరిమితి అక్టోబర్ 1, 2026 నుంచి మొదలవుతుంది.హెచ్‌-1బీ వీసాలను లాటరీ విధానంలో ర్యాండమ్‌గా ఎంపిక చేస్తుండగా.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఈసారి కొన్ని మార్పులు చేసింది. అత్యధిక వేతనాలు, ఉన్నత నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులకు (లెవల్ 4) వీసా పొందే అవకాశాలు ఎక్కువగా ఉండేలా కొత్త విధానాన్ని రూపొందించారు. తక్కువ వేతనం లేదా ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు ఎంపిక ప్రక్రియలో తక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఎంపిక వివరాలను త్వరలో ప్రకటిస్తామని యూఎస్‌సీఐఎస్ వెల్లడించింది.

## యూట్యూబర్ రావణ్ రిమాండ్ పొడిగింపు

**గన్నవరం:** యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చలకూరి జోసెఫ్) రిమాండ్‌ను గన్నవరం కోర్టు మరో 14 రోజులపాటు పొడిగించింది. ప్రస్తుతం నెల్లూరు జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న జోసెఫ్ రిమాండ్ గడువు నేటితో ముగియడంతో.. అతడిని అధికారులు వర్చువల్‌గా జడ్జి ఎదుట హాజరుపరిచారు. పలువురు ప్రముఖులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతోపాటు, సోషల్ మీడియాలో వీడియోలు పోస్టు చేయడంతో అతడిని ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అతడి మొబైల్‌లో మావోయిస్టులను పొగుడుతూ చేసిన వీడియోలు ఉండటంతో దేశ ద్రోహం, 'ఉపా' చట్టం కింద కేసులు నమోదు చేశారు.

## మీ బాస్‌గా నటించి డబ్బులు కాజేస్తారు

### వాయిస్ క్లోనింగ్, డీప్‌ఫేక్ సాంకేతికత వాడి నమ్మిస్తారు

### నమోదిత సంస్థలకు సెబీ హెచ్చరిక

**న్యూఢిల్లీ:**మోసగాళ్లు వాయిస్ క్లోనింగ్, డీప్‌ఫేక్ లాంటి కృత్రిమ మేధ సాంకేతికతల సాయంతో.. కంపెనీల ఉన్నతాధికారులుగా నమ్మిస్తూ అకౌంట్స్ విభాగం నుంచి డబ్బులు బదిలీ చేయించుకుంటున్న ఘటనలు ఇటీవల పెరిగాయని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తెలిపింది. 'బాస్ స్కామ్'గా పిలుస్తున్న ఈ కొత్త తరహా సైబర్ నేరం విషయంలో అప్రమత్తంగా ఉండాలని తన పరిధిలోని సంస్థలు, నమోదిత సంస్థలను హెచ్చరించింది. ఇ-మెయిల్, వాట్సప్, మైక్రోసాఫ్ట్ టీమ్స్, ఇతర సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఈ మోసాలు జరుగుతున్నట్లు వివరించింది. కంపెనీ సీఈఓ/ఎండీగా పేర్కొంటూ కొందరు మోసాలు చేస్తున్నారని ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) హెచ్చరించిన నేపథ్యంలో, సెబీ ఈ సూచన చేసింది. కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల డీపీతో వాట్సప్ మెసేజ్ పంపడం, వాయిస్ క్లోనింగ్, డీప్ ఫేక్ కాల్స్ సాయంతో అకౌంట్ అధికారులకు కాల్ చేసి, 'నిర్దిష్ట బ్యాంకు ఖాతాలకు



తక్షణమే డబ్బులు బదిలీ చేయమ'ని కాల్స్ చేస్తున్నారని సెబీ తెలిపింది. హానికర సాఫ్ట్‌వేర్ ఉన్న కంప్రెస్డ్ జిప్ ఫైల్‌ను పంపించడం మరో పద్ధతి అని సెబీ తెలిపింది. విండోస్ పరికరంలో ఆ ఫైల్‌ను తెరిచిన వెంటనే.. యాక్టివ్‌గా ఉన్న వాట్సప్ వెబ్ సెషన్‌లను ఒక మాల్‌వేర్ హైజాక్ చేస్తుంది. దీనివల్ల బాధితుడి ఖాతాలోకి మోసగాళు ప్రవేశించి, ఫైనాన్స్ లేదా అకౌంట్స్ సిబ్బందికి చెల్లింపు సూచనలను పంపిస్తారు. కొన్ని సందర్భాల్లో సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసిన మొబైల్‌లోని కాంటాక్ట్ లిస్ట్‌ను మార్చి, నిధుల బదిలీ జరిగేలా ఉద్యోగులను మోసగించడానికి సీఈఓ లేదా మేనేజింగ్ డైరెక్టరు పేరుతో తమ సొంత నంబరును కూడా సేవ్ చేసుకునే అవకాశం ఉందని సెబీ హెచ్చరించింది.

ధ్రువీకరించుకోవడం తప్పనిసరి..

వాట్సప్, ఇ-మెయిల్ లేదా సామాజిక మాధ్యమాల ద్వారా అందిన అభ్యర్థనలను సంబంధిత అధికారికి నేరుగా ఫోన్ చేసి ధ్రువీకరించుకోవాలని నమోదిత సంస్థలకు సెబీ సూచించింది. మెసేజ్ పంపినవారి గుర్తింపును ధ్రువీకరించుకోకుండా, ఎగ్జిక్యూటబుల్ ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇన్‌స్టాల్ చేయకూడదని తెలిపింది. నిష్క్రియంగా ఉన్న వాట్సప్ వెబ్ సెషన్‌ల నుంచి లాగ్ అవుట్ అవ్వాలని సూచించింది. సైబర్ మోసాల సంఘటనలను జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేసి లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా వెంటనే నివేదించాలని తెలిపింది.

## మ్యూచువల్ ఫండ్ల బదిలీ సులువుగా

### నామినీలకు ఊరట కల్పించిన యాంఫీ

హైదరాబాద్: మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టినవారు మరణిస్తే, ఆయా యూనిట్లను నామినీలకు బదిలీ చేసే ప్రక్రియను భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) మరింత సులభతరం చేసింది. దరఖాస్తుల్లో చిరునామా, పేరు, సంతకాల్లో చిన్నపాటి తేడాలున్నా యూనిట్ల బదిలీని నిలిపివేయకుండా నిబంధనలను సడలించింది. సవరించిన మార్గదర్శకాలు తక్షణమే అమల్లోకి వచ్చాయని ప్రకటించింది. మరణించిన ఖాతాదారుల నామినీలకు క్లెయిం నిధులు లేదా యూనిట్లను వేగంగా అందించడమే లక్ష్యంగా ఈ చర్య తీసుకుంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం.. మరణించిన మదుపరి చిరునామాలో ఏవైనా తేడాలుంటే, సంబంధిత పత్రాల ఆధారంగా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న తాజా చిరునామాను పరిగణనలోకి తీసుకోవాలని అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు (ఏఎంసీ) సూచించింది. పేరు, సంతకం వ్యవహారాల్లో చిన్న, పెద్ద తేడాలను పరిష్కరించేందుకు ఒకే విధమైన విధానాన్ని తీసుకొచ్చారు. దీనికోసం రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లు (ఆర్‌టీఏ) అనుసరించే నిబంధనలను ఏఎంసీలు పాటించొచ్చు. చిన్నపాటి తేడాల వల్ల నామినీలు, చట్టబద్ధమైన వారసులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో యాంఫీ ఈ నిర్ణయం తీసుకుంది. పరిశ్రమ వ్యాప్తంగా ఈ విధానం ఒకేలా అమలు కావడానికి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. మదుపరుల ప్రయోజనాలను రక్షించడమే కాకుండా, కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు క్లెయిం ప్రక్రియను మరింత సులభతరం చేయడమే దీని ముఖ్య లక్ష్యమని పేర్కొంది. డీమ్యాట్ రూపంలో మ్యూచువల్ ఫండ్ల యూనిట్లున్న మదుపరుల కోసం మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. పెట్టుబడులను క్రమానుగతంగా వెనక్కి తీసుకోవడం (ఎస్‌డబ్ల్యూపీ), బదిలీ చేసుకోవడం (ఎస్‌టీపీ) సేవలను డీమ్యాట్



ఖాతాల్లోనూ పొందేందుకు అనుమతించింది. ప్రస్తుతం స్టేట్‌మెంట్ ఆఫ్ అకౌంట్ (ఎస్‌ఓఏ) రూపంలో ఏఎంసీలు, ఆర్‌టీఏ వద్ద ఉన్న యూనిట్లకే ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. డీమ్యాట్ ఖాతాల్లోని యూనిట్లకు ఈ సదుపాయం లేదు. కొత్త నిర్ణయంతో డీమ్యాట్ ఖాతాదారులకు ఈ కొరత తీరనుంది. తొలి దశలో భాగంగా పెట్టుబడిదారులు నిర్ణీత వ్యవధిలో నిర్దిష్ట సంఖ్యలో ఫండ్ యూనిట్లను విత్‌డ్రా చేసుకునేందుకు లేదా అదే మ్యూచువల్ ఫండ్‌లోని మరో పథకానికి బదిలీ చేసుకునేందుకు వీలవుతుంది. దీనినే యూనిట్ ఆధారిత ఎస్‌డబ్ల్యూపీ, ఎస్‌టీపీ అంటారు.రెండో దశలో అవసరమైన మొత్తాన్ని క్రమానుగతంగా వెనక్కి తీసుకోవడం/బదిలీ చేసుకునే అవకాశం లభిస్తుంది. తొలి దశను 2027 జనవరి 31 నాటికి అందుబాటులోకి తేవాలని సెబీ ఆదేశించింది. రెండో దశ సేవలను 2027 ఏప్రిల్ 30 నాటికి అమలు చేయాల్సి ఉంటుంది.

# పశ్చిమ కారిడార్ ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం దిశగా గ్రేడ్ సెపరేటర్లు

- ఐఐటీ, ఖాజాగూడ జంక్షన్ ప్రాజెక్టుల పురోగతిపై కమిషనర్ సమీక్ష
- ఐఐటీ ప్రాజెక్టు వ్యయం రూ.459 కోట్లు.. మే 2027 నాటికి పూర్తి లక్ష్యం
- ఖాజాగూడ గ్రేడ్ సెపరేటర్‌కు రూ.220 కోట్లు.. ఏప్రిల్ 2027లో పూర్తి
- నాణ్యత, భద్రతతో గడువులోపు పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు



**శేరిలింగంపల్లి, జూలై 18 (జనం సాక్షి):** హైదరాబాద్ పశ్చిమ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి వాహనాల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు చేపడుతున్న ఐఐటీ జంక్షన్, ఖాజాగూడ జంక్షన్ గ్రేడ్ సెపరేటర్ ప్రాజెక్టుల పురోగతిని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జి. సృజన శనివారం క్షేత్రస్థాయిలో సమీక్షించారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో పాటు భద్రతా నిబంధనలను పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలి, లింగంపల్లి, విప్రో జంక్షన్, కొండాపూర్ రహదారులను అనుసంధానించే కీలక కూడలైన ఐఐటీ జంక్షన్ వద్ద బహుస్థాయి గ్రేడ్ సెపరేటర్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. మొత్తం రూ.459 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా ఐఎస్‌బీ రోడ్ నుంచి డీఎల్ఎఫ్ వైపు రెండు దిశల్లో 720 మీటర్ల పొడవుతో నాలుగు లేన్ల మార్గం, డీఎల్ఎఫ్ నుంచి లింగంపల్లి వైపు 948 మీటర్ల మూడు లేన్ల ఫ్లైఓవర్, ఐఎస్‌బీ నుంచి గచ్చిబౌలి వైపు 1.20 కిలోమీటర్ల మూడు లేన్ల ఫ్లైఓవర్, గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు 520 మీటర్ల ఆరు లేన్ల ద్విమార్గ అండర్‌పాస్ నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టును 2027 మే నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని తెలిపారు.

ప్రస్తుతం నాలుగు కారిడార్లలో ఫౌండేషన్‌లు, పియర్‌లు, పియర్ క్యాప్‌లు, పీఎస్‌సీ గిర్డర్ల కాస్టింగ్ పనులు సమాంతరంగా కొనసాగుతున్నాయని కమిషనర్ పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయిన అనంతరం గచ్చిబౌలి, లింగంపల్లి, కొండాపూర్, విప్రో జంక్షన్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఔటర్ రింగ్ రోడ్ వైపు ట్రాఫిక్ రాకపోకలు మరింత వేగవంతం కానున్నాయని తెలిపారు. అనంతరం మెహదీపట్నం, షేక్‌పేట్, నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి ప్రాంతాల మధ్య ట్రాఫిక్‌ను మెరుగుపరిచే లక్ష్యంతో చేపడుతున్న ఖాజాగూడ జంక్షన్ గ్రేడ్ సెపరేటర్ ప్రాజెక్టును కూడా కమిషనర్ సమీక్షించారు. రూ.220 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో నానక్‌రామ్‌గూడ నుంచి షేక్‌పేట్ వైపు 1.085 కిలోమీటర్ల పొడవైన మూడు లేన్ల వన్‌వే ఫ్లైఓవర్, షేక్‌పేట్ నుంచి గచ్చిబౌలి వైపు 540 మీటర్ల మూడు లేన్ల వన్‌వే అండర్‌పాస్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టును 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఫౌండేషన్, పియర్, పియర్ క్యాప్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని కమిషనర్ డాక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. ఈ రెండు గ్రేడ్ సెపరేటర్ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత హైదరాబాద్ పశ్చిమ కారిడార్‌లోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి వాహనదారులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

# బొగ్గు నాణ్యతపై రాజీ లేదు

- ఉత్పత్తి నుంచి డిస్పాచ్ వరకు నాణ్యత నియంత్రణకు సీఎండీ ఆదేశాలు
- ఏరియాల వారీగా స్పెషల్ అధికారుల నియామకం.. మూడు నెలల ప్రత్యేక కార్యాచరణ
- కార్పొరేట్-ఏరియాల సమన్వయం, సీఎస్ఆర్ అమలుపైనా పర్యవేక్షణ




**గోదావరిఖని, జూలై 18 (జనం సాక్షి):** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తిని పెంచడంతో పాటు ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా నాణ్యమైన బొగ్గును నిరంతరాయంగా సరఫరా చేయడానికి సింగరేణి సంస్థ ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఈ మేరకు ఏరియాల వారీగా ప్రత్యేక అధికారులను (స్పెషల్ ఆఫీసర్లు) నియమిస్తూ సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాలు జారీ చేశారు. రానున్న మూడు నెలలపాటు ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి, నాణ్యత పరిరక్షణ, గ్రేడ్ నిర్వహణ, డిస్పాచ్, ఉత్పాదకత పెంపు, పనితీరు మెరుగుదల, కార్పొరేట్-ఏరియాల మధ్య సమన్వయం, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల అమలును నిశితంగా పర్యవేక్షించను న్నారు. డైరెక్టర్ (ఆపరేషన్స్)కు సత్తుపల్లి, ఇల్లందు ఏరియాలు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్)కు మణుగూరు, భూపాలపల్లి, డైరెక్టర్ (ఫైనాన్స్)కు బెల్లంపల్లి, మందమర్రి, డైరెక్టర్ (ఈ అండ్ ఎం)కు ఆర్జీ-1, ఆర్జీ-3, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్)కు ఆర్జీ-2, నైనీ, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్)కు శ్రీరాంపూర్, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలను ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు అప్పగించారు. శనివారం సాయంత్రం సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, గ్రేడ్ పరిరక్షణ, డిస్పాచ్ అంశాలపై సీఎండీ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ, సింగరేణి బొగ్గు నాణ్యతే సంస్థకు గుర్తింపని, దానిపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టం చేశారు. వినియోగదారులకు ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా నాణ్యమైన బొగ్గు సరఫరా జరిగేలా అన్ని ఏరియాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొన్ని ఏరియాల్లో అన్‌గ్రేడెడ్ బొగ్గు, షేల్ కలవడం వల్ల నాణ్యత దెబ్బతింటోందని అధికారులు దృష్టికి తీసుకురాగా, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎండీ సూచించారు. వార్షిక కోల్ గ్రేడేషన్ ప్రణాళిక ప్రకారం సీమ్‌ల వారీగా తవ్వకాలు నిర్వహించి, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగానే ఉత్పత్తి చేపట్టాలని ఆదేశించారు. ఆఫ్‌లోడింగ్ ప్రాంతాల్లో బ్లాస్టింగ్‌కు ముందు బొగ్గు బెంచీలను పూర్తిగా శుభ్రం చేయాలని, బొగ్గు బెంచీలు, ఓవర్‌బర్డెన్ బెంచీల మధ్య తగినంత దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయి, షేల్ పొరలను బొగ్గుతో కలపకుండా ప్రత్యేకంగా తవ్వి ఓవర్‌బర్డెన్‌లోనే డంప్ చేయాలని, బొగ్గు గ్యాలరీల శుభ్రత, ఫైరీ కోల్ నిర్వహణకు రూపొందించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీలు)ను అన్ని ఏరియాల్లో తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. అన్ని ఓపెన్‌కాస్ట్ గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లలో తగిన సంఖ్యలో క్రషర్లు ఏర్పాటు చేసి, అవి నిరంతరం సమర్థవంతంగా పనిచేసేలా నిర్వహించాలని సూచించారు. ప్రతి కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో రోజువారీ గ్రేడ్‌వారీ బొగ్గు డిస్పాచ్ ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసి కచ్చితంగా అమలు చేయాలని, ఉత్పత్తి నుంచి డిస్పాచ్ వరకు ప్రతి దశలో నాణ్యత నియంత్రణకు అధికారులు వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. సింగరేణి బొగ్గు నాణ్యతపై వినియోగదారుల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం ప్రతి అధికారి బాధ్యత అని, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా నాణ్యమైన బొగ్గు సరఫరా చేయడం ద్వారా సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచాలని సీఎండీ పిలుపునిచ్చారు. సమీక్షా సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), ఎం. తిరుమలరావు (ఈ అండ్ ఎం), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

**అదనపు జిల్లా న్యాయ మూర్తి కోట్ల లావణ్య బాల్ రెడ్డి..**

**గోదావరిఖని, జనంసాక్షి :** లోక్ అదాలత్ సత్వర సత్వర న్యాయం సాధ్యపడుతుందని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయ మూర్తి కోట్ల లావణ్య బాల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని అదనపు జిల్లా, 2వ అదనపు మున్సిఫ్ కోర్టులలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యం లో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో వారు మాట్లాడారు. లోక్ అదాలత్ లలో రాజీ పడ్డ కేసులలో ఒకరు గెలిచి మరొకరు ఓడినట్టు కాదన్నారు. లోక్ అదాలత్ లలో రాజీ కుదుర్చుకుంటే ఎలాంటి అప్పీళ్లకు అవకాశం లేదని అన్నారు. అనంతరం ఆయా కోర్టులలో వివిధ కేసులలో న్యాయమూర్తులు రాజీ కుదుర్చారు., ఇక్కడ 2 వా అదనపు న్యాయమూర్తి శ్రీనిజ కోహిర్కర్, లోక్ అదాలత్ సభ్యులు నడిపల్లి కిషన్ రావు, ఎం డి ఉమర్ , బార్ అసోసియేషన్ ప్రతినిధులు అమరేందర్ రావు, కుడిది వెంకటేష్, గుజ్జేటి సత్యనారాయణ, ముచ్చకుర్తి కుమార్, గజ్జెల ప్రసన్న, ఆసంపల్లి రవీంద్ర, గూడెపు వెంకటేష్ తదితరులు ఉన్నారు.



## క్యూర్ బిల్లులో సవరణలు చేయాలి : ది సిటిజన్స్ కౌన్సిల్

**రాజేంద్రనగర్, జూలై18(జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన క్యూర్ బిల్లుపై సీతారాం దూళిపాల ఆధ్వర్యంలో నిర్వహించిన ది సిటిజన్స్ కౌన్సిల్ ముఖ్య సమావేశంలో సభ్యులు విస్తృతంగా చర్చించి పలు అభ్యంతరాలు, సూచనలను ఏకగ్రీవంగా ఆమోదించారు. బిల్లులో అధికారాలను రాష్ట్ర స్థాయిలో కేంద్రీకరించడం వల్ల పట్టణ స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందని, ఇది 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

కార్పొరేషన్, మేయర్, స్టాండింగ్ కమిటీ, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ల ఆర్థిక అధికారాలపై స్పష్టత తీసుకురావాలని, ఎన్నికైన ప్రజాప్రతినిధులకు విధాన రూపకల్పన, అమలు, పర్యవేక్షణలో తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. వార్డు కమిటీలను బలోపేతం చేయడంతో పాటు పౌరసమాజ సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు కూడా ప్రాతినిధ్యం ఇవ్వాలని సూచించారు. ఆస్తి పన్ను అసమానతలు, క్యాపిటల్ వ్యాల్యూ ఆధారిత పన్ను విధానం, నీటి సరఫరా, మురుగునీటి ఛార్జీల వార్షిక పెంపు వంటి అంశాలపై పునఃసమీక్ష అవసరమని అభిప్రాయపడ్డారు. అన్ని పట్టణ సేవల సంస్థలు కార్పొరేషన్‌కు జవాబుదారీగా ఉండేలా, ఎన్నికైన ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో పనిచేసే విధంగా చట్టంలో నిబంధనలు చేర్చాలని కోరారు. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ, పారదర్శకత, జవాబుదారీతనం, స్థానిక స్వపరిపాలన బలోపేతానికి అనుగుణంగా క్యూర్ బిల్లులో సవరణలు చేయాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. ఈ సమావేశంలో ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్ మహమ్మద్, రామసుబ్బారెడ్డి, విద్యాసాగర్, దిలీప్ కక్కడ, బదరీనాథ్, గోపాలకృష్ణ, రామచంద్రరావు, అను కపూర్, శ్రీధర్ రెడ్డి, నరేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## ఉచితంగా ఫైబ్రోస్కాన్ కాలేయ పరీక్షలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 18 (జనంసాక్షి) :** పేద ప్రజలకు ఖరీదైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ, మాతృశ్రీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఉచిత ఫైబ్రోస్కాన్ (కాలేయ) పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్, లయన్ నూగూరి వంశీకృష్ణలు మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ ఉచిత ఫైబ్రోస్కాన్ కాలేయ పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలేయ వ్యాధుల నిర్ధారణకు ఎంతో కీలకమైన, ఖరీదైన ఫైబ్రో స్కాన్ పరీక్షలను పట్టణ పరిసర ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 150 మంది రోగులకు ఇక్కడ ఉచితంగా నిర్వహించమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ యూత్ క్లబ్ అధ్యక్షులు బచ్చు వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమ్మ నటరాజ్, కోశాధికారి జనపాల వినయ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# పరిచయం ప్రేమగా.. అసూయ హత్యగా..

- శాస్త్రీయ దర్యాప్తుతో మహిళ హత్య కేసు నిందితుడి అరెస్ట్
- సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో మిస్టరీ వీడించిన కామారెడ్డి టౌన్ పోలీసులు
- ఎస్పీ రాజేష్ చంద్ర ప్రత్యేక చొరవ.. పోలీసు బృందాన్ని అభినందించిన అధికారులు

**కామారెడ్డి ప్రతినిధి, (జనంసాక్షి) :** కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును పోలీసులు శాస్త్రీయ దర్యాప్తుతో ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ మధుసూద న్ పర్యవేక్షణలో సీఐ బి. నరహరి నేతృత్వంలోని రెండు ప్రత్యేక బృందాలు సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిరంతర గాలింపు ద్వారా కేసును ఛేదించాయి. పోతారం గ్రామానికి చెందిన శ్యామల అదృశ్యంపై నమోదైన కేసు దర్యాప్తులో, జూన్ 3న గ్రీన్‌సిటీ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఆమె మృతదేహం లభించడంతో కేసును హత్యగా నమోదు చేశారు. విచారణలో శిరాన్‌పల్లికి చెందిన పిట్ల నర్సింలు అలియాస్ మామిడి రాజన్నను అదుపులోకి తీసుకోగా, శ్యామలతో పరిచయం, అసూయ కారణంగా మద్యం మత్తులో రాయితో తలపై దాడి చేసి హత్య చేసినట్లు అంగీకరించాడు. మృతురాలి మొబైల్‌ను రూ.200లకు విక్రయించినట్లు కూడా వెల్లడించాడు. నిందితుడిపై గతంలో నిజామాబాద్, బాసర పోలీస్ స్టేషన్లలో దోపిడీ, హత్య కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ నరహరి, ఏఎస్ఐ రంగారావు, కానిస్టేబుళ్లు కమలాకర్, రామస్వామి, సంపత్, రాజులను ఎస్పీ అభినందించారు. కొత్తగా పరిచయమైన వ్యక్తులతో నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లవద్దని, అనుమానాస్పద సమాచారం వెంటనే డయల్-112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని జిల్లా పోలీసులు ప్రజలకు సూచించారు.

# కన్నబిడ్డను కడతేర్చిన కసాయి తండ్రి

- నేలకేసి కొట్టడంతో 18 రోజుల పసికందు మృతి
- జోగిపేట భరత్‌నగర్ కాలనీలో సంఘటన



**జోగిపేట, జూలై 18 (జనం సాక్షి):** అభం శుభం ఎరగని 18 రోజుల పసికందును నేలకేసి కొట్టి కసాయి తండ్రి కడదేర్చిన సంఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలోని భరత్ నగర్ కాలనీలో శనివారం చోటు చసుకుంది. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం భరత్న గర్ కాలనీకి చెందిన కృష్ణ, గౌరమ్మ దంపతుల మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. శనివారం భార్య వంట చేయలేదన్న ఆగ్రహంతో కృష్ణ ఉయ్యాలలో నిద్రిస్తున్న 18 రోజుల పసికందును ఎత్తుకుని నేలకేసి కొట్టినట్లు భార్య ఆరోపించారు. తీవ్రంగా గాయపడిన శిశువును తల్లి గౌరమ్మ వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చింది. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు శిశువు మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జోగిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది.

# భూ కబ్జాదారుల నుంచి మా ప్లాట్లను కాపాడండి

**పటాన్‌చెరు, జూలై 18 (జనం సాక్షి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని ముత్తంగి డివిజన్ జీపీఆర్ఎస్ వెంచర్‌లో తాము చట్టబద్ధంగా కొనుగోలు చేసిన ప్లాట్లను భూ కబ్జాదారుల నుంచి కాపాడాలని ప్లాట్ల యజమానులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. బాధితుల కథనం ప్రకారం.. సర్వే నంబర్ 202లోని జీపీఆర్ఎస్ వెంచర్‌లో 1999 సంవత్సరంలో జీపీఆర్ఎస్ యాజమాన్యం నుంచి ఒక్కోటి 500 గజాల చొప్పున సుమారు 15 ప్లాట్లను కొనుగోలు చేశామని తెలిపారు. గత 27 ఏళ్లుగా ప్లాట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో పాటు ప్రహరీ గోడలు నిర్మించుకున్నామని, గ్రామపంచాయతీ కాలం నుంచి ప్రస్తుతం మున్సిపాలిటీ వరకు పన్నులు చెల్లిస్తున్నామని చెప్పారు. అలాగే ప్లాట్లకు సంబంధించిన ఎల్ఆర్ఎస్ రుసుమును కూడా ప్రభుత్వానికి చెల్లించినట్లు వివరించారు.



ఇటీవలి సంవత్సరాల్లో ఆ ప్రాంతంలో భూముల విలువ పెరగడంతో కొందరు వ్యక్తులు అక్రమంగా ప్లాట్లను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 1996లో జీపీఆర్ఎస్ యాజమాన్యానికి భూములు విక్రయించిన రైతుల వారసుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా భూములు కొనుగోలు చేసినట్లు చెబుతూ తమపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా జరిగిన పాత లావాదేవీలకు విరుద్ధంగా డబుల్ రిజిస్ట్రేషన్లు జరిగాయని కూడా ఆరోపించారు. 2021లో ప్లాట్లను ఆక్రమించేందుకు ప్రయత్నించగా అప్పట్లో పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించామని తెలిపారు. ఇటీవల మరోసారి కొందరు వ్యక్తులు ప్రహరీ గోడలను కూల్చివేసి, అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారని ఆరోపించారు. ఈ ఘటనపై కూడా సంబంధిత వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

రెండుసార్లు కేసులు నమోదైనా తమను వేధింపులకు గురిచేస్తూ సెటిల్‌మెంట్ పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవితాంతం కష్టపడి కూడబెట్టిన సొమ్ముతో పిల్లల భవిష్యత్తు, పెళ్లిళ్లు వంటి అవసరాల కోసం ప్లాట్లు కొనుగోలు చేశామని, ఇప్పుడు వాటిపైనే కన్నేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు, స్థానిక పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని చట్టబద్ధంగా కొనుగోలు చేసిన తమ ప్లాట్లకు రక్షణ కల్పించాలని, అక్రమ కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ప్లాట్ల యజమానులు నరసింహారెడ్డి, షేక్ ఖలీల్, లింగమయ్య గౌడ్, విజయ్ కుమార్, శశికుమార్, ఇంద్రసేనారెడ్డి, జగన్మోహన్, అమర్‌నాథ్ రెడ్డి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎండిసి డైరెక్టర్ (కమర్షియల్)గా వివేక్ నిశాంత్ నాథ్



**హైదరాబాద్, జూలై 18 (జనంసాక్షి) :**
భారతదేశపు అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పత్తిదారు అయిన ఎన్ఎండిసి లిమిటెడ్ డైరెక్టర్ (కమర్షియల్)గా వివేక్ నిశాంత్ నాథ్ బాధ్యతలు స్వీకరించారు. లోహ, మైనింగ్ రంగంలో మూడు దశాబ్దాలకుపైగా అనుభవం ఉన్న వివేక్ నిశాంత్ నాథ్, అమ్మకాలు, మార్కెటింగ్, అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాలు, సేకరణ, లాజిస్టిక్స్, సరఫరా గొలుసు నిర్వహణలో విస్తృతమైన అనుభవాన్ని కలిగి ఉన్నారు. 1992లో ఎన్ఎండిసిలో తన వృత్తి జీవితాన్ని ప్రారంభించి, దేశీయ ఇనుప ఖనిజ అమ్మకాలు, మార్కెటింగ్‌లో విస్తృతమైన అనుభవాన్ని పొందుతూ, దాదాపు పదిహేను సంవత్సరాల పాటు కంపెనీలో వివిధ వాణిజ్య హోదాలలో పనిచేశారు. ఆయన తదనంతరం ఎస్సార్ స్టీల్ లిమిటెడ్, ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియాలో కీలక పదవులను నిర్వహించి, 2021లో ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎంసీ)లో జనరల్ మేనేజర్ (సేల్స్, మార్కెటింగ్)గా చేరారు. ఆ తర్వాత 2024లో ఓఎంసీలో చీఫ్ జనరల్ మేనేజర్ (సేల్స్, మార్కెటింగ్)గా పదోన్నతి పొందారు. అక్కడ ఆయన ఇనుప ఖనిజం, క్రోమ్ ఖనిజం, మాంగనీస్ ఖనిజం, బాక్సైట్, సున్నపురాయి, ఫెర్రోక్రోమ్ అమ్మకాలు, మార్కెటింగ్ విభాగాలకు నాయకత్వం వహించారు. ఓఎంసీలో ఆయన పదవీకాలంలో, కంపెనీ ఇనుప ఖనిజం అమ్మకాలు, రాబడిలో గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. వాణిజ్య కార్యకలాపాలను మెరుగుపరచడానికి వినియోగదారుల-కేంద్రీకృత కార్యక్రమాలు, పారదర్శక ధరల విధానాలు, డిజిటల్ వ్యవస్థలు, లాజిస్టిక్స్ సంస్కరణలను ప్రవేశపెట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలో, ఓఎంసీ ఇనుప ఖనిజం అమ్మకాలు ఎఫ్ వై21లో 12.33 మిలియన్ టన్నుల నుండి ఎఫ్ వై26లో 38.26 మిలియన్ టన్నులకు పెరిగాయి. పరిశ్రమకు సంబంధించిన అంశాలపై 11కుపైగా పరిశోధనా పత్రాలను రచించిన ఆయన పాండిత్యపరమైన కృషి ద్వారా ఈ రంగానికి ఆయనకున్న అచంచలమైన అంకితభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పూణేలోని సింబయాసిస్ సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ స్టడీస్ నుండి అంతర్జాతీయ వ్యాపారంలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబిఏ) పట్టా పొందారు. ఆయన ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) నుండి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్‌లో మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను కూడా పూర్తిచేశారు. ఎన్ఎండిసి, ప్రముఖ ప్రైవేట్ ఉక్కు కంపెనీలు, ఒడిశా మైనింగ్ కార్పొరేషన్‌లలో ఆయనకున్న అనుభవం, ఎన్ఎండిసి వాణిజ్య కార్యకలాపాలను బలోపేతం చేయడానికి, వినియోగదారులతో సంబంధాలను మెరుగుపరచడానికి, 100 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం తవ్వకం కంపెనీగా మారాలనే సంస్థ దార్శనికతకు మద్దతు ఇవ్వడానికి ఎంతగానో దోహదపడుతుంది.



# ఒంటరిగా ఉన్న బాలికపై లైంగికదాడి

**పోక్సో కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్**

హాలియా, జూలై 18 (జనంసాక్షి) : కుప్పసపల్లి గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారం, బెదిరింపులు, పోక్సో చట్టం కింద నమోదైన కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు హాలియా ఎస్ఐ బి. సాయి ప్రశాంత్ తెలిపారు. ఈ కేసులో ఆదిముల్ల అజయ్ (25), బండారు అఖిల్ (19), పెర్ల రమణ అలియాస్ రమణమ్మను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఏ1 ఆదిముల్ల అజయ్ గ్రామ శివారులో ఒంటరిగా ఉన్న సమయంలో బాధిత మైనర్ బాలికపై రెండుసార్లు అత్యాచారానికి పాల్పడి, ఆమెను బెదిరించినట్లు తేలింది. అలాగే ఏ2 బండారు అఖిల్, ఏ3 రమణమ్మ సహకారంతో బాధితురాలిని తన ఇంటికి పిలిపించుకుని లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. రమణమ్మ బాధితురాలిని అఖిల్‌కు పరిచయం చేసి, తన ఇంట్లో నేరం జరిగేందుకు సహకరించినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ కేసును హాలియా ఎస్ఐ బి. సాయి ప్రశాంత్, హాలియా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో, నాగార్జునసాగర్ ఉపవిభాగ పోలీసు అధికారి బి. శ్రీను నాయక్ మార్గదర్శకత్వంలో దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# నిర్లక్ష్యానికి భారీ మూల్యం.. ఐదుగురు టీచర్లు సస్పెండ్

**విద్యార్థులను ఇతర పాఠశాలలకు ప్రోత్సహించడం, క్రమశిక్షణ లోపాలు, పరిపాలన వైఫల్యాలపై విద్యాశాఖ కఠిన చర్య**



**తుంగతుర్తి, జులై 18 (జనంసాక్షి):** మండల పరిధిలోని బండ రామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకున్న పరిపాలన లోపాలు, ఉపాధ్యాయుల మధ్య వివాదాలను తీవ్రంగా పరిగణించిన జిల్లా విద్యాశాఖ బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి శనివారం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడితో పాటు మరో నలుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించి పాఠశాల మూసివేతకు కారణమైన బండ రామారం జిల్లా పరిషత్ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎంఏ హకీమ్‌ను ఈ నెల 16న సస్పెండ్ చేయగా, శనివారం ఉపాధ్యాయులు పి. కోటయ్య, కే. సుజాత, జి. గీత, జై శ్రీనివాస్ నాయుడులను కూడా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో 13 మంది విద్యార్థులు ఉండగా, ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే వారికి టీసీలు జారీ చేయడంతో పాఠశాల విద్యార్థులు లేక మూతపడింది. ఈ ఘటనపై ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులను విచారించారు. విచారణలో ఉపాధ్యాయుల మధ్య మనస్పర్థలు, క్రమశిక్షణ లోపం, ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు లేవంటూ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాలకు వెళ్లాలని ప్రోత్సహించడం, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం, పాఠశాల రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వంటి అంశాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కారణాలన్నింటినీ తీవ్రంగా పరిగణించిన జిల్లా విద్యాశాఖ సంబంధిత ఐదుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

### ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ-పీజీ కళాశాలలో

# యూపీఎస్సీ-ఐఏఎస్ అవగాహన సదస్సు

- ముఖ్య అతిథిగా అమిగోస్ అకాడమిక్ డైరెక్టర్ మధుసూదన్
- విశిష్ట అతిథిగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జి.హెచ్.పి. రాజు
- విద్యార్థినులకు సివిల్ సర్వీసెస్ లక్ష్యాలు సాధించే మార్గం చూపించారు
- ప్రతిభ ఉన్న విద్యార్థులను గుర్తించి శిక్షణ ఇస్తామని చైర్మన్



కరీంనగర్, జూలై 18: కరీంనగర్‌లో ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ–పీజీ కళాశాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అమిగోస్ ఐఏఎస్ అకాడమీ సహకారంతో విద్యార్థినులకు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–ఐఏఎస్, ఐపీఎస్ తదితర అఖిల భారత సర్వీసులపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా కళాశాల చైర్మన్ వి. రవీందర్ రెడ్డి వ్యవహరించారు. ముఖ్య అతిథిగా అమిగోస్ అకాడమిక్ డైరెక్టర్ మధుసూదన్, విశిష్ట అతిథిగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జి.హెచ్.పి. రాజు, అతిథిగా అమిగోస్ అకాడమీ ట్రైనర్ వినీల్ రెడ్డి విచ్చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ అందిస్తే వారు అత్యున్నత స్థాయికి చేరుకోగలరని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు, క్యాట్, మ్యాట్, జిమ్యాట్ వంటి వివిధ రకాల పోటీ పరీక్షల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలతో పాటు ఈ సంవత్సరం నుండి యూపీఎస్సీ కోచింగ్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను గుర్తించి, వారికి అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ అందిస్తూ పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా తీర్చిదిద్దడమే ఆల్ఫోర్స్ లక్ష్యమని పేర్కొన్నారు.

మధుసూదన్ మాట్లాడుతూ "వైఫల్యాలే విజయానికి మెట్లు" అని, ప్రతి అపజయం నుంచి పాఠాలు నేర్చుకొని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. సివిల్ సర్వీసెస్ వంటి అత్యున్నత లక్ష్యాలను సాధించాలనుకునే విద్యార్థులు డిగ్రీ స్థాయి నుంచే బలమైన ఫౌండేషన్ ఏర్పరచుకొని, ప్రణాళికాబద్ధంగా సిద్ధమైతే విజయం సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అమిగోస్ ఐఏఎస్ చీఫ్ అడ్వైజర్, 1993 బ్యాచ్ అస్సాం–మేఘాలయ కేడర్‌కు చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జి.హెచ్.పి. రాజు విద్యార్థినులకు సివిల్ సర్వీసెస్ పరీక్షా విధానం, సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, కరెంట్ అఫైర్స్, నెగటివ్ మార్కింగ్ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పంచభూతాలైన నీరు, అగ్ని, గాలి, నేల, ఆకాశం గురించి ప్రస్తావిస్తూ, అగ్ని స్వచ్ఛతకు ప్రతీకగా నిలుస్తుందని, అదే విధంగా సివిల్ సర్వెంట్ నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. డబ్బు, అధికారం వంటి ప్రభావాలకు లొంగకుండా విలువలు, నైతికతతో ప్రజాసేవ చేయడమే నిజమైన సివిల్ సర్వెంట్ లక్షణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డితో పాటు ముఖ్య అతిథి మధుసూదన్, విశిష్ట అతిథి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జి.హెచ్.పి. రాజు, వినీల్ రెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందంతో పాటు కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# సరూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ యువ సంగ్రామ సభ విజయవంతం

- కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- యువతకు ఇచ్చిన హామీలు అమలు వెంటనే అమలు చేయాలి



ఎల్బీనగర్ జూలై 18 (జనం సాక్షి) : సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం భారత రాష్ట్ర సమితి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువ సంగ్రామ సభ'లో సభాధ్యక్షులుగా ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో యువ సంగ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సందర్భంగా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సరూర్‌నగర్ నుంచే కాంగ్రెస్ పార్టీ యువతకు హామీలు ఇచ్చిందని, అందుకే అదే ప్రాంతంలో యువ సంగ్రామ సభను నిర్వహిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, ఇతర సంక్షేమ హామీల అమలులో పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటిస్తున్న ఉద్యోగాల గణాంకాలపై సందేహాలు వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం చెప్పే లెక్కలు శుద్ధ అబద్ధమని అవి ప్రజల ముందుంచాలని కోరారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు నిరుద్యోగ యువతను నమ్మించి ఓట్లు పొందారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి ఆశలను నెరవేర్చలేదని ఆరోపించారు. యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రభుత్వ వైఖరే కారణమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో యువత కీలక పాత్ర పోషించిందని గుర్తుచేసిన కేటీఆర్, అదే యువశక్తి మరోసారి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ హక్కుల కోసం యువత పోరాడాలని సూచించారు. తన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీపై రాజకీయ విమర్శలు చేసిన కేటీఆర్, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో యువత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి

- ఆధునిక సౌకర్యాలతో విద్యా విప్లవం : మంత్రి అజహరుద్దీన్
- కష్టపడి ఉన్నత లక్ష్యాలు సాధించాలి
- తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యం



ఇబ్రహీంపట్నం, జులై 18: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ స్పష్టం చేశారు. శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంత్రి సందర్శించి, పాఠశాలలోని విద్యా, క్రీడా, మౌలిక వసతులను వివరంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై ప్లేగ్రౌండ్‌లో కొంతసేపు క్రికెట్ ఆడి వారితో సన్నిహితంగా మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థుల మధ్య గడపడం ఎంతో ఆనందంగా ఉందని, ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ పాఠశాలను చూసి సంతోషం కలిగిందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక విద్యా వాతావరణం, డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాల క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం ద్వారా ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో నాణ్యమైన విద్య అందించేందుకు ఆధునిక మౌలిక వసతులతో పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని బలోపేతం చేస్తూ డైట్ ఛార్జీలు పెంచి పోషకాహారం అందించే చర్యలు చేపట్టామన్నారు. విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో, క్రమశిక్షణతో రాష్ట్రానికి గర్వకారణం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, మంచాల్ తహశీల్దార్, ఆరుట్ల సర్పంచ్ శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలకు వెళ్లి ఎల్‌నినో పరిస్థితులపై అవగాహన కల్పించాలి

- కూరగాయలు, ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించండి
- పంటల సాగు, ప్రత్యామ్నాయ చర్యల వివరాలతో నివేదికలు తయారు చేయండి : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా
- కలెక్టరేట్ లో వ్యవసాయ, భూగర్భజల శాఖ అధికారులతో సమావేశం




**కరీంనగర్ బ్యూరో, జూలై 18 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లాలో వచ్చేవారం నుంచి గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి "ఎల్ నినో" పరిస్థితుల పై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎల్ నినో పరిస్థితులు, అధికారులు తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం (ఈనెల 19న) కరీంనగర్ లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, భూగర్భజల శాఖ అధికారులతో కలెక్టర్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్ నినోను ఎదుర్కొనేందుకు అత్యవసర ప్రణాళిక లో భాగంగా వ్యవసాయ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, లోటు వర్షపాతం వివరాలు తెలుసుకున్నారు. మండలంలో సాగు చేసే పంటల వివరాలు, నేల స్వభావం, భూగర్భ జలాలు, వర్షపాతం, వాతావరణ పరిస్థితులు, రైతుల వివరాలు పూర్తి నివేదికలతో సమావేశానికి రావాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఎంతమంది ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపారో వివరాలు నమోదు చేయాలన్నారు. జిల్లాలో కూరగాయల సాగును ప్రోత్సహించాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. కూరగాయల సాగుకు అనుకూలంగా ఉన్న ఆయా మండలాల వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను వివరించి, కూరగాయలు, పండ్ల మొక్కల సాగు పెంచాలన్నారు.

**ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి..**

నీటిపారుదల శాఖ, పంచాయతీ, విద్యుత్, రెవిన్యూ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని రైతులకు నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...గ్రామ సభల్లో గ్రామాల వారీగా సాంప్రదాయ పంటల వివరాలను నమోదు చేయాలన్నారు. నీరు లేకుంటే ఏ పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి ఉన్నారో, వారికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవనాధికారులు, భూగర్భ జల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# బహదూర్‌గూడలో భూముల వివాదం ఉద్రిక్తం







- ఫెన్సింగ్‌ను అడ్డుకున్న రైతులు.. పోలీసులతో తోపులాట
- పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసిరిన ఆందోళనకారులు
- 650 ఎకరాలు ప్రభుత్వ భూమేనంటున్న అధికారులు
- రైతులకు మద్దతుగా రాజకీయ నేతలు.. పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**శంషాబాద్, జూలై 18 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో ప్రభుత్వ భూముల స్వాధీనం, ఫెన్సింగ్ వ్యవహారం శనివారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు అవసరాల కోసం హైడ్రా, రెవెన్యూ అధికారులు సుమారు 650 ఎకరాల భూమికి ఫెన్సింగ్ వేసేందుకు భారీ పోలీసు బందోబస్తుతో గ్రామానికి చేరుకోగా, రైతులు, స్థానికులు తీవ్రంగా అడ్డుకున్నారు. గత వారం రోజులుగా శాంతియుతంగా ధర్నా చేస్తున్న రైతులు, హైడ్రా అధికారులు భారీ యంత్రాలతో ఫెన్సింగ్ పనులు ప్రారంభించడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత పెరిగింది. తమ వద్ద పట్టాలు ఉన్నాయని, తరతరాలు గా ఈ భూములను సాగు చేసుకుంటున్నామని రైతులు వాదించారు. సరైన పరిహారం, పునరావాసం, భవిష్యత్ భద్రతపై స్పష్టమైన హామీలు ఇచ్చిన తర్వాతే భూములు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వెయ్యికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. రైతులు "సీఎం డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేశారు. ఉద్రిక్త వాతావరణంలో కొందరు ఆందోళనకారులు పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసిరారు. ఈ ఘటనలో శంషాబాద్ డీసీపీ యోగేశ్ గౌతమ్‌తో పాటు పలువురు సీఐల కళ్లలో కారం పడింది. రైతు నరసింహ అస్వస్థతకు గురై స్పృహ తప్పిపడిపోయాడు. డీసీపీ యోగేశ్ గౌతమ్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూమికి మాత్రమే ఫెన్సింగ్ వేస్తున్నామని, సాగులో ఉన్న పంటలకు నష్టం జరగడం లేదని స్పష్టం చేశారు. రైతులు శాంతియుతంగా నిరసన తెలియజేయాలని కోరారు. అధికారులు సర్వే నంబర్లు 28, 62తో సహా 650 ఎకరాల ప్రభుత్వ భూమిని నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మద్దతు లభించింది. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని తర్వాత విడుదల చేశారు. బీజేపీ నాయకుడు తోకల శ్రీనివాస్ రెడ్డిని కూడా అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి విడుదల చేశారు. పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ, న్యాయస్థానం స్టే ఉన్న భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ప్రస్తుతం గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. భూముల స్వాధీన ప్రక్రియ కొనసాగుతుండగా అధికారులు, రైతులు, పోలీసుల మధ్య ప్రతిష్ఠంభన నెలకొంది.

# కాంగ్రెస్ నాయకులు "పురుమళ్ళ" సస్పెన్షన్ ఎత్తివేత

**కరీంనగర్ బ్యూరో జులై 18 (జనంసాక్షి) :**

కాంగ్రెస్ పార్టీ లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పురుమళ్ల శ్రీనివాస్ సస్పెన్షన్ ఎత్తివేస్తూ, పీసీసీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ నియోజకవర్గం లో ప్రాధాన్యత లేకుండా పోయిందని డీసీసీ కార్యాలయంలో సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు పార్టీ నాయకుల పై ఆరోపణలు చేశారన్న కారణంతో ఆయనను పార్టీ నుండి సస్పెండ్ చేశారు. ఆయన పై కరీంనగర్ కు చెందిన పలువురు నాయకులు ఫిర్యాదులు చేశారు. దీంతో కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న పురుమళ్ళ శ్రీనవాస్ కు పార్టీలో రీ ఎంట్రీ 2026 జులై 18 నుండి లభించింది. గత వారం రోజులుగా పురుమళ్ల శ్రీనివాస్ సస్పెన్షన్ ఎత్తివేసే విషయం పై పీసీసీ ముఖ్య నాయకులు సమాలోచనలు జరిపినట్లుగా తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయన విషయంలో అధిష్టానం సానుకూలంగా స్పందించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నాయకులతో సమాలోచనలు చేయడంలో పురుమళ్ల శ్రీనివాస్ సఫలం అయ్యారు. జిల్లాలోని కీలక నాయకులు సస్పెన్షన్ ఎత్తివేత పై తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్న సంకేతాలు ఇవ్వడంతో క్రమ శిక్షణ కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా సమాచారం. ఏది ఏమైనా పురుమళ్ల శ్రీనివాస్ రీ ఎంట్రీతో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీలో కీలక పరిణామం చోటు చేసుకున్నట్టయింది.

## 50 క్వింటాళ్ల ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం స్వాధీనం

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి గోదావరిఖని–2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్/నార్కోటిక్ బృందాలు శనివారం 8 ఇంక్లైన్ కాలనీలోని సంతోష్‌నగర్ లో ఆకస్మిక దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో సుమారు 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ. 2.25 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఈ ఘటనకు సంబంధించి మోతె కనుకయ్య (25), బేగంపేట గ్రామం, రామగిరి మండలానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితుడిని, స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో పాటు తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం గోదావరిఖని–2 టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులకు అప్పగించారు.

### అట్టహాసంగా ప్రారంభమైన 4వ ఆల్ ఇండియా ఓపెన్

# జూనియర్ చదరంగం పోటీలు

*పోటీలను ప్రారంభించిన నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు*




**కరీంనగర్ బ్యూరో, జూలై 18 (జనంసాక్షి) :** జీనియస్ చెస్ అకాడమీ, తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్, కరీంనగర్ డిస్ట్రిక్ట్ డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రోజున కరీంనగర్‌లోని వి కన్వెన్షన్‌లో 4వ ఆల్ ఇండియా ఓపెన్, జూనియర్ చదరంగం పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 2 రోజులు జరిగే పోటీలను నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... పిల్లలకు చదరంగం ఆటతో మెదశక్తి తో పాటు ఏకాగ్రత క్రమశిక్షణ అలవాటు పడతారని, తల్లిదండ్రులు పిల్లలు చిన్ననాటి నుండే చదరంగం ఆటపై మక్కువ చూపే విధంగా ప్రోత్సహించాలన్నారు. డిప్యూటీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ... ఎంతోమందిని చదరంగం క్రీడాకారులను తయారు చేస్తున్న జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, సీనియర్ కోచ్ అనూప్ కుమార్ ను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. టోర్నీ ఆర్గనైజర్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ... మాకు సహకరించిన బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్, వెంకట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంప వెంకట్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. 2 రోజులపాటు జరిగే ఈ పోటీలకు వివిధ ప్రదేశాల నుంచి 600 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ స్టేట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జనార్దన్ రెడ్డి, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్ కె.ఎపిపి చంద్ర జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, సీనియర్ కోచ్ టోర్నీ ఆర్గనైజర్ కంకటి అనుప్ కుమార్, చీఫ్ కరీంనగర్ డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కంకటి సృజన్ కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, ఆర్బిటర్ బొల్లం సంపత్ కుమార్, ఆర్బిటర్ అనిల్, చదరంగం క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# దోస్త్ స్పెషల్ ఫేజ్‌కు నోటిఫికేషన్

## డిగ్రీ ప్రవేశాలకు ఇదే చివరి అవకాశం

- జూలై 20 నుంచి 26 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- జూలై 30న సీట్ల కేటాయింపు.. ఆగస్టు 1లోపు రిపోర్టింగ్
- ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో పలు కోర్సుల్లో ఖాళీ సీట్లు
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ




**కరీంనగర్ టౌన్, జూలై 18 (జనం సాక్షి):** 2026–27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న దోస్త్ ప్రక్రియలో చివరి విడత అయిన స్పెషల్ ఫేజ్ షెడ్యూల్ విడుదలైనట్లు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ తెలిపారు. ఇప్పటివరకు డిగ్రీలో ప్రవేశం పొందని విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దోస్త్ స్పెషల్ ఫేజ్ షెడ్యూల్ ప్రకారం జూలై 20 నుంచి 26 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. అదే సమయంలో జూలై 20 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ కొనసాగనుంది. జూలై 30న సీట్ల కేటాయింపును ప్రకటించనుండగా, సీట్లు పొందిన విద్యార్థులు జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తిచేసిన విద్యార్థులు జూలై 31 నుంచి ఆగస్టు 1లోపు ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టీసీ)తో పాటు ఇతర విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో కళాశాలలో హాజరై రిపోర్ట్ చేయాలని ప్రిన్సిపాల్ సూచించారు. నిర్ణీత గడువులో ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ లేదా కళాశాలలో రిపోర్టింగ్ పూర్తి చేయని పక్షంలో కేటాయించిన సీటు స్వయంచాలకంగా రద్దు అవుతుందని స్పష్టం చేశారు. ఈ వివరాలను వెల్లడించేందుకు నిర్వహించిన సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్స్ పి. నితిన్, టి. రాజయ్య, అడ్మిషన్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ హర్జ్యోత్ కౌర్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. సత్యప్రకాష్, వివిధ విభాగాధిపతులు, దోస్త్ కోర్స్ కన్వీనర్లు పాల్గొన్నారు.

# పట్టపగలే ఒంటరి మహిళపై దాడి

**భయాందోళనకు గురైన కనగర్తి గ్రామస్తులు..పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు**



**ఇల్లంతకుంట, జులై 18 (జనం సాక్షి) :** ఇల్లందకుంట మండలం లోని కనగర్తి గ్రామానికి చెందిన రామిడి లక్ష్మి అనే మహిళా ఒంటరిగా ఇంట్లో వున్న సమయంలో పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని ఆమె మరిది రామిడి రాజిరెడ్డి శుక్రవారం మధ్యాహ్నం సమయంలో బాధితురాలు ఇంట్లో వున్న సమయంలో కిరాయి గుండాలతో దాడి చేశారు. ఆమె నివాసం ఉంటున్న మొదటి అంతస్తుకు పోయి అక్కడ వున్న సీసీ కెమెరా లను ధ్వంసం చేసి, ఇంటి తాళం పగలగొట్టి అక్రమంగా ఇంట్లోకి వచ్చిన శబ్దం రావడంతో కింద ఇంటిలో ఉన్న లక్ష్మీ పైకి వెళ్లి తాళం ఎందుకు పగుల కొట్టారు అని ప్రశ్నించగా అక్కడ వున్న రాజి రెడ్డి, అతని అనుచరులు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, దూర్భాష లాడుతూ దాడి చేసి నీకుటుంబాని చంపేస్తామని బెదిరించారని బాధితురాలు తెలిపింది. గతంలో కూడా ఈ గుండాలు తమ ఇంటి వద్దకు వచ్చి తన కుటుంబ సభ్యులను బెదిరించారని,అప్పుడు కూడా సిసి కెమెరాలో రికార్డయిన వాటిని సమర్పిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశామని కానీ ఎందుకో పోలీసులు వారి పైన కేసు నమోదు చేయలేదని బాధితురాలు పేర్కొంది. రాజిరెడ్డి మరియు అతను తీసుకువచ్చిన గుండాలతో తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని మీడియా ద్వారా పోలీసు ఉన్నతాధికారులకు లక్ష్మి విజ్ఞప్తి చేసింది. మాఫియా తరహాలో ఒకేసారి ఇంటిపై దాడి చేసి వీరంగం సృష్టించడంతో గ్రామంలోని ప్రజలు భయాందోళన చెందారు. ఈ విషయంపై ఎస్ఐ క్రాంతికుమార్ను వివరణ కోరగా ఇరువర్గాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### చెక్ బౌన్స్ కేసుల్లో రాజియే ఉత్తమం : జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి

**మెట్ పల్లి, జులై 18(జనం సాక్షి) :** చెక్ బౌన్స్ కేసుల్లో రాజీ చేసుకోవడమే ఉత్తమం అని మెట్ పల్లి జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి అన్నారు. మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చెక్ బౌన్స్ లాంటి డాక్యుమెంట్ ఎవిడెన్స్ కేసుల్లో కంటెస్టింగ్ కన్నా, రాజీ చేసుకోవడానికే కక్షిదారులు ప్రయత్నించాలని సూచించారు. కేసుల్లో పరస్పరం రాజీ పడటం వలన సమయం తో పాటూ, ఖర్చులూ ఆదా అవుతాయాని అన్నారు. ఈనాటి ప్రత్యేక లోక్ అదాలత్ లో 15 పెండింగ్ కేసుల్ని రాజీ ద్వారా పరిష్కరించినట్టు తెలిపారు. నేటి లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేసిన పోలీసులకు, సహకరించిన న్యాయవాదులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి , ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, మీడియాషన్ కో ఆర్డినేటర్లు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణుగోపాల్, పసునూరి శ్రీనివాస్, లోక్ అదాలత్ మెంబర్లు వద్దేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్, న్యాయవాదులు దండబోయిన యాదగిరి పాల్గొన్నారు.


జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
19 జూలై 2026

# తెలంగాణ గవర్నర్‌తో అస్సాం గవర్నర్ భేటీ



హైదరాబాద్, జూలై 18 (జనంసాక్షి) : తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో శనివారం అస్సాం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య భేటీ అయ్యారు. ఇద్దరు గవర్నర్లు పరస్పర ఆసక్తి కలిగిన వివిధ అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. రాజ్యాంగ విలువల పరిరక్షణ, దేశ సమాఖ్య స్ఫూర్తి బలోపేతం, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. రెండు రాష్ట్రాల్లో అమలవుతున్న అభివృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాలపై పరస్పరం సమాచారం పంచుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రత్యేకతలను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అస్సాం గవర్నర్‌కు వివరించారు. హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన అస్సాం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, తమ కుటుంబ సభ్యులతో కలిసి లోక్‌భవన్ రాగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా, వారి సతీమణి జానకి శుక్లాలు పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయ స్వాగతం పలికారు. గవర్నర్ దంపతులకు మెమెంటో అందించారు.

# బడి ఉంది.. విద్యార్థులేరీ!



## కనుమరుగవుతున్న ప్రభుత్వ విద్యాసౌధాలు.. భవిష్యత్తు ప్రశ్నార్థకం

**ఒకానొక కాలంలో చిన్నారుల కేకలతో, అక్షరాల సవ్వడితో కిటకిటలాడిన ప్రభుత్వ పాఠశాలలు నేడు బోసిపోతున్న దృశ్యం విద్యావేత్తలను, తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యాబుద్ధులు నేర్పే ఆలయాలుగా వెలుగొందిన సర్కారు బడుల్లో ఇప్పుడు బడిగంట మోగుతోంది. కానీ, ఆ ధ్వనిని అనుసరించే చిన్నారుల అడుగుజాడలు మాత్రం కనిపించడం లేదు. అత్యాధునిక భవనాలు, ప్రభుత్వ వసతులు అందుబాటులో ఉన్నా విద్యార్థులే లేకపోవడం ఈ విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న లోతైన సంక్షోభానికి అద్దం పడుతోంది.**

సంస్థాన్ నారాయణపూర్ (జనంసాక్షి) :

### కడపగండి తండా బడి... దుస్థితికి నిదర్శనం

యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపూర్ మండలంలోని కడపగండి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఈ పరిస్థితికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన ఈ పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ప్రభుత్వం భవనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఈ పాఠశాల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ బడి కూడా జీరో ఎన్రోల్మెంట్‌తో విలీనమయ్యే లేదా మూతపడే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### 'అక్షరం' దూరమైంది.. 'వ్యామోహం' చేరువైంది

విశ్లేషకులు, విద్యావేత్తలు ప్రభుత్వ బడుల పట్ల నిర్లక్ష్యం పెరగడానికి, అడ్మిషన్లు క్షీణించడానికి కొన్ని ముఖ్య కారణాలను గుర్తిస్తున్నారు. ప్రైవేట్ వ్యామోహం, సామాజిక ఒత్తిడి: నాణ్యమైన విద్య అందుతుందన్న భావనతో మధ్య తరగతి కుటుంబాలు కూడా అప్పులు చేసి ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. మౌలిక వసతుల కొరత: కొన్ని గ్రామీణ ప్రభుత్వ బడుల్లో తాగునీరు, మరుగుదొడ్లు, భవనాల నిర్వహణ వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టినా బోధనా నాణ్యతపై ఇంకా సందేహాలున్నాయి. ప్రభుత్వ పథకాలపై అవగాహన లేకపోవడం వల్ల కూడా అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు.

### జీరో ఎన్రోల్మెంట్... మూతపడే ప్రమాదం


ప్రస్తుత పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో వందలాది ప్రభుత్వ పాఠశాలలు సున్నా ప్రవేశాలతో మూతపడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు లేని కొన్ని పాఠశాలలను సమీపంలోని పెద్ద పాఠశాలల్లో విలీనం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో గ్రామీణ, మారుమూల ప్రాంతాల పేద విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొంటోంది.

### పునరుజ్జీవనానికి ఐదు మార్గాలు

ప్రతి ప్రభుత్వ బడిని ప్రైవేట్ స్కూళ్లతో పోటీపడేలా స్మార్ట్ క్లాసులు, హైటెక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించాలి. ఉపాధ్యాయులు గ్రామస్థులతో నిరంతరం మమేకమై డ్రాపౌట్లను నివారించాలి. పాఠశాలల పనితీరుపై డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, ఉర్దూ మాధ్యమాలను కూడా సమానంగా బలోపేతం చేసి తల్లిదండ్రులకు నమ్మకం కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలలు నిలబడితేనే గ్రామీణ పేద పిల్లల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని, కడపగండి తండా వంటి పాఠశాలలను కాపాడేందుకు ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కలిసి వెంటనే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# ఖాకీల్లో మానవత్వం

- మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అండగా జగిత్యాల పోలీసులు
- స్నానం, క్షవరం, కొత్త దుస్తులు అందజేత.. వైద్య పరీక్షల అనంతరం ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలింపు




జగిత్యాల బ్యూరో (జనంసాక్షి) : శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా జగిత్యాల పోలీసులు చాటిచెప్పారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ కుటుంబాలకు దూరమైన వ్యక్తులను గుర్తించి వారికి మానవీయ సహాయం అందించి చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, జిల్లా ఎస్పీ ఆదేశాలు, డీఎస్పీ సూచనల మేరకు పట్టణంలో సంచరిస్తున్న సుమారు 14 మంది మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులను గుర్తించారు. వారికి స్నానం చేయించి, క్షవరం చేయించి, ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అల్పాహారం, కొత్త దుస్తులు అందజేసి ఆప్యాయంగా ఆదుకున్నారు.

వైద్యుల పరీక్షల అనంతరం చికిత్స అవసరమని నిర్ధారించడంతో కోర్టులో హాజరుపరిచి, తదుపరి చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రికి తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. వారు త్వరగా కోలుకుని తమ కుటుంబ సభ్యుల వద్దకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ కరుణాకర్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం, టౌన్ ఎస్ఐ ఎం. సుప్రియతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజల ప్రశంసలు

ఈ మానవీయ కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు అభినందించారు. "ఖాకీ అంటే కేవలం కఠినత్వమే కాదు.. కరుణ, సేవాభావం కూడా ఉంటాయని జగిత్యాల పోలీసులు తమ చర్యల ద్వారా నిరూపించారు' అని పలువురు ప్రశంసించారు.

# నకిలీ డీఏపీ మాఫియా గుట్టురట్టు

- హైదరాబాద్‌లో గుట్టుచప్పుడు కాకుండా తయారీ కేంద్రాలపై పోలీసుల మెరుపుదాడులు
- రూ.1.50 కోట్ల విలువైన వెయ్యి బస్తాలు స్వాధీనం.. నిందితులు పరార్
- రాష్ట్రవ్యాప్తంగా రైతులను మోసం చేసిన ముఠాపై వేట



హుజూర్‌నగర్, జూలై 18 (జనంసాక్షి): రైతుల కష్టార్జిత డబ్బును కొల్లగొట్టేందుకు నకిలీ డీఏపీ ఎరువుల పేరుతో భారీ మోసానికి పాల్పడుతున్న ముఠా గుట్టును పోలీసులు రట్టుచేశారు. హుజూర్‌నగర్ నియోజక వర్గంలోని మఠంపల్లి మండలం రఘునాథ పాలెంలో వెలుగులోకి వచ్చిన నకిలీ ఎరువుల కేసు దర్యాప్తు హైదరాబాద్ వరకు విస్తరించగా, పెద్ద అంబర్‌పేటలో నిర్వహించిన మెరుపు దాడుల్లో సుమారు రూ.1.50 కోట్ల విలువైన వెయ్యి నకిలీ డీఏపీ బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే పోలీసుల రాకను ముందుగానే పసిగట్టిన ముఠా సభ్యులు పరారయ్యారు. హుజూర్‌నగర్ సీఐ జి. చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం, నకిలీ డీఏపీ కొనుగోలు చేసిన రైతు ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసు విచారణలో కీలక ఆధారాలు లభించాయి. దీంతో ప్రత్యేక బృందం హైదరాబాద్‌లోని పెద్ద అంబర్‌పేట, హరితహారం కాలనీలో ఉన్న గోదాములు, తయారీ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించింది.

### ఉప్పు.. మట్టి.. రసాయనాలే డీఏపీగా..!

తనిఖీల్లో హసాల్ట్, గ్రోమోర్, కోరమండల్, అన్నపూర్ణ తదితర ప్రముఖ కంపెనీల పేర్లతో ఉన్న ఖాళీ సంచుల్లో ఉప్పు, మట్టి, ఇతర నాసిరకం పదార్థాలను రసాయనాలతో కలిపి డీఏపీగా తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రింటింగ్, స్టిచింగ్ యంత్రాలతో అసలు కంపెనీ సంచుల్లాగే ప్యాకింగ్ చేసి రైతులను బురిడీ కొట్టిస్తున్నట్లు బయటపడింది.

### తెలంగాణలో పలుచోట్ల సరఫరా

ఈ నకిలీ ఎరువులను డీసీఎం వాహనాల ద్వారా మేళ్లచెరువు, నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లితో పాటు మరికొన్ని ప్రాంతాలకు ఏజెంట్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఒక్కో బస్తాను సుమారు రూ. 1,500కు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రఘునాథపాలెంలో ప్రారంభమైన ఈ కేసు దర్యాప్తు హైదరాబాద్ వరకు చేరుకో వడం వ్యవసాయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. నకిలీ ఎరువుల తయారీ, సరఫరా వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? రాష్ట్రంలో ఇంకా ఎన్ని జిల్లాలకు ఈ ఎరువులు చేరాయి? అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసులో మరికొం దరి ప్రమేయం ఉన్నట్లు అనుమా నిస్తున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

### రైతులకు సీఐ హెచ్చరిక

స్వాధీనం చేసుకున్న నకిలీ ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, అనుమానాస్పద ఎరువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరు మెరుగు

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా




హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరు మెరుగుపడిందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడంతో, ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే సంఖ్య కూడా పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. అదే సమయంలో ప్రైవేటు హాస్పిటళ్లకు వచ్చే పేషెంట్ల సంఖ్య తగ్గుతున్నట్టు ప్రైవేటు హాస్పిటళ్ల యజమానులు చెబుతున్నారని మంత్రి వెల్లడించారు. మరోవైపు, ప్రభుత్వ హాస్పిటళ్లలో పనిచేసేందుకు డాక్టర్లు ఆసక్తి చూపుతున్నారని, ఇటీవల జరిగిన డాక్టర్ల రిక్రూట్‌మెంట్లతో ఈ విషయం స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ మేరకు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్, ఏరియా హాస్పిటళ్లు సహా వంద బెడ్లు కలిగిన అన్ని ప్రభుత్వ హాస్పిటళ్ల సూపరింటెండెంట్లతో మంత్రి శనివారం సమావేశం నిర్వహించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, ఆరోగ్యశ్రీ సీఈవో హనుమంతు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్‌పర్సన్, డాక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరు మెరుగు పడడంలో సూపరింటెండెంట్ల పాత్ర అత్యంత కీలకం అని మంత్రి అభినందించారు. పేషెంట్లు తమ పెట్టుకున్న నమ్మకాన్నా కాపాడుకుంటూ, వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు, డాక్టర్లు, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అందరిపై ఉందన్నారు. ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు అవసరమైన అన్ని వసతులను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో సుమారు 14 వేల పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు.. డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది సహా అవసరమైన అన్ని విభాగాల్లో నియామకాలు చేపట్టామని, ఇంకా అవసరమున్న చోట్ల పోస్టుల భర్తీ కొనసాగుతోందన్నారు. అద్దె భవనాలు, పాత భవనాలు, ఇరుకు భవనాల్లో కొనసాగుతన్న హాస్పిటళ్ల స్థానంలో కొత్త భవనాలు నిర్మించి ఇస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. అవసరమైన మెడిసిన్, సర్జికల్స్ అన్ని అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అన్ని వనరులను అందిస్తున్న నేపథ్యంలో సేవల నాణ్యతలో లోపాలకు ఎలాంటి సాకులు చెప్పొద్దని సూపరింటెండెంట్లకు మంత్రి సూచించారు. ఏ అవసరం ఉన్నా జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్, శాఖ హెచ్‌వోడీ మొదలుకుని మంత్రి వరకూ అందరికీ సమాచారం చేరవేయాలని మంత్రి సూచించారు.

ప్రతి సూపరింటెండెంట్ తన హాస్పిటల్‌ను ఓన్ చేసుకోవాలని, రోగులు ఆసుపత్రిలో అడుగుపెట్టిన నాటి నుంచి డిశ్చార్జి అయ్యే వరకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వ్యవస్థను రూపొందించాలని మంత్రి సూచించారు. ప్రతి రోజు వార్డులను స్వయంగా సందర్శించి రోగులతో మాట్లాడాలని, వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, భోజన నాణ్యత, భద్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

డాక్టర్లు, నర్సులు, సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం, అనవసర గైర్హాజరు, రోగులను గంటలతరబడి వెయిట్ చేయించడం.. ట్రీట్‌మెంట్‌లో జాప్యం చేయడం వంటి అంశాలను సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. అత్యవసర విభాగాలు, ఐసీయూలు, ప్రసూతి విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ యూనిట్లు, ల్యాబ్‌లు, బ్లడ్ బ్యాంకులు, రేడియాలజీ సేవలు 24 గంటలు సమర్థవంతంగా పనిచేసేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ప్రాణాపాయ స్థితిలో వచ్చే రోగులకు ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే చికిత్స ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక వైద్య పరికరాలు వినియోగంలో ఉండేలా చూడాలని, పనిచేయని పరికరాలను వెంటనే మరమ్మతు చేయించాలని, మందుల కొరత, పరికరాల లోపం, మౌలిక సదుపాయాల సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని మంత్రి సూచించారు. హాస్పిటళ్ల పనితీరును ఇకపై నిరంతరం సమీక్షిస్తామని, ఇందుకోసం డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఓపీ, ఐపీ సేవలు, శస్త్రచికిత్సలు, అత్యవసర సేవలు, మాతా-శిశు ఆరోగ్య సేవలు, రోగుల సంతృప్తి, పరిశుభ్రత, సేవల నాణ్యత వంటి సూచీల ఆధారంగా పనితీరును అంచనా వేస్తామని చెప్పారు. ఉత్తమ పనితీరు కనబరిచిన డాక్టర్లు, సిబ్బందిని ప్రోత్సహిస్తామని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

- 16 నుండి 26 వరకు 'బోనాలు- చేతివృత్తుల మేళా'
- ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శనలు
- మంత్రి పొన్నం ప్రభాకర్




హైదరాబాద్, జూలై 18 (జనంసాక్షి) : చేతి వృత్తి కళాకారులకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బోనాలు-చేతివృత్తుల మేళా, బిసి చేతివృత్తుల అమ్మకాలు- ప్రదర్శన'ను ఈనెల 16వ తేదీ నుండి 26 వరకు ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహము ప్రక్కన గల గ్రౌండ్స్ లో నిర్వహిస్తోంది. చేతివృత్తుల కళాకారులచే తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, విక్రయము విజయవంతంగా కొనసాగుతున్నది. ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారు చేసిన మట్టిపాత్రలు, గౌడన్నల 'నీరా' స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు, హ్యాండ్ లూమ్స్ పోచంపల్లి-ఇక్కత్, గద్వాల్ - నారాయణపేట్, పూసలవారి సామగ్రి, మహిళా స్వయం సహాయక సంఘాల స్వగృహ ఫుడ్స్, ఇతర బిసి వర్గాలచే తయారు చేయబడిన వస్తువులు, తెలంగాణ వంటకాలు, మత్స్య కారుల తయారు చేయబడే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో లభించే వస్తువులు వినియోగదారులకు, సందర్శకులకు సరసమైన ధరలలో లభ్యమవుతున్నాయి. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 10:00 గంటల వరకు కొనసాగుతున్నది. ప్రభుత్వం సందర్శకులకు ప్రవేశము ఉచితంగా కల్పిస్తున్నది. ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణతో స్టాల్స్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేనేత, హస్తకళలు, మట్టి కళలు, చెక్క బొమ్మలు వంటి సంప్రదాయ కళలను ప్రోత్సహించడ మే ఈ మేళా ప్రధాన లక్ష్యమని, గ్రామీణ కళాకారుల ప్రతిభకు మార్కెట్ కల్పిస్తూ వారి జీవనోపాధిని బలోపేతం చేయడంలో ఇటువంటి మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనకు అనుగుణంగా స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని, సాంప్రదాయ కళలను నేటి తరానికి పరిచయం చేసి, భావితరాలకు అందించడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉందన్నారు. మేళాలో పాల్గొన్న ప్రతి కళాకారుడికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మన కళలు, మన చేతివృత్తులు? మన సంపద అనే భావనతో ప్రతి ఒక్కరూ ఈ మేళాను విజయవంతం చేయాలన్నారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించెందుకు ప్రభుత్వం ప్రదర్శనను ఏర్పాటు చేసింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370